
Deccan Land

JUN 2025




Deccan

JUN

జూన్ - 2025

PRGI Regn. No. TELTEL/2012/46784

₹30


# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD

154

JUNE - 2025



VOL 13వ వసంతంలో
154 ISSUES నూట యాభై నాల్గవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్


- కొత్త బౌద్ధక్షేత్రం చాడ
- సింధు జలాల ఒప్పందం నెహ్రూ చారిత్రక తప్పిదమా
- ఆపరేషన్ సింధూర్
- పర్యావరణ చరిత్ర - మానవ సంస్కృతుల చరిత్ర

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



**ప్రతులకు**


అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






## UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2025

**Mudumal Megalithic Menhirs:**
Narayanapet District,Telangana, India
Category: Cultural

## ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్

ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ ప్రశాంతమైన స్థలంలో, విధ్వంసానికి గురి కాని ప్రకృతి ఒడిలో ఉంది. చుట్టూరా పొలాలు. ఇక్కడ పురాతన రాళ్ళు మనం మరచిపోయిన యుగంలోకి మనల్ని తీసుకెళ్తాయి. ఈ ప్రాంతపు శాశ్వత కాపలాదారులుగా ఎత్తుగా, నిశ్శబ్దంగా నిలబడి ఉన్న రాళ్లు మనల్ని తిరిగి పాత యుగంలోకి మనల్ని తీసుకెళ్తాయి. ముడుమల్ గ్రామానికి నైరుతి దిశలో సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణ నది ఒడ్డున ఈ ఈ ప్రదేశం ఉంది. ఒక చిన్న కొండతో సహా 80 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. పురాతన కాలపు మానవులు ఈ మెన్హిర్‌లను ఖగోళ విశేషాలతో జాగ్రత్తగా సమలేఖనం చేయడం ద్వారా, అయనాంతం, విషువత్తులు, నక్షత్ర రాశులను గుర్తించడం ఇక్కడి విశేషం.

*ప్రత్యేక వ్యాసం : 27వ పేజీలో*

TRC
TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## తెలంగాణ సంస్కృతికి గుర్తు సామల

దక్కన్ ల్యాండ్ మే మాసంలో వచ్చిన ఒక సంభాషణ చాలా ఆసక్తిగా అనిపించింది. పరవస్తు లోకేశ్వర్ గారు మరియు సామల సదాశివ గారి సంభాషణ అది. అంపులో తెలంగాణ సరిహద్దు జిల్లాలలో ఉండే బాషా సౌందర్యం, అప్పటి ఉర్దూ సినిమాల గురించి, తెలంగాణ తొలిదశ ఉద్యమ చరిత్ర గురించి మాత్రమే కాక అప్పటి భూస్వామ్య విధానం గురించి సవివరమయిన చర్చ జరగడం సంతోషం. ఇక పోతే ఇది రాస్తున్న కాలానికి వనరుషి రామయ్య గారి మరణం ఒకవైపు ఆ సంభాషణ జరిగిన చింతచెట్టు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. ఇకపోతే ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి అని తెలంగాణ ప్రజా సంఘాలు పౌర సంఘాలు చేస్తున్న కృషి ఫలించాలి అని కోరుకుంటూ...

– **భారత అవినాశ్,** ముత్తారం, పాలకుర్తి

## శోకసముద్రంలో వృక్షజాతి

వనజీవి రామయ్య (దరిపల్లి రామయ్య) ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామం (స్వగ్రామం ముత్తగూడెం)లో 1937 జులై 1న లాలయ్య, పుల్లమ్మ పుణ్యదంపతులకు జన్మించి, కోటికి పైగా మొక్కలను నాటి, వాటిని మహా వృక్షాలుగా పెంచి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. వీరి సేవకు పద్మశ్రీ (సామాజిక సేవ), సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి వనమిత్ర, భారత ప్రభుత్వం నుంచి వనసేవా, ఖమ్మం రోటరీ క్లబ్ అవార్డు, యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. నాడు శ్రీరాముడు అయోధ్యను వీడి సీతా లక్ష్మణ సమేతంగా వనవాసానికి వెళ్ళినప్పుడు అయోధ్యాపురంలోని ప్రతి ఒక్కరు రోదించారట. నేడు (2025 ఏప్రిల్ 12న) ఆ వనమాలి వనజీవి రామయ్య భూలోకాన్ని వీడి దివికేగిన తరుణంలో వనాలు విలపించాయి. తమను ఇన్నాళ్లు సాదుకుని ఆదుకుని నిలబెట్టిన రామయ్య తనే కాలం ఒడిలో ఒదిగిపోయినందుకు వృక్షజాతి శోకసముద్రంలో ఉండిపోయాయి. ఆ వనజీవి గురించి వివరంగా ప్రచురించిన దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– **బి. అనిత,** ఖమ్మం

❖ ❖ ❖

## మీడియా ప్రజలకు ప్రభుత్వానికి వారధి

పత్రికలు చట్టసభల్లో ప్రతిపక్షాల పాత్ర పోషిస్తాయి. నిష్పాక్షికంగా ప్రజల తరఫున నిలబడి, నిజాయితీగా సమాచారాన్ని ఇస్తూ, విచక్షణాపూర్వక సంయమనంతో విశ్లేషణలు చేస్తుంటాయి. కృష్ణాపత్రిక, గోలకొండ, ఆంధ్రపత్రికలకు శతాబ్దాల చరిత్ర వుంది. అప్పటి మీడియాకు సమాజంపట్ల బాధ్యత వుండేది. సమాజానికి కూడా మీడియా అంటే గౌరవం వుండేది. నేడు మీడియా అనేక రూపాంతరాలు చెందింది. డిజిటల్ మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ ఇలా కొత్త పుంతలు తొక్కుతుంది. ఫేక్ న్యూస్ ఎక్కువ సమాజంపై వదులుతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయి. పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండి సామాజిక రంగంలో నైతికతకు పునాదుల వేసి ప్రజల ఆలోచనా విధానాలు ప్రభుత్వాలకు తెలియజేయాలి. జాతీయ ఉద్యమం నుండి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం దాకా ప్రజలను కదిలించి, చైతన్యపరిచి కార్యోన్ముఖులను చేయడంలో మీడియా ఘణనీయ పాత్రను పోషించాయి. అందులో దక్కన్‌ల్యాండ్ కూడా తనవంతు పాత్ర నిర్వహించింది. జర్నలిస్టులు కూడా నిక్షపతంగా విశ్లేషణ చేయాలి. ప్రజల పక్షాన పనిచేసే గొంతుకులను అణిచివేయడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో మంచిది కాదు.

– **కె. అరుణ్,** హైదరాబాద్ ద

## వింతైన జంతు ప్రపంచం 'వంతారా'

రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వంతారా జంతు ప్రపంచాన్ని సృష్టించి అందులో 200 ఏనుగులతో పాటు 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటి బాగోగులు చూసుకునేందుకు వందలమంది డాక్టర్లు, నిపుణులను ఏర్పాటు చేశారు. ఈ వింతైన జంతు ప్రపంచం చూడ్డానికి గుజరాత్‌లోని జామ్ నగరం వెళ్దాం.

– **ఎ. అఖిలేష్,** కడప

❖ ❖ ❖

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 13 సంచిక : 10 పేజీలు : 60

జూన్ - 2025

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

వాణిజ్య ప్రకటనలు
**కె. సచిన్**
86866 64949

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020
Mobile: 90599 50055
deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా
TELANGANA RESOURCE CENTRE
DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.



కవర్ స్టోరీ
27వ పేజీలో

## లోపలి పేజీల్లో...



యోగాతో
సంపూర్ణ ఆరోగ్యం



తెలంగాణ:
ఆషాఢ బోనం


గోలకొండ కోటలో సర్వాయి పాపన్న స్మారకం నెలకొల్పాలి .......... వేముల ప్రభాకర్ .......... 6
ప్రకృతిని ప్రేమిద్దాం! ..... (ఎడిటోరియల్) .......... వేదకుమార్. యం .......... 7
'వజ్ర' మానం. .......... చకిలం వేణుగోపాలరావు .......... 9
ఆషాఢ బోనం .......... ఎసికె. శ్రీహరి .......... 12
"స్వంత కథ" .......... పరవస్తు లోకేశ్వర్ .......... 13
పర్యావరణ చరిత్ర - మానవ భావాల చరిత్ర .......... డా॥ ఆర్. సీతారామారావు .......... 15
తెలుగునేలకు తొలి శిల్పాలనందించిన తెలంగాణా! .......... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి .......... 17
దక్కన్‌ల్యాండ్ జైత్రయాత్ర .......... జి. విజయ్‌కుమార్ .......... 18
ఆపరేషన్ సింధూర్..!! .......... పుట్టా పెద్ద ఓబులేసు .......... 19
సమతుల్యం కోల్పోతున్న ప్రకృతి .......... జుగాష్ విలి .......... 23
ఉమ్మడి కృష్ణా జిల్లా శిలా మరియు ఖనిజ సంపద .......... కమతం మహేందర్‌రెడ్డి .......... 25
ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ .......... ఎన్. వంశీమోహన్ .......... 27
పట్టణీకరణ .......... నందితా బెనర్జీ .......... 34
సింధు జలాల ఒప్పందం నెహ్రూ చారిత్రక తప్పిదమా .......... శ్రీధర్‌రావు దేశ్‌పాండే .......... 35
'భూపతి చంద్ర' స్మారక పురస్కార ప్రదానోత్సవం .......... ధర్మపురి లక్ష్మణస్వామి .......... 39
పర్యావరణ స్పృహ - పర్యావరణ రచనలూ! .......... డా॥ నాగసూరి వేణుగోపాల్ .......... 41
యోగాతో సంపూర్ణ ఆరోగ్యం .......... కె. సచిన్ .......... 44
ఉర్దూ మన భాషే .......... మంగారి రాజేందర్ (జింబో) .......... 45
కొత్త బౌద్ధక్షేత్రం చాడ .......... శ్రీరామోజు హరగోపాల్ .......... 47
మ్యూజియంలపై అవగాహన తప్పనిసరి .......... ఖైజర్ .......... 51
సేవ్ ఓషన్.. సేవ్ లైఫ్ .......... దక్కన్ న్యూస్ .......... 53
ప్రపంచ సుందరీమణులు .......... చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ .......... 54
జపాన్‌లో వరి సంక్షోభం .......... షాగున్‌జీ .......... 55
'క్లోర్‌పైరిఫోస్' పురుగుమందు నిషేధించాలి! .......... వివేక్ మిశ్రా .......... 56
పూటకూళ్ళవ్వ (కథ) .......... మాదారపు వాణిశ్రీ .......... 57



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# గోలకొండ కోటలో సర్వాయి పాపన్న స్మారకం నెలకొల్పాలి

## కొత్తగా ఏర్పడిన జనగామ జిల్లాకు ఆ సర్దార్ పేరు పెట్టాలి!

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న (1650-1709) ఒక సామాన్య గీతకార్మికుడై వుండి స్థానిక భూస్వాములను ఎదుర్కొంటూ మొఘల్ పాలకులతో పోరాటం చేసే స్థాయికి ఖిలషాపురం నుండి గోల్కొండ వరకు ఎదగడం చరిత్ర.

17వ శతాబ్దిలో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొని మరాఠా పాలకుడైన ఛత్రపతి శివాజీ (1627-1680)తో పోల్చుకుంటే, దక్షిణభారత (తెలంగాణా) చరిత్రలో పాపన్నకు ఇప్పటికీ సరియైన గుర్తింపు రాలేదనే చెప్పాలి.




1709 లో పాపన్న వీరమరణం తర్వాత దాదాపు వందసంవత్సరాల వరకు అయన త్యాగాలగాథను కాపాడిన ఘనత జానపదులది.

1874లో జేఏ బోయల్ అనే అంగ్లేయుడు బళ్లారిలో చేసిన జానపద సాహిత్య సేకరణలో భాగంగా లభించిన పాపన్న పాటను పత్రికల్లో ప్రకటించాకనే చరిత్రకారులు ఆయన పై దృష్టి సారించారని చెప్పవచ్చు.

క్యాంబ్రిడ్జి యూనివర్సిటీ వారు 2005 లో ప్రచురించిన Rechard M Eaton గారి 'A Social History of Deccan 1300-1761 Eight Indian Lives' లో పాపన్న చరిత్ర గ్రంథస్థం కావడం విశేషం.

'సర్వాయి పాపడు కథ' పేరుతో 1906లో శ్రీ ఉప్పల గౌరయ్య శెట్టి గారు ఒక చిన్న పుస్తకాన్ని చెన్నపురి నుండి ప్రకటించాడు.

పాపన్న కథను చరిత్రతో సమన్వయం చేసి ప్రకటించినవాడు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు.

తమ 'నల్లగొండ జిల్లా సర్వస్వము' లో పాపన్న విజయాలను పేర్కొన్నవాడు శ్రీ బిఎన్ శాస్త్రి గారు.

తమ పరిశోధనా గ్రంథం 'జానపద గేయసాహిత్యం'లో ఆచార్య శ్రీ బి రామరాజు గారు పాపన్న పై వచ్చిన జానపదుల పాటలను పేర్కొన్నారు.

ఖిలాషాపురం వాస్తవ్యుడైన శ్రీ చొల్లేటి నరసింహశర్మ గారు 1952 లోనే పాపన్న చరిత్రను గోలకొండ పత్రికకు ఎక్కించారు.

శ్రీ పివి రాజమన్నారు గారి రచన 'సర్దార్ పాపడు & అదర్ స్టోరీస్' ఎమెస్కో వారి ద్వారా 1972లో వెలువడింది.

సర్వశ్రీ ఆదిరాజు వీరభద్రారావు, పివి పరబ్రహ్మ శాస్త్రి, ప్రొఫెసర్ తూమాటి దోనప్ప, ఏటుకూరి బలరామమూర్తి, డాక్టర్ సరగు కృష్ణమూర్తి, ప్రొఫెసర్ తిరుమలి, హరి ఆదిశేషువు, ఘంటమరాజు, దేవులపల్లి అమర్, బుడ్డిగ ఆదినారాయణ మూర్తి, నిమ్మల అర్జున్ గౌడ్, కొంపల్లి వెంకట్ గౌడ్, చింతల వజ్రంగౌడ్, వట్టికూటి రామారావు గౌడ్, కట్టా రవీంధర్, అంబాల నారాయణ్ గౌడ్, భట్టు విజయకుమార్ లాంటి వాళ్ళు పాపన్న చరిత్రను వివిధ కోణాల్లో, వివిధ ప్రక్రియల్లో పరిశీలించి ప్రకటించారు.

నేను కలంపట్టిన తొలినాళ్ళ నుండి గత అయిదున్నర దశాబ్దాలకు పైగా (1970-2025) కాలంలో సర్దార్ సర్వాయి పాపన్న గురించి వివిధ పత్రికలకు పెక్కు వ్యాసాలు, కవితలు రాశాను.

అందులో పాపన్న పై నాటి నుండి నేటివరకు వచ్చిన ఎంతోమంది కవులు, రచయితల గ్రంథాలను సమీక్షించాను.

నేను పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ గానున్న కాలంలో (2002-04), ఒక అధికారిక కార్యక్రమంలో భాగంగా ఖిలాషాపురం వెళ్లినప్పుడు, శిథిలావస్థకు చేరి, కాలగర్భంలో కలిసిపోతున్న పాపన్న నిర్మించిన ఖిలాను చూసి ఎంతో బాధపడ్డాను, దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రభుత్వ శాఖలకు విజ్ఞప్తి కూడా చేశాను.

తెలుగు సినిమా రంగంలో 'సర్దార్ పాపన్న' పేరుతో శ్రీ పంజాల జైహింద్ గౌడ్ గారు అన్నీ తానై, శ్రీ ప్రతాని రామకృష్ణ గౌడ్ గారి దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 2006 ఆగష్టు లో

(తరువాయి 8వ పేజీలో)




# ప్రకృతిని ప్రేమిద్దాం! మనల్ని మనం కాపాడుకుందాం?

ప్రకృతి, పర్యావరణం – ఈ రెండూ విడదీయలేని పదాలు. పర్యావరణం ప్రకృతి సంబంధిత అంశమే గానీ అది సామాజికమైనది కూడా. మానవ సమాజానికి ప్రకృతికి వున్న విడదీయరాని అనుబంధం వల్ల పర్యావరణం సామాజికమైనది. ఎప్పుడైతే సామాజికమైందో అప్పుడు అది రాజకీయ అంశమవుతుంది. సామాజిక అంశాలను నడిపేది, నిర్వహించేది రాజకీయ విధానాలే కనుక పర్యావరణం రాజకీయ అంశమవుతుంది. రాజకీయ విధానాలు ఆయా కాలాలలో వున్న వ్యవస్థల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయి. ఆయా విధానాలు మానవ జీవితంలోని ప్రతి సూక్ష్మ, పార్శ్వాన్నీ ప్రభావితం చేస్తాయి. ప్రకృతి, పర్యావరణం దీనికి మినహాయింపుకాదు.

ప్రకృతి ఒక్క మానవ సమూహానిది మాత్రమే కాదని సకల జీవరాసులదీ అని యిప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. సహజంగానూ, మానవ తప్పిదాల వల్లనూ ప్రకృతిలో అనేక మార్పులు వస్తున్నాయని అందువల్ల పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడుతుందని కూడా అందరూ అంగీకరిస్తున్నారు.

మానవ ప్రమేయం లేకుండానే ప్రకృతి నిర్మాణంలోని వైచిత్రి కారణంగా సంభవిస్తున్న పరిణామాలు కూడా మానవ జాతికి విపరీతమైన నష్టాలు కలిగిస్తున్నాయి. అగ్ని పర్వతాలు పేలి అనేకమంది మరణించడమే కాక విపరీత భౌగోళిక పరిణామాలు సంభవిస్తున్నాయి. అలాగే మంచు కరిగి దీవులు అనేకం మాయమయ్యాయి. భూకంపాల విధ్వంసం కూడా తక్కువేమీ కాదు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ పరిణామాలన్నిటికీ మానవతప్పిదాలే అంతిమ కారణమని అర్థమవుతున్నది. మనిషిలోని స్వార్థం, సుఖలాలస, వ్యవస్థల ఆలోచనలు విధి విధానాలు ఎలా కారణమో అందరికీ తెలుసు. వీటిని అధిగమించి ప్రకృతిని, పర్యావరణాన్ని రక్షించుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోగలుగుతాం.

పర్యావరణ పరిరక్షణ కోసం జరుగుతున్న కృషి ఈనాటిది కాదు. మన దేశంలో జరిగిన ఉద్యమాలలో చిప్కో ఉద్యమం ప్రధానమైనది. ఇందులో మహిళలే అత్యధికంగా పాల్గొన్నారు. కేరళలో సైలెంట్ వ్యాలీ వ్యతిరేక ఉద్యమం, మధ్యప్రదేశ్‌లో నర్మదా బచావో ఉద్యమం, చిలుకా సరస్సు కోసం ఒరిస్సా ప్రజల ఉద్యమం, కర్నాటకలో వృక్ష సంపదను కాపాడుకునే ప్రయత్నాలు, విశాఖ తీరంలో మత్స్య కార్మికుల ప్రతిఘటన మన దేశపు, మన ప్రాంతపు పర్యావరణ రక్షణ కోసం జరిగిన ఉద్యమాలే. పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు, సామాన్య గ్రామీణ ప్రజలు ఎన్నో కష్టనష్టాలను అధిగమించి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారు.

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుకుంటున్నాం. ఇది నిరంతర ప్రక్రియగా జరుగుతున్న పర్యావరణ ఉద్యమానికి స్ఫూర్తినిస్తూ, మనల్ని కార్యోన్ముఖుల్ని చేస్తుందని ఆశిద్దాం.

వేదకుమార్.ఎం.

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్





*(6వ పేజీ తరువాయి)*

విడుదలయి అందరి దృష్టిని ఆకర్శించింది.

న్యూఢిల్లీ లో జరిగిన 2023 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' లో శ్రీ పొన్నం రవిచంద్ర గారు నిర్మించిన 'సర్వాయి పాపన్న డాకుమెంటరీ'కి 'బెస్ట్ సినిమాటోగ్రఫీ అవార్డు' రావడం ప్రశంసనీయం. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా సర్వాయి పాపన్న చరిత్ర విషయంలో ఏదైనా కృషి జరిగిందంటే అది గౌ శ్రీ పేర్వారం జగన్నాథం గారు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ - చాన్సలర్ గా ఉన్నప్పుడే.

ఆయన ఖిలాషాపురానికే చెందినవాడు కావడంవల్ల, ప్రముఖ కళాభిమాని జగదీశ్ మిట్టల్ లండన్ లోని విక్టోరియా మ్యూజియం నుండి సేకరించిన సర్వాయి పాపన్న ఒరిజినల్ చిత్రప్రతికి విశేషప్రచారం కల్పించడమే కాకుండా దాని ఆధారంగా ఖిలాషాపురం లో పాపన్న మొదటి విగ్రహ ప్రతిష్టాపన చేయించారు.

1995 సెప్టెంబర్ 13 నుండి 17 వరకు సర్వాయి పాపన్న త్రిశత జయంతి ఉత్సవాలను ఆనాటి రాష్ట్ర మంత్రివర్యులు గౌ శ్రీ పొన్నాల లక్ష్మయ్య, శాసన సభ్యులు గౌ శ్రీ మాచర్ల జగన్నాథం గార్ల సహకారంతో ఘనంగా జరిపించారు.

శ్రీ పేర్వారం గారి ప్రోత్సాహంతో పాపన్నపై వెలువడిన రెండు రచనలు శ్రీ పంపన సూర్యనారాయణ గారి 'సర్దార్ పాపన్న' నాటకం, శ్రీ కావేరి గోపయ్య గారి 'సర్దార్ సర్వాయి పాపన్న బుర్ర కథ'లు.

కేంద్ర మంత్రివర్యులు గౌ శ్రీ కిషన్‌రెడ్డి గారి చొరవతో సర్దార్ సర్వాయి పాపన్న పోస్టల్ స్టాంప్ అక్టోబర్ 2022లో విడుదలైంది.

తెలంగాణలో గత కేసిఆర్ గారి ప్రభుత్వం కాలంలోనే సర్వాయి పాపన్న జయంతిని (ఆగష్టు 18), వర్ధంతిని (ఏప్రిల్ 2) రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు (2022 అక్టోబర్) జారీచేశారు.

హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపనకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించిందని అప్పటి మంత్రివర్యులు గౌ శ్రీ శ్రీనివాస్ గౌడ్ గారు కూడా ప్రకటించారు,. కానీ అది ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడమే విచారకరం.

మొఘల్ సేనలతో జరిగిన పోరాటంలో 1709లో అమరుడైన పాపన్న తలను ఢిల్లీకి పంపి, మొండాన్ని గోలకొండ కోటగోడకు వేలాడదీసినట్లు చరిత్ర చెబుతుంది.

ఆ ప్రదేశాన్ని గుర్తించి అక్కడ 'సర్దార్ సర్వాయి పాపన్న స్మారకాన్ని' నెలకొల్పాలని, కొత్తగా ఏర్పడిన జనగామ జిల్లాలోనే ఖిలాషాపురం ఉంది కాబట్టి, ఆ జిల్లాకు 'సర్దార్ సర్వాయి పాపన్న' పేరు పెట్టాలని మొదటినుండి బహుజన వర్గాలు చేస్తున్న డిమాండ్స్ నెరవేరాలని కోరుకుందాం!

**-వేముల ప్రభాకర్**
m : 93986 61025

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

# 'వజ్ర'మానం

"వజ్రం రత్తీమానేణ మాపయేత్"

వజ్ర విలువ నిర్ణయించే నాలుగు ప్రామాణికాలలో (4C) అందరి దృష్టిలో ముందు కనిపించేది, "క్యారెటేజ్".

వజ్రం విలువ ఎలా నిర్ణయించబడినా మార్కెట్లో ధర మాత్రం క్యారెట్లలోనే ఉంటుంది.


**మన ప్రాచీన సాహిత్యంలో వజ్రమానం:**

భారతదేశంలో ఖచ్చితమైన కొలతలు అనాదిగా పాటించినట్లు ఈ క్రింది శ్లోకం వల్ల తెలుస్తోంది.

*"న మానేన వినా యుక్తిర్ ద్రవ్యాణాం జాయతే క్వచిత్.*
*అతః ప్రయోగ కార్యార్థం మానమత్రోఛతే మయా"*

కొలత లేకుండా ఏ పదార్థాన్ని ఉపయోగించడం సాధ్యం కాదు అని అర్థం వచ్చే ఈ శ్లోకం సారంగధరసంహిత ప్రథమ కాండలో పేర్కొనబడింది.





ఖచ్చితమైన కొలతలు ఆయుర్వేదం, పాకశాస్త్రం, రత్నశాస్త్రం మొదలై వాటిలో చాలా ముఖ్యం. ప్రాచీన భారతీయ సంస్కృతిలో ప్రామాణికమైన కొలతలకు చాలా ప్రాముఖ్యత ఉండేది. ఈ "మానాల"ను మగధ మానం, (చాణక్యుడు పాటించిన పద్ధతి) కళింగ మానం (శుశ్రుతుడు పాటించిన పద్ధతి) అనే రెండు విధానాలు అమలులో ఉండేవి.

వీటిలో 'మగధమానం' ఎక్కువ ప్రాచుర్యంలో ఉండేది.

**ప్రాచీన కొలతలు:**

- పౌతవ మానం (బరువు కొలత)
- ద్రవ్య మానం (పరిమాణం కొలత)
- పయ్య మానం (పొడవు కొలత)
- సమయ మానం (కాలం కొలతలు) అనే నాలుగు రకాలుగా విభజించారు.

దీనిలో పౌతవమానం రత్నశాస్త్రంలో ముఖ్యమైనది.

**పౌతవమానం:**

పౌతవమానంలో అతిచిన్న యూనిట్‌ను "పరమాణు "అనేవారు.

- 30 పరమాణువులు = "వంశీ" (0.05 mg)
- 6 వంశాలు = మరీచి (0.32 mg)
- 6 మరీచిలు = "రజిక" (1.92 mg)
- 3 రజికలు = "సర్షప"
- 3 సర్షపలు = "యవ" (31.25 mg)
- 4 యవలు = రత్తి/ రక్తి/గుంజ/ (125 mg)
- 6 "గుంజలు"= మాష /రాజమాష/ హేమ/ ధన్యక (750 mg)
- 4"మాషలు"= శాణ/ టంక/ధరణ (3 gr).
- 2 శాణలు = కొల/ క్షుద్రక/ వాటక/ ద్రంక్షణ (6 gr)
- 2 కొల = "కర్ష/అక్ష/అక్షపిచు/ పనితల/ తిండుక/ కరమధ్య/ హంసపాద/ సువర్ణ" (12 gr)


ఇలా ఒక ధూళి కణం (పరమాణు) నుండీ కిలోగ్రాముల వరకు ప్రామాణిక కొలతలను వాడేవారు.

మగధ, కళింగమానాలలో కొంత వ్యత్యాసం ఉంటుంది మగధ మానంలో ఆరుగుంజలు ఒక మాష (750 mg)గా ఉంటే కళింగమానంలో 8 గుంజలు ఒక మాష (1000 mg) గా పరిగణించేవారు.

వరాహమిహిరుడు బృహత్సంహితలో ఎనిమిది తెల్ల ఆవగింజలు (శ్వేత సర్షప) ఒక తండులం తో సమానం అని, 20 తండులాల బరువు ఉన్న వజ్రం విలువ 200000 కర్షపణాలుగా ఉంటుందని లెక్కించారు. అదే సమయంలో పది తండులాల బరువు ఉన్న వజ్రం 40,000 కర్షపణాల విలువ చేస్తుంది అని అన్నారు. అంటే బరువుకు వజ్రం విలువకు అనులోమ సంబంధం ఉంటుంది. ఇప్పటికీ మార్కెట్‌లో ఎక్కువ క్యారెట్ల వజ్రం విలువ చిన్న వాటికన్నా అనేక రెట్లు ఎక్కువ ఉండటం గమనించవచ్చు.

**గురిగింజ/ గురివింద/ రత్తి:**

"వజ్రం రత్తిమానేన మాపయేత్" అని రత్న పరీక్షలో పేర్కొన్నారు, అనగా వజ్రాన్ని రత్తీ అనే మానంలో కొలవవచ్చు



అని అర్థం. ఈ రత్తీని క్యారెట్ల్లోకి మారుస్తే 0.91 క్యారెట్‌గా అనుకోవచ్చు.

రత్తి లేదా రతి ఇప్పటికీ సాంప్రదాయ కొలమానంగా రత్నాల వ్యాపారంలో వాడుతారు. దీనిని రక్తికగా సంస్కృత భాషలో వ్యవహరిస్తారు. ఈ గింజ శాస్త్రీయ నామం, అబ్రస్ ప్రికటోరియస్ (Abrus precatorious) 0.1215 గ్రాములు బరువు ఉంటుంది. దీన్ని గుంజా, గురివింద అని కూడా అంటారు.

భారతదేశంలో అనాదిగా దీనిని కొలమానంగా వాడుతున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. సింధు నాగరికతలో ఒక మాష ఎనిమిది రత్తిలతో సమానంగా ఉండేది. శతపథ బ్రాహ్మణంలో పేర్కొన్న వంద కృష్ణలాలకు వంద రత్తిలు సమానం అని కాత్యాయన శ్రౌత సూత్రకారుని అభిప్రాయం. గాంధార సంస్కృతి (600-200 BECలో కూడా బంగారం కొలమానంగా రత్తి కొనసాగినట్టు తెలుస్తోంది. కౌటిల్యుని కాలంలో 32 రత్తీ బరువు ధారణ (పురాణ)గా, 80 రత్తీ బరువును 'స్వర్ణ'గా చెలామణి చేసినట్లు తెలుస్తోంది.

మొగల్ రత్నాలను ప్రత్యక్షంగా చూసిన టవర్నియర్ 319 1/2 రత్తీల బరువున్న వజ్రాన్ని తన చేతిలోకి తీసుకుని పరీక్షించినట్టు చెప్పుకున్నాడు.

**ఆభరణాల వ్యాపారంలో**

- ఒక తులం (11.664 గ్రాములు)= 12 మాషాలు
- ఒక మాషం = 8 రత్తిలు (0.972 గ్రాములు).
- స్వర్ణకారులు ఒక రత్తి = 121.5 మిల్లీ గ్రాములుగా పరిగణిస్తారు.

రత్నధారణ కోసం జ్యోతిషపరంగా ఒక పక్కీ రత్తీ, ఒకటిన్నర స్వర్ణకారుల రత్తీకి సమానం అంటే 182.25 మిల్లీ గ్రాములుగా పరిగణిస్తారు. ఇవన్నీ సాంప్రదాయ కొలమానంగా వాడుతున్నవే తప్ప ప్రామాణికమైనవి కావు. అధికారికంగా మెట్రిక్ పద్ధతిలోనే కొలతలు ఉంటాయి.

**బండి గురిగింజ:**

కారిబియన్ ప్రాంతాల్లో ఉన్న jumbie bead అనే ఒక గింజ వైద్యంలో వాడే "మాత్ర" ఆకారంలో ఉండి, 0.26 గ్రాముల నిర్దిష్ట బరువు ఉంటుంది. దీనిని దాదాపు అన్ని ఆసియా దేశాలో, స్వర్ణకారులు బంగారం, విలువైన రాళ్ళు, తూచటానికి వాడేవారు. దీనికి దాదాపు దగ్గరి పోలికలు ఉన్న కోరల్ గింజలు (Adenanthera pavonina) భారత దేశంలోని కొన్ని ప్రాంతాల్లో స్వర్ణకారులు తూనికగా వాడుతారు. దీనిని తెలుగులో బండి గురివింద అనికూడా అంటారు.

ఈ విధంగా అనేక రకాల లెగ్యూమ్ జాతి గింజలు, గోధుమ, బార్లీ, యవలు, ఆవాలు వంటి ధాన్యాలు, వీటికి నిర్దుష్టమైన బరువు, సులభ లభ్యత కారణంగా, విలువైన రాళ్ళకు, బంగారానికి తూనికలుగా వాడుతారు.

**క్యారెట్ అనే పదం...**

మధ్య ప్రాచ్యం, మధ్యధరా సముద్ర ప్రాంతాల్లో పెరిగే కరోబ్ చెట్టు (సెరటోనియా సిలిక్వా అనే శాస్త్రీయ నామం) గింజలకు గురివింద వలెనే నిర్దుష్టమైన బరువు ఉంటుంది. కరోబ్ గింజలకు గ్రీకు పదం కరటిన్ (karation) దీనినుంచి రత్నాల/వజ్రాల బరువు కొలిచే క్యారెట్ అనే పదం వచ్చింది. ఒక కారట్ 200 మిల్లీ గ్రాములకు సమానం. ఆధునిక కాలంలో కూడా క్యారెట్ అనే పదం వజ్రాల బరువు కొలిచే "స్టాండర్డ్ యూనిట్"గా నిలిచింది.

**స్టార్/ మెలే/ పాయింటర్ డైమండ్స్:**

చిన్న సైజు వజ్రాలను స్టార్ డైమండ్స్ మరియు మెలీ డైమండ్స్ అంటారు. వీటిని ఆభరణాల అందం ఇనుమడింపజేసే రాళ్ళుగా (Accent stones) ఉపయోగిస్తారు. ఇప్పుడు రానురాను మొత్తం ఆభరణాలు వీటితోనే తయారు అవుతున్నాయి.

1.2 మిల్లీమీటర్లు లేదా అంతకంటే తక్కువ 1.8 మిల్లీ మీటర్ల సైజులో 0.2 కారట్ బరువు ఉన్న, పూర్తిగా

పరిష్కరించబడిన (Finished) వజ్రాలను వాణిజ్య పరిభాషలో నక్షత్రవజ్రం (Star diamond) అంటారు. వీటి బరువు చాలా తక్కువ ఉండటం వల్ల వీటిని "డైమండ్ డస్ట్" అని కూడా అంటారు. ఇవి గుండ్రంగా ఉండి చదునుగా ఉండే టేబుల్ కలిగి ఉంటాయి. వీటిపై త్రికోణాకార ముఖాల వల్ల నక్షత్ర ఆకారం కనిపిస్తోంది.

0.021 నుండి 0.15 కారట్ల / 2.6 మిల్లీ మీటర్ల నుండి 3.5 మిల్లీ మీటర్ల వజ్రాలను మెలీ డైమండ్ (Melee diamonds) అంటారు. ఇవి చిన్న సైజులో మెరుపు తగ్గకుండా, వివిధ ఆకారాలుగా కూడా పరిష్కరించబడి ఉండొచ్చు.

స్టార్ డైమండ్ మెలే డైమండ్ కన్నా చిన్న సైజులో ఉండి నక్షత్ర ఆకారం కలిగి ఉంటాయి. రెండింటి ఉపయోగం దాదాపు ఒకటే.

**సాలిటేర్ వజ్రం:**

ఆభరణంలో కేంద్ర బిందువుగా ఉన్న ఒకే వజ్రాన్ని సాలిటేర్ అంటారు. ఇది ఆభరణాలలో సింగిల్‌గా ఉండాలి, 4c మరియు ఇతర నాణ్యత పారామితులు ఈ వజ్రాలలో ఖచ్చితంగా వర్తిస్తాయి. వాణిజ్య పరంగా 0.50 సెంటు కన్నా ఎక్కువ బరువు ఉన్న వజ్రాలను సాలిటేర్‌గా వ్యవహరిస్తారు.



నిశ్చితార్థపు ఉంగరం, పెండెంట్ మరియు చెవిపోగులు మొదలైన వాటిలో సాలిటేర్ వజ్రాలను వాడతారు.

ఇటీవల అనేక చిన్న చిన్న వజ్రాలు పొదిగిన "క్లస్టర్ రింగ్" వంటివి ప్రాచుర్యంలో ఉన్నాయి.

**పాయింటర్ వజ్రం:**

ఒక కారట్ కన్నా తక్కువ బరువుఉన్న వజ్రాలను వజ్ర పరిశ్రమలో "పాయింటర్ వజ్రం" అంటారు. ఒక పాయింటర్ అంటే 0.01కారట్ బరువున్న వజ్రంగా భావించాలి. అంటే 10 పాయింటర్ అంటే 0.10 కారట్ బరువున్న వజ్రం అని అర్థం.

**వజ్రాల బరువులో మ్యాజిక్ నంబర్లు:**

ప్రస్తుతం ఈ తక్కువబరువు/ పరిమాణం ఉన్న వజ్రాల పరిశ్రమకు సూరత్ ముఖ్య కేంద్రంగా ఉంది. ధరతక్కువ, నాణ్యత కలిగి ఉండటం, ఆధునిక కట్టింగ్ పద్ధతులు, డిజైన్లు అందుబాటులో ఉండటంవల్ల భారతదేశంలో ఈరకం వజ్రాలతో చేసిన ఆభరణాలు చాలాప్రాచుర్యం పొందాయి.

వజ్రాల వ్యాపారంలో "మ్యాజిక్ నంబర్లు" అనేవి కొన్ని నిర్దిష్ట క్యారెట్ బరువులు (ఉదా. 0.50, 0.75, 1.00), ఈ క్యారెట్ సైజుల వద్ద వజ్రాలధర ఒక్కసారిగా గణనీయంగా పెరుగుతాయి. మ్యాజిక్ నంబర్ కంటే కొంచెం క్రింద మరియు కొంచెం పైన ఉన్న వజ్రం మధ్య పరిమాణంలో చూడటానికి వ్యత్యాసం తక్కువగా ఉన్నప్పటికీ. ఆ సంఖ్యకు చేరుకోగానే ధరలో వ్యత్యాసం కొట్టొచ్చేలా కనిపిస్తుంది.

**ఉదాహరణ:**

0.98 క్యారెట్ వజ్రం మరియు 1.01 క్యారెట్ వజ్రం మధ్య దృశ్యమాన వ్యత్యాసం చాలా తక్కువ, కానీ 1.00 క్యారెట్ మ్యాజిక్ సంఖ్య వద్ద లేదా అంతకంటే కొంచెం ఎక్కువ తూగే వజ్రం ఖరీదు గణనీయంగా ఎక్కువ

వజ్రాల బరువులు- మ్యాజిక్ సంఖ్యలు కొన్నిఉదాహరణలు: 0.25 ct, 0.50 ct, 0.75 ct, 1.00 ct, 1.25 ct, 1.50 ct, 2.00 ct, మొదలైనవి ఉన్నాయి.

ధరలపై ప్రభావం ఉన్న ఈ విషయం కొనుగోలుదారు అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం.

**అధికబరువు ఉన్న ప్రఖ్యాత వజ్రాలు:**

1905 లో దక్షిణఆఫ్రికా దేశంలో దొరికిన కుల్లినాల్ వజ్రాన్ని అతిపెద్ద రత్నాల జాతి వజ్రంగా భావిస్తారు. దీని బరువు 3.106.75. బోట్స్వానా లో కరోవేగనిలో దొరికిన 2492 క్యారెట్ బరువు గల వజ్రం కుల్లినాల్ వజ్రం తరువాత రెండవ అతిపెద్ద వజ్రంగా పేరుగాంచింది. కరోవే గనిలోనే 2015లో దొరికిన లెసేడి లా రానా (Lesedi la Rana) వజ్రం 1,109 క్యారెట్ల బరువుఉన్న ఒకప్రముఖ వజ్రం.

ఎక్సెల్సార్ (The Excelsior), స్టార్ ఆఫ్ సిర్రాలియోన్ (The star of Sirra Leone), లెసోథో లెజెండ్ (Lesotho Legend), ది ఇన్ కంపారబుల్ (The incomparable diamond), ది కాన్సలేషన్ (The Constellation Diamond), మిలినియం స్టార్ (The Millennium Star Diamond) వంటివి కొన్ని ప్రపంచ ప్రఖ్యాత అతిపెద్ద వజ్రాలు.

మనదేశంలో దొరికిన కోహినూర్ వజ్రం ఇప్పుడు 105 క్యారెట్ బరువు ఉంది. మొదట దీని బరువు 793 క్యారెట్లుగా ఉండేది. నిజాం నవాబు నగలలో ఉన్న జాకోబ్ డైమండ్ బరువు 184.75 క్యారెట్స్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

–చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# ఆషాఢ బోనం

ఆషాఢం... పేరుకు ఇది శూన్యమాసమైనా ముల్లోకాలను పాలించే జగన్మాతను భక్తిశ్రద్ధలతో కొలిచే మాసంగా పిలుస్తారు. నవరాత్రుల తరువాత అమ్మవారిని పూజించే నెలగా ఆషాఢానికి పేరు. ఈ సమయంలో తెలంగాణ ప్రాంతంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బోనాల ఉత్సవాల వెనుక ఉన్న అంతరార్థమేంటో తెలుసుకుందాం...

బోనం.. అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యం అని అర్థం. భోజనం ప్రకృతి అయితే బోనం వికృతి. శివసత్తుల పూనకాలతో, పోతురాజుల నృత్యాలతో, ఘంటాల ఊరేగింపుల మధ్య తలపైన బోనం పెట్టుకుని ఆలయానికి తరలివచ్చే మహిళలు శక్తి స్వరూపిణిని భక్తిశ్రద్ధలతో కొలిచే సందర్భమే బోనాల పండుగ. ఆషాఢంలో ఎంతో విశేషంగా జరిగే ఈ వేడుకలకు కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు గోల్కొండలోని జగదాంబిక ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేవాడనీ.. ఆ క్రమంలోనే బోనాల ఉత్సవాలూ మొదలయ్యాయనీ ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. అలాగే ఒకప్పుడు భాగ్యనగరంగా పిలిచిన హైదరాబాద్‌లో ఈ ఉత్సవాల ప్రారంభం వెనుక మరో ఆసక్తికరమైన కథనమూ ఉంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం భాగ్యనగరంలో ప్లేగు వ్యాధి విపరీతంగా వ్యాపించడంతో ఎంతోమంది ప్రజలు చనిపోయారట. అమ్మవారు ఆగ్రహించడం వల్లే ఈ వ్యాధి వ్యాపించిందని భావించిన ప్రజలు జాతరలు జరిపిస్తే దేవి శాంతిస్తుందని నమ్మి ఈ బోనాల ఉత్సవాలను మొదలుపెట్టారని చెబుతారు. అప్పటి నుంచీ నేటి వరకూ ఏటా ఆషాఢంలో ఈ ఉత్సవాలను తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అలాగే ఈ సమయంలో జగన్మాత పుట్టింటికి చేరుకుంటుందట. అలా వచ్చే అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి బోనాన్ని సమర్పిస్తే.. సంతోషిస్తుందని భక్తుల విశ్వాసం.



### బోనం అంటే...

ఈ వేడుకలో భాగంగా ఆషాఢంలో వచ్చే ఆదివారాల నాడు... రాగి లేదా మట్టికుండకు పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టి అందులోనే పసుపు అన్నం లేదా పొంగలిని వండి.. దానిపైన దీపాన్ని వెలిగించిన మరో పాత్రను ఉంచి వేపాకులతో అలంకరిస్తారు. ఇలా తయారుచేసిన బోనాన్ని మహిళలు తలపైన పెట్టుకుని డప్పుల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి తల్లికి నివేదిస్తారు. తమ కుటుంబాన్నీ, ఊరినీ కాపాడమంటూ వేడుకుంటారు.


### ఎక్కడ మొదలవుతాయంటే...

ఈ ఉత్సవాలు తెలంగాణలో ఎక్కువగా జరిగినా రాయలసీమ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లోనూ చూడొచ్చు. మొదట హైదరాబాద్‌లోని గోల్కొండలో ఉన్న జగదాంబికా ఆలయంలో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి సన్నిధానంలో నిర్వహించే లష్కర్ బోనాలు, లాల్‌దర్వాజాలోని సింహవాహిని మహంకాళితో పాటు ధూల్‌పేట్.. ఇలా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలు మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడతాయి. ఆఖరున మళ్లీ గోల్కొండ కోటలోనే చివరి బోనం సమర్పించడంతో ఇవి ముగుస్తాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం పేరుతో చెప్పే భవిష్యవాణికీ ఎంతో ప్రాధాన్య మిస్తారు భక్తులు. అయితే ఈ బోనాలు నిర్వహించడం వెనుక మరో కోణమూ దాగుంది. ఆషాఢంలోనే వర్షాలు మొదలవుతాయి. ఈ సమయంలో అంటువ్యాధులతోపాటు విషజ్వరాలు వ్యాపించడం సర్వసాధారణం. పరిసరాలు శుభ్రంగా ఉంటే వాటిని కొంతవరకూ తగ్గించుకోవచ్చు అనే ఉద్దేశంతోనూ ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయనీ చెబుతారు. అందుకే బోనాల సమయంలో గుమ్మాలకు వేపమండల్ని కడతారు. వేప ఆకులకు క్రిమికీటకాలను దూరం చేసే గుణం ఉంటుంది. మహిళలూ ఉత్సవంలో భాగంగా కాళ్లకు పసుపు రాసుకుంటారు. తద్వారా పాదాలకు పగుళ్ల సమస్య రాకుండా నివారించినట్లు అవుతుందని నమ్ముతారు. కారణం ఏదైనా అమ్మవారిని కొలిచేందుకు ఇదీ ఓ అవకాశమని అర్థంచేసుకుంటే ఆధ్యాత్మిక ఆనందంతోపాటు ఆరోగ్యాన్నీ కాపాడుకున్నవాళ్లమవుతాం.

- ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# "స్వంత కథ"

ఆదిమధ్యాంతరహిత నక్షత్రమండల విశ్వవీధులలో ఒక సూక్ష్మకాంతిపుంజంగా సంచలిస్తూ, సంచరిస్తూ, పరిభ్రమిస్తూ, పరిక్రమిస్తూ దిఙ్మండలంలో అనేకానేక రూపాంతరాలుగా పరిణామం చెందుతూ, లిప్తకాలం రవంతసేపు విశ్రమించి, సేదతీరటానికి ఈ పుడమిమీద వాలి, ఒక అమ్మగర్భంలో చేరి నవమాసాలు యోగనిద్ర ముద్రాంకితుడనై సుదీర్ఘ నిరీక్షానంతరం ముచికుందా నదీతీరాన 1910లో ఆరవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ అను "మహబూబ్ అలీ పాషా" నిర్మించిన పెద్ద దవాఖానాలో (ఉస్మానియా హాస్పిటల్) 1951వ సంవత్సరం పదవ తారీఖు రాత్రి తొమ్మిది గంటలకు, నక్షత్రాలలో పందొమ్మిదోది ఐన "మూల నక్షత్రం" గడియలో కనులు తెరిచి, కెవ్వుమని అరిచి ఈ భూమండలాన్ని ప్రప్రథమంగా సందర్శించాను.



సరిగ్గా 73 సంవత్సరాల క్రిందట జరిగిన నా జన్మవృత్తాంతం పూర్వాపరాల కథ ఇది. గాన సుజనులారా మిగతా కథను ఆలకించి, ఆదరించండి.

మా ఇంటిపేరు "పరవస్తు". ఈ వంశం మూల పురుషులు ఇహలోక చింతన, లౌకిక, భౌతిక విశయువాంఛాలంపటులు గాక నిత్యమూ, నిరంతరమూ ఆధ్యాత్మిక, తాత్విక చర్చలతో పరలోక పరమార్థాల గురించి, మృత్యానంతర జీవితం గురించి ఆలోచించేవారనీ, తాత్విక చర్చలు చేసేవారని తెలిసి ఇహలోక ప్రపంచం వారందరినీ "పరవస్తు" వారుగా ముద్రవేసి గౌరవించింది. ఆ పరంపరకు చెందిన వారే, ఆ కోవకు చెందిన వారే శ్రీమాన్ పరవస్తు చిన్నయ సూరిగారు. వీరి జీవితకాలం 1806-1862. శ్రీపెరంబుదూర్‌లో జన్మించిన వీరు సుమారు 1834 ప్రాంతంలో చెన్నపట్నంలోని పచ్చయప్ప కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేసినారు. వీరు రచించిన బాలవ్యాకరణము, నీతిచంద్రిక గ్రంథాలు జగత్‌ప్రసిద్ధం. "ఇంగువ కట్టిన గుడ్డలాగా" నేను కూడా పరవస్తు వంశం వాడిని కావున నాకు రెండక్షరం ముక్కలు, ఇసుమంత లోకజ్ఞానం సంక్రమించిందని సవినయంగా విశ్వసిస్తున్నాను. మా పూర్వీకుల పరలోక, అధ్యాత్మిక చింతన నాకు అబ్బకున్నా వారి ఆదర్శవాదాలు, సంస్కరణాభిలాష నాకు సంక్రమించిందని విన్నవించుకుంటున్నాను.

"కూచుంటే ఒక కథ లేస్తే మరొక కథ" అన్నట్లు నా పుట్టుక వెనుక కూడా చిట్టి, పొట్టి కథ ఒకటుంది. నన్ను కనడానికి మా అమ్మ షహరులోని పెద్ద దవాఖానాలో షరీకై ప్రసూతి వార్డులో బల్లపీటమీద పడుకుని, పురుటి నొప్పులు పడుకుంటనే "నాకు గాంధీ, నెహ్రూ, సుభాష్, పటేల్" లాంటి కొడుకు పుట్టాలని ముక్కోటి దేవతలకు, దేవుండ్లకూ మనస్సులోనే మొక్కుకున్నదట. పేరుపేరునా ప్రార్థించిందట. అప్పటికే ఐదవ తరగతి కామ్యాబ్ అయిన ఆమెకు, హైద్రాబాద్ లాంటి పట్నంలో పుట్టి పెరిగిన ఆమెకు జాతీయోద్యమం గురించి, నగరాన్ని చైతన్య పరుస్తున్న ఆర్యసమాజం గురించి, నిజాంను పదవీచ్యుతుణ్ణి చేసిన 1948 సెప్టెంబరు పోలీసు యాక్షన్ గురించి రేఖామాత్రంగా ఐనా తెలుసు కావున ఒక లోకనాయకుడు లాంటి కొడుకు పుట్టాలని కోరుకోవడం తప్పేమీ కాదు కదా! కాని రోజులు మారాయి. రెండు పదుల సంవత్సరాలు నిండినాక అట్లా ఆశించడమే, కోరుకోవటమే తన స్వయంకృతాపరాధమై పోయిందని ఆమె తన జీవితాంతం అంగలార్చింది.

"అద్దాల నాటి బిడ్డ గద్దాల నాడు కాదు" అన్నట్లు నాకు పైలా పచ్చీసు వయసు వొచ్చేసరికి "దేవుడూ దయ్యమూ లేవని, మతమూ గితము, కులమూ గిలమూ జాన్తానై అని, పెళ్లిగిళ్లి వద్దని చెప్పి నవసమాజమూ, సమసమాజమూ అని పిడికిళ్లు బిగిస్తూ, గొంతెత్తి నినదిస్తూ, సంజకెంజాయ కేతన ధారినై సర్కారీ నౌఖరీకి ఇస్తెఫా ఇచ్చి ముషీరాబాద్ జైల్ ఖానాలో చిప్పకూడు తింటున్నప్పుడు - ఏ అమ్మా ఐనా తను అట్లా కోరుకోవటమే మహా అపరాధమై పోయిందని అంగలార్చటంలో వింత ఏముంది?

ఇత్యాది వివరములన్నీ "ముట్టుకుంటే పట్టుకునే ముచ్చట్లు" కావున మరికొన్ని ముచ్చట్లను కూడా విజ్ఞులైన పాఠక మహాశయులతో ముచ్చటించక తప్పదు కదా! గాన సుజనులారా వీనుల విందుగా వినవలెనని నా విన్నపములు.

నా పుట్టుక లాగే, నా పేరు పుట్టుక కూడా కించిత్తు విశేషమే. నాకొక గొప్ప పేరు పెట్టాలని మా అమ్మ దేవులాడటం ప్రారంభించింది. ఆ ఆలోచనలతోనే ఆర్నెల్లు దాటి పోయింది. "నానీ" అని ముద్దుపేరొకటి తగిలించారు. గాని ఎంతైనా అది టెంపరవరీనే కదా! అమ్మకు నా పేరు వెదకటం కొండంత సమస్యగా మారింది. జనాంతికంగా చెప్పుకుంటే సిగ్గుచేటు గాని నాపేరు వెదకటం నుండే ఆమెకు నా వల్ల కష్టాలు మొదలైనాయి.

ఖైర్. ఒకనాడు అమ్మ నన్ను సంకనేసుకుని "బారానంబరు" బస్సుమీద (అంటే కాలినడకన) పాతనగరం అలియాబాద్ నుండి తన తల్లిగారి ఇల్లయిన రైన్ బజార్‌కు బయలుదేరింది. ఆ రోజులలో నగర ప్రజలందరికీ కాలినడకల ప్రయాణాలు సర్వసాధారణం. సడక్‌లన్నీ ప్రశాంతంగా, రణగొణధ్వనులు లేక "సున్‌సాన్‌గా" ఉండేవి. అప్పుడప్పుడూ ఒక సైకిలో, రిక్షానో, ఒక గుర్రపు జట్కానో లేక ఎడ్లబండినో అపురూపంగా దర్శనమిచ్చేవి. ఇప్పటిలాగా ఏదోఒకటి గుద్దుకుని "టక్కర్" ఐతదన్న భయం, కాల్జేతుల బొక్కలు విరుగుతవన్న భయం ఆ రోజుల్లో లేదు. అలియాబాద్, సయ్యద్ అలీ చబూత్రా, శాలిబండా, చందూలాల్ బేలా, సుల్తాన్‌షాహీలో మీర్ మోమిన్ దాయెరా

అను ఖబరస్తాన్ దాటి రాచెర్వు కట్ట మీదికి ఎక్కి నడుస్తుంది. మీర్‌జుమ్లా అను వజీరు త్రవ్వించిన చెరువు కావున రా చెరువు కట్ట అని ప్రజల నోళ్లల్ల నానింది. వర్తమానంలో దానిని తాలాబ్ కట్ట అని అంటున్నారు. నవాబుకాలంలో రాచెర్వు కట్ట "చీమలు దూరని చిట్టడివి కాకులు దూరని కారడివి"లా వుండి నరమానవుల సంచారం లేక శూన్యంగా ఉండేది. మండే ఎండా కాలం కావున ఎండ దగడు నా పువ్వులాంటి ఒంటికి తగల వద్దని తన చీరెకొంగు నా నెత్తిమీద కప్పి చెప్పులు లేని తన బరి కాళ్లతో బిరబిరా నడుస్తుంది. అప్పటికి పాదరక్షలు వేసుకునే పట్నం పోకడల "షానతనం" (షాన్) ఆమెకు అలవాటు కాలేదు. మండుటెండల సూర్యుడిని లెక్కచేయక ఆమె నా పేరు గురించే ఆలోచిస్తూ ముందుకు, మున్ముందుకే నడుస్తుంది.

ఆమె ముందు ఒక వృద్ధ విప్రుడు అపసోపాలు పడుతూ ఆయాస పడుతూ అడుగులు భారంగా వేస్తున్నాడు. అతని బట్టతలపై మిట్టమధ్యాహ్నపు ఎండ పెళపెళా కాస్తుంది. దాహార్తి చింతతో అతని నోరు పిడచగట్టుక పోయింది. కారుతున్న చెమటలతో శరీరంలో నీరసం, నిస్సత్తువా చోటు చేసుకుంటుంది. ఆ ఎండ దెబ్బకు తట్టుకోలేని ఆ వృద్ధ బ్రాహ్మణ బాటసారి తన రెండు చేతులు పైకెత్తి, మొర పెట్టుకుంటున్న వాడిలా "హా లోకేశ్వరా! ఎక్కడున్నావయ్యా!!" అని ఎలుగెత్తి ఆక్రోశించాడట. అప్పుడు అమ్మకు తటిల్లున నా పేరు తట్టింది. ముందున్న విప్రుడిని ఉద్దేశించి "ఇగో లోకేశ్వరుడు నీ వెనకే ఉన్నాడు" అని గట్టిగ కేక వేసింది. అప్పుడు ఆ వృద్ధుడు వెనుతిరిగి నవ్వుతూ నన్ను ఎత్తుకుని "లోకేశ్వర్" అని నామకరణం చేసాడట.

**మా మూలాలు తమిళ దేశం అని చెప్పటానికి మరోమంచి ఉదాహరణ మా ఇంటి పేర్లన్నీ తమిళ గ్రామాలకు సంబంధించినవే. ఉదా॥ శ్రీపెరంబుదూరు, శ్రీరంగం, తిరునగరి, తిరుక్కోవళ్లూరు మొదలగునవి. నా మూలాల గురించి ఇంత వివరణ ఎందుకంటే నాలోని సంచార తత్వం, ఆదర్శవాదం, తిరుగుబాటుతత్వం, జ్ఞానమార్గం ఇవన్నీ అక్కడి నుండి జన్యుపరంగా, వంశపారంపర్యంగా, రక్తం నుండి సంక్రమించినవి అని చెప్పటానికే!**

అట్లా ఆ, మండుటెండల నిర్జనారణ్యంలో నా నామకరణ మహోత్సవం ఎటువంటి ఆర్భాటం, హడావుడిలేకుండా పంచబూతాల సాక్షిగా ఆ చెరువు కట్టమీద జరిగిపోయిందట.

ఏది ఏమైనా నా కిప్పటికీ లోకంతోనే సంబంధం కాని ఈశ్వరుడితో ఎటువంటి సంబంధం లేని లోకేశ్వరుడిని నేను. ఆశ్లేయ వాదిని. మూల నక్షత్రంలో పుట్టుక అరిష్టదాయక మని లోకుల భావన. మా అమ్మాబాపులు ఒక గుడిలోని అయ్యవారిని ఈ విశయమై సంప్రదిస్తే శాంతి చేయిస్తే సరిపోతుందని సలహా ఇచ్చి చివరికి ఈ పిల్లవాడు పెరిగి పెద్దయినాక ఇంట్లో ఉండేది తక్కువా అడవులు పట్టుకుని తిరిగేది ఎక్కువా అని భవిష్యవాణి చెప్పాడట. పైసలకు కటపిట అయ్యే ఆ రోజులలో శాంతి చేయించటం చిన్నమాట కాదు కదా! అమ్మ తన పాదాలకున్న వెండి కడియాలను అమ్మి శాంతి కార్యక్రమాలు చేయించిందట. కాని క్యా ఫాయిదా? అయ్యగారు సెలవిచ్చిన జోస్యం తర్వాత కాలంలో నిజమే అయ్యింది. నేను సంచార జీవిగా, రాహుల్ సాంకృత్యాయన్ భాషలో ఘుమక్కడ్‌గా మారినాను. సందర్భానుసారం ఆ కథ కూడా ఉత్తరోత్తరా విన్నవిస్తాను.

మాతృదేవోభవ. పితృదేవోభవ. కావున కుటుంబనేపథ్యం గురించి "ప్రవర" చెప్పుకోవాలి. మా బాపు పరవస్తు జియ్యరు స్వామి. ఆయనా, ఆయన తాత, ముత్తాతలు పుట్టి పెరిగిన ఊరు మడికొండ. ఈ గ్రామం ఖాజీపేట రైల్వేస్టేషన్‌కు 3 కి.మీ.ల దూరంలో హైద్రాబాదుకు వెళ్లే దారిల ఉంటది. కాకతీయుల కాలంలో ఈ గ్రామాన్ని మణిగిరి అనేవారు. ప్రారంభం నుండి కవులకు, కళాకారులకు పుట్టినిల్లు. ఆధునిక కాలంలో కాళోజీ సోదరులు, పల్లా దుర్గయ్య, వానమామలై వరదాచార్యులు, అనుముల కృష్ణమూర్తి, బిరుదురాజు రామరాజు మొదలగు సాహితీ వేత్తలంతా ఈ మడికొండ గ్రామానికి చెందినవారే.

"జియ్యరు" తమిళ పదం. తెలుగులో "ఉపదేశికుడు లేదా బోధకుడు" అని అర్థం. నా మూలాలు మడికొండతో ముడిపడి వున్నాయి. అందుకే రెండక్షరం ముక్కలు కొంచెం జ్ఞానం వారసత్వ సంపదగా వచ్చిందని నా ఎరుక. ఇక్కడ మరొక మాట కూడా చెప్పాలి. మా అసలైన మూలాలు తమిళనాడులో ఉన్నాయి. మా పూర్వీకులు వైష్ణవ మత ప్రచారకులుగా రామానుజుడి సంస్కరణవాద బోధనలను వ్యాపింపచేస్తూ శ్రీరంగం, శ్రీపెరంబుదూరు, శ్రీవిల్లిపుత్తూరు, తిరుకొట్టియూరు, కంచిల నుండి అంచెలంచెలుగా, సంచరిస్తూ తిరుపతి, తిరుమలలో మజిలీలు చేస్తూ తెలంగాణంలోకి ప్రవేశించి బడుగు, బలహీన వర్గాల వారందరికి వైష్ణవాన్ని బోధించి, సమాశ్రయణం చేయిస్తూ చక్రాంకితాలు, ముద్రాకింతాలు వేస్తూ వారిని చాత్తాదర వైష్ణవులుగా ఉన్నతీకరిస్తూ తెలంగాణంలోని అనేక గ్రామాలలో స్థిరపడినారు. ఇక్కడి అమ్మాయిలనే వివాహమాడారు. వీరందరూ "మానవ సేవనే మాధవసేవ" అని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించారు. ఫలితంగా విద్య, వైద్యం వీరి వృత్తులుగా మారినాయి. వీరిలో చాలా మంది, ప్రముఖ ఆయుర్వేద వైద్య బిషక్కులుగా పేరు పొందారు. నైజాం కాలంలో కాన్గి (ప్రైవేటు) బడులు, వీధి అరుగు బడులన్నీ ఈ సాతాని పంతుళ్లవే. గాంధీజీకి ఇష్టమైన భజన:

"వైష్ణవ జనతో తేనె కహియే
జో పీడపరాయే జాణేరే"

ఇది గుజరాతీ భాషకు సంబంధించిన భజన. దీని అర్థం "పేద ప్రజల కష్టాలను గుర్తించని వాడు ఎప్పుడూ నిజమైన వైష్ణవుడు కాలేదు". రామానుజుడి బోధనల సారాంశం కూడా ఇదే. గాంధీజీని ప్రభావితం చేసిన ఆ గుజరాతీ భజన సృష్టి కర్త "నర్సిమెహతా". 15వ శతాబ్దికి చెందిన గుజరాతీ కవి మరియు భక్తి ఉద్యమకారుడు. మా మూలాలు తమిళ దేశం అని చెప్పటానికి మరోమంచి ఉదాహరణ మా ఇంటి పేర్లన్నీ తమిళ గ్రామాలకు సంబంధించినవే. ఉదా॥ శ్రీపెరంబుదూరు, శ్రీరంగం, తిరునగరి, తిరుక్కోవళ్లూరు మొదలగునవి. నా మూలాల గురించి ఇంత వివరణ ఎందుకంటే నాలోని సంచార తత్వం, ఆదర్శవాదం, తిరుగుబాటుతత్వం, జ్ఞానమార్గం ఇవన్నీ అక్కడి నుండి జన్యుపరంగా, వంశపారంపర్యంగా, రక్తం నుండి సంక్రమించినవి అని చెప్పటానికే!

**(తరువాయి వచ్చే సంచికలో)**

**(జూన్ నెల రచయిత జన్మదినం)**

–పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# పర్యావరణ చరిత్ర – మానవ భావాల, సంస్కృతుల చరిత్ర!

చరిత్ర అనేది మార్పుకు సంబంధించిన ఒక ధారావాహిక గాథ అంటారు. ప్రజలు, తమచుట్టూ ఉన్న ప్రపంచం ఏ మాత్రం మార్పు లేకుండా ఉంటే, తరం నుంచి తరానికి ఒకే రకమైనదిగా ఉంటే అందులో ఎదుగూ బొదుగూ ఏమీ ఉండదు. ఎటువంటి మార్పూ లేదు కనుక రాయడానికి చరిత్ర అంటూ ఏదీ ఉండదు. కాబట్టి మానవ సమాజంకు గానీ, ప్రకృతి ప్రపంచానికి గానీ మార్పు అనేది ఒక అనివార్యమైన తప్పించుకోలేని దృగ్విషయం. ఈ మార్పు క్రమంలో ఎన్నో సవాళ్లు ప్రకృతి ఎంచుకొంటుంది. మానవ సమాజాలు ఎదుర్కొంటాయి. కొన్ని సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాలు మానవ సమాజాల మనుగడకు పలు రకాల అవరోధాలను తెచ్చి పెడతాయి. అదే సమయంలో సహజ ప్రాకృతిక వ్యవస్థలకు అవి కొనసాగేందుకు ఆయా సమాజాలు ఎంచుకునే సాంస్కృతిక, ఆర్థిక రూపాలు కూడా ప్రమాద కారులుగా మారుతూ ఉంటాయి. గతం అనేది మానవాళికి ప్రకృతికి మధ్య తలెత్తిన శత్రుత్వానికి సంబంధించి అనేక ఉదాహరణలు చూపుతుంది. అదే గతం పునరుద్ధరణను, ఆశను పెంచింది. మానవ చరిత్రను రూపుదిద్దటంలో పర్యావరణ క్రమం అనేది ఎంతగానో దోహదపడింది. మానవాళి తమ పరిసర ప్రకృతిలో ఎన్నో మార్పులను ప్రవేశపెట్టింది. మానవులు తాము చేసిన మార్పులకు అనుగుణంగా తమ సమాజాలను, జీవన విధానాలను పద్ధతులను మార్చుకోవలసి రావటమే కాకుండా ఆ మార్పులకు అలవాటు కూడా పడవలసి వచ్చింది. అలా మార్చుకోలేక పోయినప్పుడు అవి క్షీణించటమో, అదృశ్యం కావటమో జరిగింది.



భూమ్మీద ఉన్న మానవాళి ప్రతి భాగంలోనూ ప్రతి చారిత్రక దశలోనూ ఇటువంటివి తప్పకుండా సంభవించింది. అందుకనే వర్తమానాన్ని అర్థం చేసుకోవాలనుకున్నా భవిష్యత్తును ఎరిగి ప్రమాదరహితమైన దారులను ఎంచుకోవాలనుకున్నా గతానికి సంబంధించిన పర్యావరణ అనుభవాలను మనం అర్థం చేసుకోవాలసి ఉంటుంది.

18వ శతాబ్దంలో బ్రిటీషర్లు ఆస్ట్రేలియాను స్వాధీన పరచుకుని పీనల్ కాలనీలను స్థాపించారు. వారు ఆ కాలనీల్లోకి ఖైదీలనే కాకుండా పెంపుడు జంతువులను, మొక్కలను ఇతరవైన వాటిని వెంట తెచ్చారు. స్థానికం కానివి ఎన్నో వచ్చి చేరాయి. వాటితో పాటే వ్యాధులు కూడా ఆ ఆవరణ వ్యవస్థకు పరిచయమయ్యాయి. స్థానికులకు వీటి ప్రభావం తప్పింది కాదు. కొద్ది దశాబ్దాలు గడిచాయో లేదో స్థానికుల సంఖ్య క్షీణించింది. అక్కడి పచ్చిక మైదానాలు, అడవులు అంతరించాయి. ఈ మార్పులు అంతటితో ఆగలేదు. 1988లో మానవ తప్పిదం, నిర్లక్ష్యం వల్ల చెర్నోబిల్ ప్రమాదం సంభవించింది. ఆ పేలుడు వల్ల వందల కిలోమీటర్ల వరకు శకలాలు చిందిపడి ఆ మేరకు ఆకాసమోద్యం కాకుండా చేసింది. అణుధార్మికిత పైకి కనిపించదు కానీ, దాని ప్రభావాలు స్పష్టంగానే కనిపిస్తాయి. వృక్షాలు అంతరించాయి. మొక్కలు రకరకాల రూపాల్లో పెరిగాయి. జంతవులలో జన్యుపరివర్తనలు విపరీత రూపం పొందాయి. చెర్నోబిల్ ప్రాంతంలోని వదిలివేయబడిన గృహాల కిటికీలలో ఇప్పటికీ పిల్లలొదివేసిన ఆటవస్తువులు అలాగే ఉండిపోయాయి.

ఆ ప్రాంతం నుండి దూరం పోలేక అక్కడే ఉండవలసి వచ్చిన వారు ఆ కలుషిత వాతావరణం వల్ల అణుధార్మిక ప్రభావాలకు గురై వ్యాధి గ్రస్తులయ్యారు. అణుధార్మికత గల శకలాలు యూరప్ మీద కూడా పడటంతో పంటలు, పాలు వాడుకకు పనికి రాకుండా పోయాయి చాలా కాలం వరకు. ఉత్తరార్ధ గోళమంతా అణుధార్మిక ప్రభావం పడింది. ఇటువంటి సంఘటనల తర్వాతనే అణువిద్యుత్ కేంద్రాలు స్థాపనల్లాంటి వాటి గురించి ప్రపంచం పునరాలోచన చేయవలసి వచ్చింది. ప్రకృతిలో సహజంగా వాటిల్లే పరిణామాల కంటే మానవ ప్రేరిత మార్పులు తెచ్చే ముప్పు అధికంగా ఉంటుంది. మానవ చరిత్రను ప్రకృతి వైపరీత్య సంఘటనలు కూడా సమాధికంగానే బాధించాయి. ముఖ్యంగా వాతావరణ మార్పులు. ఎన్నో ద్వీపాలు మంచు కరగటం వల్ల, అగ్నిపర్వతాలు పేలడం వల్ల నివాస యోగ్యం కాకుండా పోయాయి. 1883లో క్రాకటోనా ద్వీపంలోని అగ్నిపర్వత విస్ఫోటనాలు ద్వీపాన్ని ధ్వంసం చేశాయి. 36,000 మంది చనిపోవటమే కాకుండా వాతావరణంలో ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులకు కారణమైంది. ఇక భూకంపాల్లాంటివి సృష్టించే విధ్వంసాలు తక్కువేమీ కాదు.

1755లో భూకంపం లిస్బన్‌ను శిథిలం చేసింది. దీనినే గ్రేట్ లిస్బన్ భూకంపం అని పేరు. పోర్చుగల్‌ను అతలాకుతలం చేసింది. వేర్వేరు జీవరాశుల జనాభాచక్రాలు అభివృద్ధి, క్షీణతలను చూశాయి. ఈస్ట్ ఆఫ్రికా, యితర ఖండాలలోని ప్రాంతాలలో క్రమం తప్పని మిడతల దండు బారిన పడి పంటలు ధ్వంసమయ్యాయి. ఆకస్మికంగా విరుచుకుపడే వ్యాధులు, వైరస్ విజృంభణలు అనేకం జరిగాయి. యూరప్ జనాభాలో పావు వంతులో జనాభా బ్లాక్ డెత్ వల్ల చనిపోయింది. 1347 నుండి 1351 మధ్య కాలంలో మధ్యయుగాల ఆర్థిక, రాజకీయ నిర్మాణాలను సమూలంగా మార్చివేసింది. గత సంఘటనలను అధ్యయనం చేయటం వలన ప్రజలు పర్యావరణాన్ని మార్చుకోవటమే కాకుండా, పర్యావరణ ప్రభావాలు మానవ సమాజాన్ని మార్చాయి.



పర్యావరణ చరిత్ర లక్ష్యం మనుషులు భాగంగా ఉన్న ప్రాకృతిక సమాజాలతో కాలక్రమంలో వాటి సంబంధాల అధ్యయనం చేయటం, ఆ సంబంధాన్ని ప్రభావితం చేసే మార్పుల ప్రక్రియలను స్పష్టంగా వివరించటం ఒక విధానంగా పర్యావరణ చరిత్ర పర్యావరణ విశ్లేషణ మానవ చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. వివిధ జీవరాశులు ఒక దానిపై ఒకటి ఎటువంటి ప్రభావాలను కలిగి ఉంటుందో అధ్యయనం చేస్తుంది. సహజ శక్తులు భిన్న వ్యవస్థలు మానవులపై చూపే ప్రభావం, మానవ చర్యలు వివిధ మానవేతర ప్రాణులు, అస్తిత్వాలను ఏ విధంగా ప్రభావిత పరుస్తాయో కూడా అధ్యయనం చేస్తుంది. పర్యావరణ చరిత్రకారులు సజీవ, నిర్జీవ వ్యవస్థలు భూమిపై మానవ కార్యకలాపాలను ప్రభావితం చేయడాన్ని గుర్తిస్తారు.


అలాగే సహజ ఆవరణ వ్యవస్థలో మానవ చర్యలు మార్పులు ప్రభావాలను మూల్యాంకనం చేస్తారు. పర్యావరణ చరిత్ర ఒక్కటే మిగిలిన ఏ అవగాహనా పద్ధతుల కన్నా అధికంగా మానవులకు యితర జీవరాశులలో గత సంబంధాలను అర్థం చేసుకోగలుగుతుంది. ఇతర సంప్రదాయ ఆర్థిక, సామాజిక, రాజకీయ చారిత్రక విశ్లేషణా రూపాలకన్నా పర్యావరణ చరిత్ర సరైన పద్ధతిలో అవగత పరచుకోగలుగుతుంది. అంతే కాదు పర్యావరణ చరిత్ర యితర విశ్లేషణా రూపాలను సవాలు చేయగలుగుతుంది.

పర్యావరణ చారిత్రక కథనం మానవ సమాజాలలోని మార్పుల సమాహారం, ఈ మార్పుల సమాహారం పర్యావరణంలో వచ్చిన మార్పులను నమోదు చేస్తుంది.

చరిత్రలాగానే పర్యావరణ చరిత్ర మానవీయమైన విచారణ లేదా దర్యాప్తు లాంటిది. పర్యావరణ చరిత్రకారుల ఆసక్తి అంతా ప్రజలు ప్రకృతి గురించి ఏమి భావించేవారు ఆ భావనలను ఏ విధంగా జానపద మత సంబంధ గాథల్లో, జనామోద సంస్కృతి, సాహిత్యం, కళల్లో ఏ విధంగా అభివ్యక్తం చేశారో అనే విషయంపై ఆసక్తిని కలిగి ఉంటాయి. అందువల్లనే పర్యావరణ చరిత్ర అంటే అది భావాలు, సంస్కృతులు చరిత్ర కూడా అవుతుంది.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

TELANGANA RESOURCE CENTRE



# తెలుగునేలకు తొలి శిల్పాలనందించిన తెలంగాణా!

శిలను ఉలితో చెక్కి తీర్చిదిద్దిన బొమ్మను శిల్పం అంటారు. ముందుగా మట్టి, ఆ తరువాత కొయ్య, ఆ తరువాత రాయి, ఆపైన లోహం, ఇంకా ఇతర ధాతువులతో శిల్పాలు రూపు దిద్దుకొన్నాయి. తెలుగునేలపై పాతరాతి యుగంలో ముడిరాతిని ముతక పనిముట్లుగా చేసిన తొలి ప్రయత్నం, మధ్య రాతియుగంలో నునుపైన కొనలు గల చిన్న పనిముట్లకు దారి తీసింది. ఆ తరువాత ఆలోచనలు పెరిగి, అనుభవం నేర్పిన పాఠాలతో, నాణ్యమైన రాతిని ఎంపిక చేసుకొని, కొనలు మొనదేలేట్లు అరగదీసి, పదునైన రాతిగొడ్డళ్లను తయారించి, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన కాలాన్ని కొత్తరాతి యుగమన్నారు. ఆ దశను దాటి, రాగి లోహాన్ని కనుగొన్న తరువాత, ఆదిమ మానవుని జీవితంలో కొత్త పోకడలు నడకలు నేర్చుకొన్నాయి. దీన్ని రాగి రాతి యుగమన్నారు.

రాగి-రాతియుగం చివరి రోజుల్లో సా.శ. ముందు 2000-1750 ప్రాంతంలో మరో వింత, నాటి మానవ మేధస్సులో పాల పుంతలా మెరిసింది. ఆ నేపథ్యంలో ఇనుముకు నిప్పు కణం తోడై, రకరకాల పనిముట్లకు దారితీసి, విప్లవాత్మక జీవన విధానానికి నాంది పలికింది. అదే ఇనుపయుగం. తాముండే నివాసాలకు బదులు మరణించిన వారి కళేబరాలను నిక్షిప్తం చేసే ప్రక్రియలో, భాగంగా సమాధులను కట్టుకోవటం ప్రారంభించారు. గుంటలోపల, గదుల్లోనూ, శవాలను పాతి, పాతరపై ఎత్తుగా మట్టిని కప్పి, చుట్టూ బండరాళ్లను గుండ్రంగా అమర్చి, మరణించిన వారికి గుర్తుగా పక్కనే ఒక నిలువురాతిని పాతటం ఇనుపయుగపు ఆచారమైంది.



ఖమ్మం జిల్లా
పదుగోనిగూడెం వద్ద
బయల్పడిన శిలూవాకారంపై
చనిపోయిన స్త్రీ బొమ్మ
(క్రీ.పూ. 500)



ఇదుగో ఇక్కడ పుట్టుకొచ్చిందో కొత్త ఆలోచన. మరణించిన వారు ఆడ, మగ అనే తేడా తెలిసేట్లు, రాతి పరుపుపై ఆకారాలను రాసుకొని, అప్పటికే అందుబాటులో ఉన్న ఇనుప ఉలి, సుత్తెలకు పని జెప్పి, తొట్టతొలి శిల్పాలను కల్పించిన ఘనతను దక్కించుకొంది తెలంగాణా.

ఖమ్మం జిల్లా పదుగోనిగూడెం, గుండాల, కాంచనపల్లి, గలభగూడెం, జానంపేట, వరంగల్ జిల్లా కాటారం, గంగారం, దామరవాయిలలో శిలువ లాంటి రాతి కడ్డీలపై మగవారిని సాదాగానూ, ఆడవారిని స్థనాలతోనూ చెక్కి, శిల్పకళకు పురుడుబోసిన ఈ ఆనవాళ్లు తెలంగాణా చరిత్రలో మైలురాళ్లు!

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీలోనూ...

# దక్కన్ ల్యాండ్ జైత్రయాత్ర...!!

- **గత మేలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీ విభాగంలో దక్కన్‌ల్యాండ్ వ్యాసాల నుండి 50 మార్కుల వరకూ ప్రశ్నలు వచ్చిన వైనం**
- **తెలుగు రాష్ట్రాల గ్రూప్స్ అభ్యర్థులకు దారిదీపంలా "రచయిత పుట్టా పెద్ద ఓబులేసు" వ్యాసాలు**

**2024** అక్టోబర్‌లో జరిగిన టీజీపీఎస్సీ విభాగంలో గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీ విభాగంలో 100కు పైగా మార్కులకు దక్కన్ ల్యాండ్ వ్యాసాల నుండి ప్రశ్నలు వచ్చి, ఉభయ తెలుగు రాష్ట్రాలలో దక్కన్‌ల్యాండ్ సంచలనం సృష్టించిన విషయాన్ని మరువక ముందే, గత మే నెలలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ సైన్స్ & టెక్నాలజీ విభాగంలోనూ దక్కన్ ల్యాండ్ ప్రభంజనం సృష్టించింది. ఈ విభాగంలో మొత్తం 150 మార్కులకు గానూ, 50 మార్కుల వరకూ, దక్కన్‌ల్యాండ్ వ్యాసాల నుండే ప్రశ్నలు రావడంతో గ్రూప్స్ అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.


సాంకేతిక రంగానికి నిరంతర సవాల్

@ సైబర్ సెక్యూరిటీ..!!



"సైబర్ సెక్యూరిటీపై ఆగస్ట్-2024లో దక్కన్‌ల్యాండ్‌లో ప్రచురితమైన వ్యాసం"

సైన్స్ & టెక్నాలజీ ప్రశ్నల సరళిని గురించి పలువురు గ్రూప్స్ ఆస్పిరెంట్స్‌ను దక్కన్‌ల్యాండ్ పలుకరించినపుడు స్టాటిక్ పార్ట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని విభిన్న సంస్థలను గురించి రాయమని ప్రశ్నలు అడగడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ, దక్కన్‌ల్యాండ్ మాత్రం మమ్మల్ని ఎక్కడా నిరాశ పరచలేదని సమకాలీన అంశాలకు సంబంధించిన అంశాలను పరీక్ష కోణంలో అంచనా వేయడం కొంత సంక్లిష్టంగా ఉంటుందని, అయితే దక్కన్ ల్యాండ్‌లో రచయిత పుట్టా పెద్ద ఓబులేసు గారి వ్యాసాలను అనుసరించడంతో, మా ప్రిపరేషన్ సులువైందని సుమారు 5 ప్రశ్నలు దక్కన్‌ల్యాండ్ వ్యాసాల నుండి రావడంతో దక్కన్ ల్యాండ్ పై మా నమ్మకం ద్విగుణీకృతమైందని పలువురు అభ్యర్థులు తెలిపారు.

ప్రధానంగా సైబర్ నేరాన్ని నిర్వచించి, భారతదేశంలో ప్రబలంగా ఉన్న సైబర్ నేరాలను చర్చించండి అన్న ప్రశ్న వచ్చింది. ఈ అంశంపై ఆగస్ట్ 2024 సంచికలో సవివరణాత్మక వ్యాసం ప్రచురితమైంది. ఇంకా గృహ వ్యవస్థల ఆటోమేషన్‌పై ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ప్రభావాన్ని చర్చించండి? అన్న ప్రశ్న వచ్చింది. దీనిపై కూడా గతంలో దక్కన్ ల్యాండ్‌లో వివరణాత్మక వ్యాసం ప్రచురితమైంది. వ్యాక్సిన్లకు సంబంధించి కూడా ప్రశ్నవచ్చింది. దీనిపై దక్కన్‌ల్యాండ్ డిసెంబర్ 2023 సంచికలో విపులమైన వ్యాసాన్ని ప్రచురించడం జరిగింది. సంప్రదాయ మరియు సాంప్రదాయేతర ఇంధన వనరులకు సంబంధించి ప్రశ్న వచ్చింది. ఇదే అంశానికి సంబంధించి టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో జనరల్ ఎస్సే వచ్చింది. ఈ అంశంపై అక్టోబర్ - 2024లో సమగ్రమైన వ్యాసాన్ని ప్రచురించింది. అదేవిధంగా జెనెటిక్ ఇంజనీరింగ్‌కు సంబంధించి కూడా ప్రశ్న వచ్చింది. ఈ అంశంపై కూడా గతంలో దక్కన్ ల్యాండ్‌లో వ్యాసం ప్రచురితమైంది.

– జి. విజయ్‌కుమార్

### వర్తమాన సాంకేతిక అంశాలలో మైలురాళ్లుగా నిలిచే వ్యాసాలు



అత్యంత సంక్లిష్టమైన వర్తమాన సాంకేతిక అంశాలను సులభమైన శైలిలో మరియు సరళీకృత విధానంలో రాయడం వల్ల "దక్కన్‌ల్యాండ్"లో పుట్టా పెద్దఓబులేసు గారు రాసే వ్యాసాలు ఉభయ తెలుగు రాష్ట్రాల సివిల్స్ మరియు గ్రూప్స్ రాసే తెలుగు మీడియం అభ్యర్థులకు బహుళప్రయోజనకరంగా ఉన్నాయి.

సమకాలీన సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలను ఔపోసన పట్టడంలో సరైన మార్గనిర్దేశకత్వం కొరవడిన ప్రస్తుత పరిస్థితులలో పుట్టా పెద్దఓబులేసుగారు రాసే వ్యాసాలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు దిక్సూచిలాగా తోడ్పడుతున్నాయి.

గతంలో జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-1 ఎస్అండ్‌టి విభాగంలో 100 మార్కులుపైగా మరియు ఇటీవల జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 "సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు పర్యావరణ సమస్యలు" విభాగంలో 50 మార్కులు పైబడి ప్రశ్నలు నేరుగా పుట్టా పెద్దఓబులేసుగారి వ్యాసాలు నుండి రావడం, ఆ వ్యాసాల యొక్క విశ్వసనీయతను ద్విగుణీకృతం చేసింది. ఈ వ్యాసాలను నిరంతరం అనుసరించిన ట్లయితే రాబోయే సివిల్స్ మరియు గ్రూప్స్ పరీక్షల్లో కూడా మెరుగైన ప్రయోజనాలు పొందగలరనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇంతటి విలువైన వ్యాసాలు రాస్తున్న పుట్టా పెద్దఓబులేసు గారిని **"టెక్నోగురు"**గా అభివర్ణించడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు అని నేను నమ్ముతున్నాను. ఇలాంటి సాంకేతికత నైపుణ్యం కలిగిన యువ రచయితలను ప్రోత్సహిస్తున్న "దక్కన్ ల్యాండ్" యాజమాన్యానికి నా ప్రత్యేకమైన ధన్యవాదాలు.

– జి. విజయ్‌కుమార్, గ్రూప్స్-1 ఆస్పిరెంట్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్
(పంచాయితీరాజ్ & రూరల్ డెవలప్‌మెంట్)
విజయనగరం, ఆంధ్రప్రదేశ్

## అసమానం, అజేయం, అత్యున్నత సాంకేతికతల సమ్మిళితం..

# @ ఆపరేషన్ సింధూర్..!!

సింహంతో వేట-ఇండియాతో ఆట ఎంత ప్రమాదకరమో మనదాయాది దేశం పాకిస్తాన్‌కు తెలిసినంతగా, మరెవ్వరికీ తెలియదంటే, అతిశయోక్తి కాదేమో!! గత ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ప్రేరిపిత తీవ్రవాదులు, అత్యంత పాశవికంగా దాడి జరిపి 26 మంది సాధారణ పౌరులను హతమార్చినందుకు ప్రతిగా, గత మే 7న భారత సైన్యం "ఆపరేషన్ సింధూర్"పేరుతో పాకిస్తాన్‌లోని 9 తీవ్రవాద స్థావరాలపై అత్యంత ఖచ్చితత్వంతో దాడులు జరిపి పదుల సంఖ్యలో తీవ్రవాదులను హతమార్చడంతో పాకిస్తాన్ చిగురుటాకులా వణికి పోయింది. ఈ దాడులలో భారత సైన్యం వినియోగించిన అధునాతన సాంకేతిక రక్షణ వ్యవస్థలపై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఆ సాంకేతిక యుద్ధ వ్యవస్థలను రక్షణ రంగ నిపుణులు ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

i) గైడెన్స్ మరియు నావిగేషన్ వ్యవస్థలు ii) ఖచితత్వంతో కూడిన మార్గ దర్శక ఆయుధాలు iii) గగనతల రక్షణ (ఎయిర్‌డిఫెన్స్) వ్యవస్థ iv) స్వయం చోదిత, మానవ రహిత వాహనాలు. వీటిని గురించి ఇప్పుడు విపులంగా చర్చిద్దాం.

**1) గైడెన్స్ మరియు నావిగేషన్ వ్యవస్థలు:**


పహల్గాం తీవ్రవాద దాడికి ప్రతీకారంగా గత నెల 7వ తేదీన పాక్ ఆక్రమిత కశ్మీర్ మరియు పాకిస్తాన్ లోని బహావల్‌పూర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై, అదేవిధంగా మే 10వ తేదీన పాకిస్తాన్‌లోని 8 ఎయిర్ బేస్‌లపై పిన్‌పాయింట్ స్థాయి ఖచ్చితత్వంతో భారత సైన్యం దాడులు జరిపింది.

పాక్ సాధారణ పౌరులకు గానీ, జనావాసాలకు గానీ అణువంతైనా నష్టం జరగకుండా లక్ష్యాలను ఛేధించడం వెనుక మనదేశం యొక్క అత్యంత ఆధునిక గైడెన్స్ మరియు నావిగేషన్ వ్యవస్థల యొక్క పాత్ర ఉంది. వాటిని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

**i) నావిక్ (NAVIC):**

ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (IRNSS), దీనినే నావిగేషన్ విత్ ఇండియన్ కన్సల్టేషన్ (NAVIC) అని పిలుస్తారు. ఇది భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అభివృద్ధి చేసిన ఒక స్వతంత్ర, స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థగా చెప్పవచ్చు. ఇది భారతదేశం యొక్క పూర్తి నియంత్రణలో ఉంటుంది. అంతరిక్ష విభాగం, గ్రౌండ్ సెగ్మెంట్ మరియు యూజర్ రిసీవర్లు అన్నీ భారతదేశంలోనే నిర్మించబడతాయి.

ఇతర దేశాల నావిగేషన్ ఉపగ్రహవ్యవస్థలపై ఆధారపడకుండా, భారత వ్యూహాత్మక రంగాల (రక్షణ మరియు కమ్యూనికేషన్) స్వతంత్ర ప్రతిపత్తి కోసం నావిక్ ప్రాజెక్ట్2018లో అమలులోకి వచ్చింది.



నావిక్ - నమూనా చిత్రం

**పనితీరు:**

నావిక్ ఒక ప్రాంతీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ. ఇది ఏడు ఉపగ్రహాల సమూహం. ఇందులో 3 ఉపగ్రహాలను జియో సింక్రోనస్ ఆర్బిట్ (జీఎస్ఓ)లోనూ, మిగిలిన నాలుగు ఉపగ్రహాలను వంపు తిరిగిన జియో స్టేషనరీ అర్త్ (జీఈఓ) ఆర్బిట్‌లోనూ ఉంచారు. ఇది భారత సరిహద్దు నుండి 1500 కి.మీ. పరిధిలో ఉన్న ప్రాంతానికి ఖచ్చితమైన, విస్తృతమైన నావిగేషన్ పొజిషన్ మరియు టైమింగ్ సేవలను అందిస్తుంది. ఈ సేవలు రెండురకాలుగా ఉంటాయి.

**స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్:** ఇది అందరు వినియోగదారులకు అందించబడుతుంది.

**రిస్ట్రిక్టెడ్ సర్వీస్:** ఇది అధీకృత వినియోగదారులకు అందించే ఎన్‌క్రిప్టెడ్ సేవ. నావిగేషన్ వ్యవస్థలో అమెరికా అభివృద్ధి పరిచిన జీపీఎస్ ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. దీని ద్వారా ప్రపంచంలో ఏ ప్రాంతానికైనా సేవలు అందించవచ్చు. జీపీఎస్ 31 ఉపగ్రహాలను కలిగి ఉంది. జీపీయస్ 20 మీ॥ లక్ష్యాన్ని స్పష్టంగా గుర్తిస్తే, నావిక్ మరింత స్పష్టంగా 5 మీ॥లోపు లక్ష్యాన్ని కూడా స్పష్టంగా గుర్తించే, సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి జీపీయస్ కన్నా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇంకా రష్యా-గ్లోనాస్, యూరోపియన్ యూనియన్ - గెలీలియో, చైనా-బిడౌ పేరుతో స్వతంత్ర నావిగేషన్ వ్యవస్థలను కలిగి ఉన్నాయి.

**ii) కార్టోశాట్:** భూమికి సంబంధించిన చిత్రాలను హైరిజల్యూషన్ నాణ్యతో, మ్యాప్‌ల రూపంలో చిత్రీకరించడాన్ని 'కార్టోగ్రఫీ" అంటారు. కార్టోశాట్-1 నుండి కార్టోశాట్-3 వరకు

3 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఇప్పుడు కార్టోశాట్ సిరీస్‌లో మూడవతరం ఉపగ్రహమైన కార్టోశాట్-3 సేవలందిస్తోంది. ఈ ఉపగ్రహం భూమిపై 0.25 మీ॥ కనిష్ట విస్తీర్ణం ఉన్న ప్రాంతాన్ని కూడా పాంక్రోమాటిక్ రిజల్యూషన్‌తో చిత్రీకరిస్తుంది. దీంతో మన దేశ సరిహద్దుకు అవతలివైపు. పాకిస్తాన్‌లో ఉన్న ప్రతి నిర్దిష్ట లక్ష్యాన్ని అత్యంత స్పష్టంగా గుర్తిస్తుంది.

**iii) రిశాట్ (RISAT):** దీనినే రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ అంటారు. వీటిని ఇస్రో అభివృద్ధి పరిచింది. ఈ రిశాట్ శ్రేణి ఉపగ్రహాలు రాత్రి, పగలు తేడా లేకుండా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూమిని పరిశీలిస్తాయి. వాతావరణంలో దట్టమైన మేఘాలు ఉన్నప్పటికీ సాంప్రదాయ ఆప్టికల్ సెన్సార్లను కాకుండా సింథటిక్ అపెర్చర్ రాడార్ (SAR) సాంకేతికతను వినియోగించుకొని భూమిని నిరంతరం పర్యవేక్షిస్తాయి. తద్వారా ఈ ఉపగ్రహాలను నిఘా కార్యాకలాపాల కోసం వినియోగిస్తారు. SAR సాంకేతికత కారణంగా రాత్రి సమయంలో కూడా సరిహద్దుకు ఆవల పాక్ భూభాగంలో ఏం జరుగుతోందో నిశితంగా పరిశీలించవచ్చు. 2016 సర్జికల్ స్ట్రైక్స్ కొరకు రిశాట్-1, రిశాట్-1Aలను ఉపయోగించారు. చొరబాట్లకు వ్యతిరేకంగా భారత సరిహద్దులను పర్యవేక్షించడానికి డిసెంబర్ 2023లో రిశాట్-2 శ్రేణి ఉపగ్రహాలను ప్రయోగించారు.


ఎస్ -400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

**iv) ఈ ఓఎస్ సిరీస్ ఉపగ్రహాలు (EOS SATELLITES):** ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 8ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఈ ఓఎస్-8 ఉపగ్రహాన్ని ఆగస్ట్ 16, 2024న ఎస్ఎస్ఎల్వీ-డీ3 వాహక నౌకద్వారా శ్రీహరికోట నుండి ఇస్రో ప్రయోగించింది. ఈ శ్రేణికి చెందిన ఉపగ్రహాలతో సరిహద్దులను నిరంతరం పర్యవేక్షించవచ్చు. దళాల కదలికలను ట్రాక్ చేయవచ్చు. అనధికార కార్యకలాపాలను గుర్తించవచ్చు.

**2) ఖచ్చితత్వంతో కూడిన మార్గ దర్శక ఆయుధాలు (Precision guided Munitions):** పాకిస్తాన్‌లోని తీవ్రవాద స్థావరాలను భారతసైన్యం ఉపగ్రహాల సహాయంతో స్పష్టంగా గుర్తించిన తరువాత వాటిని నాశనం చేయడానికి అత్యంత అధునాతన క్షిపణులను ప్రయోగించింది. వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

**i) స్కాల్ప్-ఈజీ (SCALP-EG) క్షిపణులు :** దీనిని బ్రిటన్‌లో స్టార్మ్‌షాడో మిసైల్ అని పిలుస్తారు. ఇది స్టెల్త్ (శత్రు రాడార్లకు దొరకకుండా), క్రూయిజ్ (వేటాడే) లక్షణాలతో సుదూర మరియు లోతైన ప్రాంతాలలోని శత్రు స్థావరాలను నాశనం చేయడానికి వినియోగించే ఎయిర్ టు ఎయిర్ మిసైల్. వీటిని రాఫెల్ జెట్ ఫైటర్ల ద్వారా ప్రయోగించారు.

దీని పరిధి 450 కి॥మీ. తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ శత్రు రాడార్లకు దొరకకుండా లక్ష్యాలను ఛేదిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితులలోనూ దీనిని ప్రయోగించే సౌలభ్యం ఉండడం వల్ల భారత వైమానిక దళానికి అధిక కార్యాచరణ సౌలభ్యాన్ని అందిస్తుంది. గైడెన్స్ మరియు నావిగేషన్ వ్యవస్థలను ఉపయోగించుకొని ఈ క్షిపణి బంకర్లు మరియు మందుగుండు సామాగ్రి డిపోల వంటి భారీ బల వర్ధక లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదిస్తుంది. దీనిని యూరోపియన్ బహుళజాతి సంస్థ ఎంబిడీఏ అభివృద్ధి చేసింది.

**ii) హామర్ (HAMMER) క్షిపణులు:** దీనిని Highly Agile and Manoeuvrable Munition Extended Range అని పిలుస్తారు. ఈ క్షిపణిని ఫ్రెంచ్ ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ కంపెనీ అయిన సఫ్రాన్ అభివృద్ధి చేసింది. ఇది గాలిలో నుండి భూమిపైకి ప్రయోగించే రకానికి చెందినది. దీని ద్వారా 70 కి॥మీ పరిధిలోని లక్ష్యాలను ఛేదించవచ్చు. రాఫెల్ జెట్ ఫైటర్లపై అమర్చవచ్చు.

ఈ క్షిపణి స్వయంప్రతిపత్తిని కలిగి, జామింగ్‌కు నిరోధకతను ప్రదర్శిస్తుంది. కఠినమైన భూభాగాలపై తక్కువ ఎత్తు నుండి ప్రయోగించవచ్చు. మధ్యస్థ శ్రేణి వ్యూహాత్మక కార్యకలాపాలకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది.

**iii) బ్రహ్మోస్ క్షిపణులు:** ఇది మన దేశానికి చెందిన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. దీనిని భారతదేశానికి చెందిన డీఆర్‌డీఓ మరియు రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోమేనియా సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి పరిచాయి.

ఈ క్షిపణిని భారతీయ త్రివిధ దళాలలోనూ వినియోగిస్తున్నారు. ఇది మాక్3 వేగానికి దగ్గరగా ప్రయాణిస్తుంది. ఈ క్షిపణికి ఒకసారి టార్గెట్‌ను నిర్దేశించి, ప్రయోగించిన తరువాత ఇక దానికి ఎలాంటి మార్గదర్శకత్వం మరియు నియంత్రణ అవసరం లేకుండానే లక్ష్యాన్ని ఛేదిస్తుంది. దీనినే ఫైర్ అండ్ ఫర్‌గెట్ మోడ్ అని పిలుస్తారు. 200-300 కిలోల సాంప్రదాయ వార్‌హెడ్‌ను మోసుకెళ్తుంది. క్రూయిజ్ ఎత్తు 15 కి॥మీ మరియు టెర్మినల్ ఎత్తు 10 కి॥మీ ఉంటుంది.

**iv) మీటియోర్ క్షిపణులు:** ఈ క్షిపణిని కూడా యూరోపియన్ సంస్థ ఎంబీడీఏ అభివృద్ధి చేసింది. దీనిని నెక్స్ట్ జనరేషన్ ఎయిర్‌టు ఎయిర్ మిసైల్, బియాండ్ (Beyond) విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిసైల్ (BV RAAM) అని పిలుస్తారు. ఇది దట్టమైన ఎలక్ట్రానిక్ యుద్ధ వాతావరణంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది ఘన ఇంధన రామ్‌జెట్ మోటార్‌ను ఉపయోగిస్తుంది. తద్వారా నిరంతర థ్రస్ట్‌ను అందిస్తుంది. ఇది ఎయిర్ టు ఎయిర్ క్షిపణి వ్యవస్థలలో అతి పెద్ద నో ఎస్కేప్ జోన్‌ను నియంత్రిస్తుంది. అనగా టార్గెట్ తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా వెంటాడి దాడి చేస్తుంది.

ఈ క్షిపణులతో మురిద్కే (లష్కరే- ఇ-తోయిబా ప్రధాన స్థావరం), బహావల్‌పూర్ (జైష్-ఏ-మొహమ్మద్ ప్రధాన స్థావరం)లపై

అత్యంత ఖచ్చితత్వంతో భారత సైన్యం దాడులు చేసింది.

భవిష్యత్‌లో శత్రు స్థావరాలను నాశనం చేయడానికి సాధారణ క్షిపణుల మాదిరిగా గతిశక్తిని వినియోగించకుండా విద్యుత్ అయస్కాంత లేదా కణ సాంకేతికత సాంద్రీకృత శక్తిని (లేజర్ కిరణాలను) ఉపయోగించే ప్రత్యక్ష శక్తి నిర్దేశిత ఆయుధాలు (Directed Energy Weapons) తయారు చేసే దిశగా భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పురోగమిస్తోంది.

**3) గగన తల రక్షణ వ్యవస్థ (Air Defence System):** 1921లో ఇటాలియన్ మిలిటరీ జనరల్ Giulio Douhet తను రాసిన "ది కమాండర్ ఆఫ్ ది ఎయిర్" అన్న గ్రంథంలో, భవిష్యత్‌లో జరిగే యుద్ధాలలో వైమానిక దళం (Air Power) ఎలాంటి కీలకపాత్ర పోషించబోతుందో, ప్రత్యర్థి దేశాలను ఎలా ముప్పుతిప్పలు పెట్టబోతోందో సోదాహరణంగా వివరించారు.

ఆపరేషన్ సింధూర్ విషయంలో Douhet చెప్పినట్లుగానే వైమానికదళం కీలక పాత్ర పోషించింది. మే 7న భారత్ దాడి చేసిన వెంటనే, పాకిస్తాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో ప్రతిదాడి చేసింది. అయితే మన దేశంపై చిన్న గీతకూడా పడకుండా మన గగనతల రక్షణ వ్యవస్థ వాటిని విజయ వంతంగా అడ్డుకొని కూల్చేసింది. అదే విధంగా మే 10వ తేదీన పాక్ ఎయిర్ బేస్‌లపై అత్యంత ఖచ్చితత్వంతో దాడులు చేసి మన వైమానికదళం వాటికి భారీగా నష్టాన్ని కల్గించింది. పాక్ క్షిపణులు, డ్రోన్లు విజయవంతంగా కూల్చిన భారత గగనతల రక్షణ వ్యవస్థలో ఈ క్రింది రక్షణ వ్యవస్థలు భాగంగా ఉన్నాయి.



బ్రహ్మోస్ క్షిపణులు

భారత గగన తలాన్ని శత్రుదుర్భేద్యంగా మలిచేందుకు ఐదు అంచెలతో కూడిన క్షిపణి గగనతల రక్షణ వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసింది. భిన్నశ్రేణుల్లో, భిన్న ఎత్తుల్లో శత్రు అస్త్రాలను అడ్డుకునేలా దీన్ని తీర్చిదిద్దింది. ఈ వ్యవస్థను భారత వైమానిక దళంలోని సమీకృత గగతనల ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ (ఐఏసీసీఎస్) సమన్వయం చేస్తూ ఉంటుంది.

**మొదటి దశ -ఖండాంతర క్షిపణి వ్యవస్థ:** దీనిలో రెండు అంచెల్లో ఖండాంతర (బాలిస్టిక్) క్షిపణి రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఇది శత్రుదేశాలు ప్రయోగించిన ఖండాంతర క్షిపణులను అడ్డుకుంటుంది. ప్రస్తుతం ఢిల్లీనగరం ఈ వ్యవస్థ పరిధిలో ఉంది.

ఉదా: అగ్ని-5 క్షిపణి

**రెండవ దశ - ఎస్-400:** భారత్ గగనతలాన్ని రక్షిస్తూ ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థకు మనదేశం "సుదర్శన్ చక్ర" అని పేరు పెట్టింది. దీనిని రష్యాకు చెందిన "అల్మాజ్-అంటే" అన్న సంస్థ అభివృద్ధి పరిచింది. ఇది 400 కి॥మీ పరిధిలోని అస్త్రాలను నేలకూల్చగలదు. 600 కి॥మీ దూరంలోని లక్ష్యాలను గుర్తించగలదు.

**విభాగాలు:** ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థలో రాడార్లు, మిసైల్ లాంఛర్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ అన్ని విభాగాలు ఉంటాయి. రాడార్లలో ఎలక్ట్రానిక్ స్టీర్డ్ ఫేజ్డ్ అరె అన్న రాడార్, జామింగ్ నిరోధకతను కలిగి ఉంటుంది. దీని రాడార్లు మన భూభాగంలోకి ప్రవేశించే 100 వస్తువులను ఒకేసారి గుర్తించి కమాండ్ కంట్రోల్‌కు సమాచారం చేరవేస్తాయి. అక్కడి నుండి గైడెడ్ క్షిపణులు లక్ష్యాలను గుర్తించి వాటిని నేలకూలుస్తాయి. ఏకకాలంలో 6 లక్ష్యాలను నేల కూల్చడం దీని ప్రత్యేకతగా చెప్పవచ్చు. దీనిలో 4 గొట్టాలలో క్షిపణులుంటాయి. ఇవి 3 రకాలు. 1) 40N6- పరిధి 400 కి॥మీ 2) 48N6 - పరిధి 250 కి॥మీ. 3) 9 M96 E - పరిధి 40-120 కి॥మీ. 9 M 96Eలో తిరిగి 9M $96E_1$ -40 కి॥ మీ, 9M $96E_2$ - 12 కి॥ మీ అనే రకాలు ఉంటాయి. మూడు రకాల క్షిపణులు (మొత్తం నాలుగు) ఉంటాయి.

**వేగం:** ఎస్-400 వ్యవస్థలోని క్షిపణులు గరిష్ఠంగా గంటకు 17000 కి॥మీ వేగాన్ని (సుమారుగా మాక్14) చేరుకోగలవు. శత్రు భూభాగం నుండి వచ్చే క్షిపణులను 10 మీ॥ నుండి 30 కి॥మీ ఎత్తులో అడ్డగించగలవు.

ఇన్ని ప్రత్యేకతలు కలిగినందున ఎస్-400 భారత రక్షణ వ్యవస్థకు వెన్నెముకగా ఉంటూ శత్రు దేశాల స్టెల్త్ యుద్ధ విమానాలు, క్రూయిజ్ క్షిపణులను, చిన్నపాటి బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను లక్ష్యాన్ని తాకక ముందే నేలకూల్చగలదు. వీటిని 2018లో ఇండియా, రష్యా నుండి కొనుగోలు చేసింది. ప్రస్తుతం రష్యా ఎస్-400ను ఆధునీకరించి ఎస్-500 అనే గగనతల రక్షణ వ్యవస్థను తయారు చేస్తోంది.

**మూడవ దశ - ఎంఆర్‌శామ్ /బరాక్-8:**

ఎంఆర్‌శామ్ (MRSAM)నే మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ లేదా బరాక్ 8 అని పిలుస్తారు. ఇందులో కూడా $360^0$లో నిరంతరం పర్యవేక్షించే రాడార్లు, కమాండ్ మరియు కంట్రోల్ వ్యవస్థ మరియు క్షిపణులు ఉంటాయి.

ఈ వ్యవస్థ భారత గగనతల రక్షణ వ్యవస్థలో మధ్య భాగంలో ఉంటుంది. దీనిని భారత్ మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. బరాక్-8 వ్యవస్థ 70-100 కి॥మీ॥ల పరిధిలో మన భూభాగంలోకి ప్రవేశించే శత్రుదేశాల క్షిపణులను, డ్రోన్లను గుర్తించి నేలమట్టం చేయగలదు.

**నాల్గవ దశ - ఆకాశ్ తీర్:** దీనిని తయారీ మనదేశం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో 1980లో ప్రారంభించి 2014లో వైమానిక దళానికి 2015లో సైన్యానికి అప్పగించింది. ఆకాశ్‌తీర్‌లో బహుళ విధులను నిర్వర్తించే "రాజేంద్ర" అన్న రాడార్ వ్యవస్థ ఉంటుంది. ఇది ఏక కాలంలో బహుళ లక్ష్యాలను గుర్తించడంతో పాటు, విభిన్న సంఖ్యలో క్షిపణులకు మార్గదర్శకత్వం వహిస్తుంది. రాడార్ల నుండి కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందిన

మరుక్షణం మాక్2.5 వేగంతో క్షిపణులు టార్గెట్ వైపు దూసుకెళ్ళి దానిని తుత్తునియలు చేస్తాయి. ఆకాశ్ తీర్‌లో ఆకాశ్, క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ వ్యవస్థ ఉండగా ఆకాశ్-ఎన్‌జీ (న్యూ జనరేషన్) అభివృద్ధి దశలో ఉంది. ఆకాశ్ పరిధి 30-50 కి.మీ, ఆకాశ్ ఎన్‌జీ-70 కి.మీ, క్యూఆర్‌శామ్ పరిధి 30 కి.మీగా ఉంటుంది. ఆకాశ్ తీర్ వ్యవస్థ తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లను కూల్చి వేస్తుంది.

**అయిదో దశ - బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ (బీఎండీ):** శత్రు దేశాల నుండి వచ్చే క్షిపణులను నిరోధించడానికి బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను మనదేశం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసింది. ఇందులో..

**పృధ్వీ ఎయిర్ డిఫెన్స్ :** 50-80 కి.మీ ఎత్తులోని లక్ష్యాలపై ఇది పనిచేస్తుంది. 2వేల కి.మీ పరిధి కలిగిన ధ్వని వేగాని కన్నా 5 రెట్లు ఎక్కువ వేగం (మ్యాక్5)తో దూసుకెళ్ళే క్షిపణులను కూడా ఇవి లక్ష్యంగా చేసుకోగలవు.



నాగస్త్ర డ్రోన్

**అడ్వాన్స్ ఎయిర్ డిఫెన్స్ (ఏఏడీ):** ఇది నేల నుండి 30 కి.మీ ఎత్తులోని లక్ష్యాలను ఛేదించగలదు. ఏఏడీ ప్రధానంగా 2 వేల కి.మీ లోపు పరిధి గల స్వల్ప, మధ్య శ్రేణి క్షిపణులను కూల్చగలదు.

2028-29 నాటికి ఇజ్రాయిల్ ఐరన్ డోమ్ క్షిపణి నిరోధక వ్యవస్థ తరహాలో విస్తృతశ్రేణిలో క్రూయిజ్ క్షిపణులు, స్టెల్త్ ఫైటర్ జెట్‌లను కూల్చగలిగే విధంగా దీర్ఘశ్రేణి వాయు రక్షణ వ్యవస్థను రూపొందించేందుకు **"ప్రాజెక్ట్ కుశ"** పేరుతో డీఆర్‌డీఓ కృషి చేస్తోంది.

ఇందులో 150 కి.మీ, 200 కి.మీ మరియు 350 కి.మీ పరిధి కలిగిన ఇంటర్ సెక్టర్ క్షిపణులు వివిధ దూరాలలో శత్రు లక్ష్యాలను గుర్తించి, ఛేదించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

**4) మానవ రహిత వాహనాలు / డ్రోన్లు (లాయిటరింగ్ మ్యునిషన్స్):** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని తీవ్రవాద స్థావరాలను నిర్వీర్యం చేయడంలో సంచరించే ఆయుధాలు (లాయిటరింగ్ మ్యునిషన్స్) కీలక పాత్ర పోషించాయి. సాంప్రదాయ క్షిపణుల మాదిరిగా కాకుండా, టార్గెట్‌పై దాడి చేయడానికి సరైన సమయం కోసం వేచి ఉండి, తదుపరి దాడి చేయడం లాయిటరింగ్ మ్యునిషన్స్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. వీటిని క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

**i) కామికాజ్ డ్రోన్లు:** వీటినే ఆత్మాహుతి డ్రోన్లు అని కూడా అంటారు. కామికాజ్ అన్నది జపనీస్ పదం. **ఈ పదానికి** Divine wind **(దైవిక గాలి) అని అర్థం.** రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ యొక్క "కామికాజ్ పైలెట్లు" నుండి ఆపేరు వచ్చింది. ఈ పైలెట్లు ఉద్దేశపూర్వకంగా శత్రులక్ష్యాలను ప్రేలుడు పదార్థాలతో నిండిన విమానాలతో ఢీ కొట్టడం ద్వారా ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు.

ఇక కామికాజ్ డ్రోన్ల పూర్తి వివరాలను పరిశీలిస్తే.. ఇవి ప్రేలుడు పదార్థాలతో కూడిన చిన్న మానవ రహిత విమానాలు. వీటిని నేరుగా ట్యాంక్ లేదా దళాల సమూహం పైకి ఎగురవేయవచ్చు. ఇవి లక్ష్యాన్ని ఢీ కొట్టి పేలిపోయి, లక్ష్యాన్ని నాశనం చేస్తాయి. వీటిని రాడార్లతో గుర్తించడం కష్టం.

ఉదా॥కు మనదేశం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో "నాగాస్త్ర" అన్న కామికాజ్ డ్రోన్‌ను తయారు చేసింది. ఇది 1.5 కిలోల పేలోడ్ మోయగలదు. దీని పరిధి 15 కి.మీ. అదేవిధంగా పోలాండ్ తయారు చేసిన వార్మేట్ అన్న కామికాజ్ డ్రోన్లను ఉపయోగిస్తోంది.

**ii) హారప్:** వీటిని ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) తయారు చేసింది. ఇది దీర్ఘశ్రేణి స్టాండాఫ్ లాయిటరింగ్ అటాక్ ఆయుధ వ్యవస్థ. దీనికి మానవ రహిత విమానం, క్షిపణి లక్షణాలు ఉండడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. స్టెల్త్ పరిజ్ఞానంతో లక్ష్య నిర్దేశిత ప్రాంతాలపై ఇది 9 గం॥ల పాటు నిర్విరామంగా ఎగరగలదు. జామింగ్ నిరోధకత కూడా కలదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా భిన్న వాతావరణాల్లో పని చేయగలదు. వీటికి స్వయం ప్రతి పత్తిగల లేదా రిమోట్‌తో నియంత్రణ కూడా చేయవచ్చు. వీటిని 2016లో తొలిసారిగా ఆర్మేనియాపై అజర్‌బైజాన్ ప్రయోగించింది.

హారప్ పరిధి 1000 కి.మీ. అందువల్ల శత్రువుల గగన తలంలో చాలాదూరం వరకు వెళ్ళి దాడులు చేయగలరు. 2009లో 10, 20019లో మరో 54 హారప్‌లను భారత్ ఇజ్రాయిల్ నుండి కొనుగోలు చేసింది. భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునేందుకు ఇండియా 3.5 బి॥ డాలర్ల నిధులు వెచ్చించి 31 ఎంక్యూ-9బి (ప్రిడేటర్) డ్రోన్లను కొనుగోలుచేసేందుకు అమెరికాతో ఒప్పందం చేసుకుంది.

**చివరగా:** ఇండియా తనకు అవసరమైన ఆయుధాల్లో 40 శాతానికి పైగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఆయుధ ఉత్పత్తిలో చైనా స్వయం సమృద్ధి సాధించి అమెరికాను అధిగమించాలని ఉవ్విళ్ళూరుతోంది. అమెరికా ఇండియాకు ఎప్పటికీ విశ్వసనీయ నేస్తం కాదు. కేవలం రష్యాను మాత్రమే నమ్ముకొంటే భారత ఉప ఖండంలోని సంక్లిష్టతలను ఎదుర్కోవడం అంతసులభం కాదు. ఈ నేపథ్యంలో ఇండియా ఆయుధాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలి. ఇందుకొరకు ఈ రంగంలో పరిశోధన మరియు అభివృద్ధి కొరకు భూరి నిధులు కేటాయించి, భారీ సైనిక, పారిశ్రామిక పునాదిని నిర్మించుకోవాలి. అప్పుడే పాకిస్తాన్ లాంటి జిత్తుల మారి దేశాల ఆటకట్టించగలం.

**-పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047

# సమతుల్యం కోల్పోతున్న ప్రకృతి

## జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పంచభూతాలతో మమేకమై సాగిస్తున్న ప్రతి ఒక్కరి మజిలీ మరువలేనిది. ఇదే క్రమంలో మానవ మనుగడకు ఆధారమైన పర్యావరణాన్ని పరిరక్షించుకునే బదులు గొడ్డలిపెట్టు చర్యలకు పాల్పడటం సాధారణమైంది. తరాతరాలుగా ప్రకృతిని ఆరాధించే సంస్కృతిని విడిచి.. పర్యావ'రణం'లో ఇమడలేకపోతున్నాడు. పరిశుభ్రత, పచ్చదనంతో పరిఢవిల్లే నేలతల్లే శ్రేష్ఠమైన జీవనానికి ఏకైక మార్గం అంటూ 'నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం' పిలుపునిస్తోంది. ఉభయ జిల్లాల్లోని ప్రకృతి వినాశక మార్గాలను విడనాడేందుకు ప్రతినబూనాల్సిన తరుణమిదే.

ప్రకృతికి మానవుడికి అవినాభావ సంబంధముంది. అది ఎంత దగ్గర సంబంధమంటే మనిషి ప్రకృతిలో పుడతాడు. ప్రకృతిలో ఆడుతూ పాడుతూ పెరుగుతాడు. ప్రకృతిని ఉపయోగించుకుంటూ ఎదుగుతాడు. చివరకు తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయడానికి కూడా సిద్ధపడతాడు.



ఈ వినాశనానికి అడ్డుకట్ట వేయడానికే ప్రపంచ దేశాలు ఒక వేదిక మీదకు వచ్చి, ఒక్కో సంవత్సరం ఒక్కో దేశంలో మానవుల వల్ల నాశనమవుతున్న పర్యావరణాన్ని కాపాడడానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. అందుకే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకించి ఒక రోజు ఏర్పాటు చేస్తే మంచిదన్న ఉద్దేశ్యంతో జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి.

పెరుగుతున్న కాలుష్యం.. పర్యావరణంలో అసమతుల్యత.. తరిగిపోతున్న పచ్చదనంతో జరుగుతున్న పరిణామాలను మనం చూస్తూనే ఉన్నాం. వాతావరణంలో మార్పులు, భవిష్యత్తులో సంభవించే విపత్తులపై నిపుణులు హెచ్చరికలను వింటూనే ఉన్నాం. అయినా పట్టించుకోవడం లేదు. వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంకా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

### భిన్న వాతావరణంతో సతమతం

రాష్ట్రంలో కొన్నేళ్లుగా భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు, వర్షాకాలంలో వర్షాలు, చలికాలంలో చలి ఎక్కువే నమోదవుతున్నాయి. వాతావరణంలో సమతుల్యత దెబ్బతినడంతో ఇలాంటి పరిస్థితులు ఉంటాయని వాతావరణ నిపుణులు అంటున్నారు. అటవీ సంపద తగ్గిపోయి, ప్లాస్టిక్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందని వారి అభిప్రాయం.

### పెరుగుతున్న భూతాపం

నానాటికి పెరుగుతున్న జనాభా కారణంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా సిమెంట్ రోడ్లు, తారు రోడ్లతో మట్టి అన్నదే కనుమరుగై పోయింది. భూమిలోకి వర్షపు నీరు ఇంకే అవకాశమే లేకుండా పోయింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇళ్లు నిర్మించడం కోసం చెట్లన్నీ నరికేస్తున్నారు. చివరకు పంట పొలాలు కూడా ఇళ్ల స్థలాలుగా మారిపోతుంటే భూతాపం పెరగక ఏమవుతుంది? ఎండలు పెరిగిపోతున్నాయి, వేడి పెరుగుతోంది అంటున్నారే కానీ దానికి కారణం ఎవరు? మనం కాదా! పది మంది నివసించే ప్రదేశంలో 100 మందికి పైగా ఉంటున్నారు. భూగర్భ జలాలన్నీ తోడేస్తున్నారు. అందుకే భూతాపం పెరిగిపోతోంది.

### ప్లాస్టిక్ భూతం

ఇక విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి చేసే హాని అంతా ఇంతా కాదు. ఇలా ఎవరికీ వారు నేనొక్కడినే పడేస్తే ఏమవుతుందిలే! అని అనుకుంటూ ఎవరికి వారు శాయశక్తులా పర్యావరణానికి హాని చేస్తున్నారు.

### మానవుడే ప్రధాన ముద్దాయి

భూమికి అత్యంత హాని చేస్తుంది మానవుడే! ప్రపంచ దేశాల ప్రభుత్వాలు రకరకాల వ్యర్థాలను సముద్రంలోకి పంపిస్తున్నాయి. దీనితో జలాలు కలుషితం అవుతున్నాయి. ఇక ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ఉండనే ఉంది. ఇటీవల కొన్ని సంస్థలు జరిపిన సర్వే ప్రకారం, చివరకు ఎవరెస్టు శిఖరం కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. పర్వతారోహకులు ఆహారపదార్థాలు ఉంచిన ప్లాస్టిక్ కంటైనర్లు తమతో తీసుకెళ్లి అక్కడే వదిలేసి రావడంతో ఈ అనర్థం జరుగుతోంది.

### ప్రకృతి ప్రేమే అసలైన ప్రేమ

ప్రకృతిని ప్రేమించడం కంటే గొప్ప విషయం ఏముంటుంది. అలా ఎవరైనా ప్రకృతిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే పర్యావరణానికి





హాని చేయలేరు. పర్యావరణాన్ని పాడు చేస్తే మానవ వినాశనం తప్పదు.

### మన కర్తవ్యం ఏమిటి?

'నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని' అని ఓ సినీ కవి అన్నట్లుగా ఒకరిని ప్రశ్నించే ముందు, మనల్ని మనం సంస్కరించుకోవాలి. కొన్ని చర్యలు చేపట్టడం ద్వారా పర్యావరణ రక్షణకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.

- బజారుకు వెళ్లేటప్పుడు ఇంటి నుంచి సంచీలు తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి.
- విహారయాత్రలకు వెళ్ళినప్పుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్తకుండీలో వేయాలి. లేదా అన్నీసేకరించి ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌కు అందజేయాలి.
- ప్రతి ఒక్కరు మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలి.
- మీ బంధుమిత్రుల ఇళ్లల్లో పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో వారికి పూల మొక్కను కానుకగా ఇవ్వాలి. మీరు కూడా అలాంటి కానుకలనే స్వీకరించాలి.
- మన పిల్లలకు చిన్న వయసు నుంచే పర్యావరణ ప్రాధాన్యతను తెలియజేసి ప్రకృతి ప్రేమికులుగా మార్చాలి.
- ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ ఉండకుండా, మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలి.
- మన ఇంట్లో చెత్తను మనమే శుభ్రం చేసుకోవాలి.
- మనం నివసించే మన వీధి, మన ఊరు, మన దేశాన్ని కూడా మనమే శుభ్రంగా ఉంచుకోవాలి.
- చివరగా ప్రకృతిని ప్రేమిద్దాం – మనం ఆరోగ్యంగా ఉందాం – మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దాం.



### ప్రపంచ దేశాలు ఏమి చేస్తాయి?

పర్యావరణ దినోత్సవం రోజున ప్రపంచ దేశాలన్నీ ఓ చోట సమావేశమై, భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను తగ్గించడానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చలు జరిపి నష్ట నివారణకు చేయవలసిన కార్యక్రమాల పట్ల తీర్మానాలు చేస్తాయి. అవగాహన కార్యక్రమాలు జరుపుతాయి.

### పాఠశాలల్లో ఇలా!

జూన్ 5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఈ రోజు ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు వివరిస్తారు.


### జూన్ 5నే ఎందుకు?

ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో 1972, జూన్ 5వ తేదీన స్టాక్‌హోంలో మొట్టమొదటి ప్రపంచ పర్యావరణ సదస్సు జరిగింది. అప్పటి నుంచి ఏటా జూన్ అయిదో తేదీ ప్రపంచపర్యావరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఏటా ఒక నినాదంతో పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తారు.

### 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క థీమ్

"ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం", Beat Plastic Pollution అనే ప్రచార హ్యాష్‌ట్యాగ్‌తో. ఈ సంవత్సరం ప్లాస్టిక్ వ్యర్థాల ప్రపంచ సమస్య మరియు పర్యావరణం మరియు మానవ ఆరోగ్యంపై దాని ప్రభావాన్ని పరిష్కరించడంపై దృష్టి కేంద్రీకరించబడింది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) సమాజాలను సమీకరించడానికి మరియు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి, పునర్వినియోగం చేయడానికి మరియు పునరాలోచించడానికి పరిష్కారాలను ప్రోత్సహించడానికి ప్రచారానికి నాయకత్వం వహిస్తోంది. రిపబ్లిక్ ఆఫ్ కొరియా 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం కోసం ప్రపంచ వేడుకలను నిర్వహిస్తోంది.

– జుగాష్ విలి
m : 83094 52998




# ఉమ్మడి కృష్ణా జిల్లా శిలా మరియు ఖనిజ సంపద

ఉమ్మడి కృష్ణా జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మధ్య భాగంలో కలదు. దీనికి ఉత్తరాన తెలంగాణకు చెందిన ఖమ్మం జిల్లా కలదు. దక్షిణంలో గుంటూరు జిల్లా, పశ్చిమంలో పశ్చిమగోదావరి జిల్లా మరియు ఆగ్నేయంలో బంగాళాఖాతం కలదు. కృష్ణానది గుంటూరు, కృష్ణా జిల్లాలకు సరిహద్దుగా నిలుస్తుంది. కొల్లేరు లేక్ కృష్ణా మరియు పశ్చిమ గోదావరి జిల్లాలకు మధ్యలో ఉన్నది.

ఈ జిల్లాలోని దక్షిణ ప్రాంతం డెల్టాయిక్ జోన్ మరియు ఉత్తర భాగం అప్ లాండ్ జోన్‌గా విభజించవచ్చును. అప్‌లాండ్ జోన్‌లో ఎత్తు పల్లాలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలోని నీటి అవసరాలు కృష్ణా నది మరియు దాని యొక్క ఉపనదులు పల్లేరు, మున్నేరు, బుడిమేరు మరియు వీటి డ్రైనేజ్ నెట్‌వర్క్.

ఈ జిల్లాలో ఈస్టర్న్ ఘాట్ సూపర్ గ్రూప్‌కు చెందిన కొండలైట్, చార్నొకైట్ గ్రూప్‌కు చెందిన శిలలు అప్‌లాండ్ జోన్‌లో చూడగలము. ఈ శిలలు స్ట్రైక్ రిడ్జెస్ రూపంలో విజయవాడకు దక్షిణంలో చూడగలము. ఈ శిలల్లో క్వార్ట్జ్, కె.ఫెల్స్‌పార్, గార్నెట్, సిల్లియనైట్, గ్రాఫైట్ ఖనిజాలతో కూడి యున్నవి. ఈశాన్యంలో కాల్క్ గ్రానైట్ మరియు క్వార్ట్జైట్ బ్యాండ్స్‌ని కొండలైట్‌లో చూడగలం.

కృష్ణానదికి ఉత్తరంలో కొండపల్లి కొండ ప్రాంతంలో చార్నొకైట్ శిల యొక్క ఏసిడ్, ఇంటర్‌మీడియట్ వెరైటీస్‌తో పైరాక్సిన్ గ్రాన్యులైట్ ప్యాచెస్‌తో కూడి యుంటుంది. వీటితోపాటు మెటాగ్యాబ్రో మరియు కొంత హైపర్ స్తీన్, క్వార్ట్జ్ గ్రానులైట్‌తో కూడియున్నది. లేయర్డ్ ఇగ్నియస్ శిలలు అనార్తోసైట్, గ్యాబ్రో, ల్యుకోగ్యాబ్రో, నోరైట్ గ్యాబ్రో మరియు పైరాక్సినైట్‌తో పాటు క్రోమైట్ ఓర్ యొక్క బ్యాండ్స్ చార్నొకైట్ శిలలో చూడగలము.

ఈ శిలల్లో N-S ట్రెండ్‌తో కూడిన ఫోలియేశన్ అప్పుడప్పుడు NE - SW మరియు NW - SE దిశలో మలుపు తీసుకుంటుంది. PGCకి చెందిన మిగ్మటైసడ్ నైసెస్ వీటిలో ఓల్డర్ ఎన్‌క్లేవ్స్ రూపంలో ఆంఫిబొలైట్, పైరాక్సిన్ గ్రానులైట్, ఆక్టినోలైట్ శిస్ట్ శిలలను చూడగలము. గ్రేగ్రానైట్ నైస్ చాలా వరకు పశ్చిమ ప్రాంతంలో చూడగలము. ఈ ఆర్క్యన్ శిలలపైన కడప సూపర్ గ్రూప్‌కు చెందిన సెడిమెంటరీ శిలలు కంభం పార్మేశన్‌కు చెందిన శేల్, ఫిలైట్, డొలమైట్, లైమ్‌స్టోన్, క్వార్ట్జైట్ కలవు. వీటిపైన కర్నూలు గ్రూప్‌కు చెందిన బనగానపల్లి కంగ్లామరేట్, క్వార్ట్జైట్ మరియు నార్జిలైమ్‌స్టోన్ ఉన్నవి. పాకాల్ సూపర్ గ్రూప్‌కు చెందిన మైకేశిఎస్ క్వార్ట్జైట్ శిలలు అక్కడక్కడా

నందిగామకు తూర్పు ప్రాంతంలో చూడగలం. గోండ్వానా సూపర్ గ్రూప్‌కు చెందిన తిరుపతి సాండ్‌స్టోన్, గొల్లపల్లి, చింతలపూడి సాండ్‌స్టోన్ మరియు కాంతీ సాండ్ స్టోన్ నూజివీడుకు ఉత్తర, ఆగ్నేయ ప్రాంతాలలో చూడగలము. వీటిపైన రాజమండ్రి సాండ్ స్టోన్ యొక్క చిన్న ప్యాచ్‌ని నూజివీడుకు ఈశాన్యంలో రెడ్ కలర్‌లో ఉంటుంది. కృష్ణానది విజయవాడకు దక్షిణ ప్రాంతంలో తన డెల్టాను నిర్మించుకున్నది. కృష్ణానది విజయవాడ నుండి దక్షిణదిశలో పారి అవని గడ్డ వద్ద రెండుగా చీలి ఒక పాయ తూర్పు దిశలో పారుతుంది. కోడూరు మీదిగా వెళ్లి దివి పాయింట్ వద్ద సముద్రంలో కలిసిపోతుంది. ముఖ్యనది మాత్రం దక్షిణ దిశలోనే పారి నాగాయలంక మీదుగా వెళ్లి ఎదురుమొండి వద్ద మూడు పాయలుగా చీలుతుంది. ఆ తరువాత సముద్రంలో కలిసిపోతవి. సీస్మోటెక్టానిక్ స్టడీ ప్రకారం ఈ జిల్లా మొత్తం సీస్మిక్ జోన్–3గా నిర్ధారించబడినది.

**ఖనిజ సంపద:** ఈ జిల్లాలో క్రోమైట్, డైమండ్, క్లే, లైమ్‌స్టోన్, సల్ఫర్, బెరైటీస్, మైకా నిక్షేపాలు మరియు కృష్ణా – గోదావరి బేసిన్‌లో ఓఎన్‌జీసీ ఆయిల్ మరియు గ్యాస్ కొరకు ఇన్వెస్టిగేషన్ చేసి వీటి రిజర్వ్‌స్‌ని కనుకొన్నారు.

**క్రోమైట్ ($FeCr_2O_3$):** ముఖ్యమైన ఓర్ క్రోమియంకు క్రోమైట్. దీనిని మెటలర్జికల్ పరిశ్రమలో స్పెషల్ స్టీల్స్ మరియు అల్లాయస్ తయారీలో మరియు రిఫ్రాటరీ, కెమికల్ పరిశ్రమలో ఉపయోగిస్తారు. ఈ జిల్లాలో క్రోమైట్ నిక్షేపాలు వీన్స్, లెన్సెస్ రూపంలో సర్పెంటినైజ్‌డ్ అలట్రా బేసిక్ శిలల్లో దొరుకుతుంది. ఈ శిలలు కొండపల్లి హిల్ రేంజస్‌లో ఇబ్రహీంపట్నంకు గంగినేనికి మధ్యలో 12 స్థలాల్లో దొరుకుతుంది. ఇక్కడ చార్నొకైట్ శిలలో పైరాక్సినైట్ బాడీస్ రెండు రకాలు ఎన్‌క్లేవ్స్ రూపంలో చూడగలము. యంగర్ పైరాక్సినైట్ బాడి ఆంటీ ఫార్మల్ ఫోల్డ్ యొక్క ఎక్సియల్ ప్లేన్‌లో క్రొమైట్ లెన్సెస్ N-S నుండి NNW-SSE దిశలో ఉన్నవి. క్రోమైట్ ఈ ప్రాంతాలలో 45.8 నుండి 49.9 శాతం $Cr_2O_3$ ఉంటుంది.

**డైమండ్:** కార్బన్ యొక్క అల్లాట్రియో మార్ఫిక్ ఫార్మ్ మరియు ఖనిజాలలో అన్నిటికన్నా హార్డెస్ట్ మినరల్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డైమండ్ కలిగిన ఫార్మేశన్స్ చాలా వరకు కృష్ణా, పెన్నార్ డ్రేనేజ్ బేసిన్స్‌లోనే దొరుకుతవి. పురాతన కాలంలో క్వాటర్‌నెరీ నదిలోని గ్రావెల్స్ మరియు లేట్ ప్రొటిరో జోయిక్ కంగ్లామరేట్స్‌లో వివిధ ప్రాంతాలలో మైనింగ్ జరిగినట్లు ఆధారాలు ఉన్నవి. అతి ప్రసిద్ధి చెందిన డైమండ్స్: కోహినూర్, గ్రేట్ మొఘల్, ఓర్‌లాఫ్, రిజెంట్, హోప్ మరియు పిట్ ఈ శిలల్లో ఈ ప్రాంతాలలో దొరికినట్టు ఆధారాలతో నిర్ధారించబడినది.

ఈ జిల్లాలో కృష్ణానది యొక్క టెర్రెస్ గ్రావెల్స్‌లో కొల్లూరు, చంద్రాలపాడు, పరిటాల, బట్టినపాడు, కొడవాటికల్లు, పాటెంపాడు మరియు వుస్తపల్లి ప్రాంతాలలో కలవు. జిఎస్ఐ ఈ ప్రాంతాలలో పరిశోధన జరిపినది. 18 మెట్రిక్ టన్నుల డైమండి ఫెరస్ గ్రావెల్ వెలది కొట్టపాలెం వద్ద ఉన్నట్లు నిర్ధారించారు.

**లైమ్‌స్టోన్:** ఈ జిల్లాలో సిమెంట్ గ్రేడ్ మరియు ఫ్లక్స్‌గ్రేడ్ సిమెంట్ నిక్షేపాలు నార్జిలైమ్ స్టోన్‌లో ఉన్నట్లు నిర్ధారించబడినది. సిమెంట్ గ్రేడ్ లైమ్‌స్టోన్ నిక్షేపాలు బుదవాడ, జయంతిపురం, రవిరాల, వేలాద్రి వద్ద కలవు. ఈ నిక్షేపాలు చాలా సిమెంట్ ప్లాంట్స్‌కు కావలసినంత రా మెటీరియల్‌ని సప్లై చేస్తుంది. జగ్గయ్యపేట ప్రాంతంలో ఫ్లక్స్‌గ్రేడ్ లైమ్‌స్టోన్ కొరకు ఇన్వెస్టిగేశన్ జరుపబడినది.

**క్లే నిక్షేపాలు:** క్లే నిక్షేపాలు కృష్ణా నది యొక్క ఫ్లడ్ ప్లేన్‌లో పుష్కలంగా దొరుకుతుంది. క్లేస్ చాలా వరకు హైడ్రోస్ అల్యూమినియం, మాగ్నీషియం మరియు ఐరన్ సిలికేట్స్ గల కెమికల్ కాంపొసిశన్‌తో ఉంటవి. కేయోలినైట్, మాంట్ మొరిలోనైట్, ఇల్లైట్ అనేవి సామాన్యంగా క్లే మినరల్స్. క్లేని సిరామిక్, రిఫ్రాక్టరి, పిగ్మెంట్స్, పేపర్, పేంట్ ప్లాస్టిక్, రబ్బర్, పాటం, టైల్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.

**సల్ఫర్:** కోనా ప్రాంతంలో మచిలీపట్నంకు దక్షిణలో సల్ఫర్ నాచురల్ ఫార్మ్‌లో 10 నుండి 14 హెక్టార్‌లలో టైడల్ ఫ్లాట్ క్లేలో లెన్సెస్ రూపంలో 6M లోతు వరకు దొరుకుతుంది. దీని కాన్సంట్రేషన్ క్రిందికి పోయిన కొద్ది పెరుగుతుంది. దీని ఆరిజిన్ ఆర్గానిక్‌గా నిర్ధారించారు. బాక్టీరియల్ ఎక్టివిటీతో ఏర్పడినట్లు స్టడీ ద్వారా తెలియచేశారు.

**బెరైటీస్:** వీటి నిక్షేపాలు చిన్న మొత్తంలో వేములనర్వ ప్రాంతంలో ఉన్నట్టు నిర్ధారించారు.

**మైకా:** తిరువూరు తాలుకాలోని జమ్మలవాయి దుర్గం, గానవీడు, లక్ష్మీపురం ప్రాంతాలలో మైకా నిక్షేపం యొక్క పురాతన మైనింగ్ సైట్స్‌ని గుర్తించడం జరిగింది.

**అయిల్ మరియు న్యాచురల్ గ్యాస్:** కృష్ణా – గోదావరి డెల్టాలలో ONGC ఆఫ్‌శోర్, ఆన్‌శోర్ ప్రాంతాలలో హైడ్రోకార్బన్ అనామలీస్ ఉన్నట్టు నిర్ధారించిన తరువాత మొట్టమొదటి ఆఫ్‌శోర్ ఎక్స్‌ప్లోరేటరీ వెల్‌ని మచిలీపట్నంకు 60 KM ఈశాన్యంలో మరియు 25 KM సముద్రతీరంకు దూరంగా చేసింది. ONGCకి మరి అక్కడే ఆయిల్ తగిలింది. జూన్, 1980లో. ఆ తర్వాత ONGC వారి పరిశోధనలో 70 స్ట్రక్చర్లను గుర్తించారు. ప్రస్తుతం వారు ఆయిల్–గ్యాస్‌ని కైకలూరు, నర్సాపూర్, రాజోల్, అమలాపురం, భీమనపల్లి, ఎల్.బి.చెర్ల, యెనుసువాని, తాటిపాక ప్రాంతాలలో ఎక్స్‌ప్లోర్ చేస్తున్నారు. ఈ ప్రాంతాలన్ని ఉమ్మడి కృష్ణా – గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా డెల్టా ప్రాంతంలో 6.3 మెట్రిక్ టన్నుల ఆయిల్–గ్యాస్ ఉన్నట్టు ఎస్టిమేట్ చేయబడినది.

**క్రిటికల్ మినరల్స్:** ఈ జిల్లాలోని కోస్తా ప్రాంతంలో బీచ్ సాండ్స్‌లో టైటానియం మినరల్స్, ఇల్మనైట్, రూటైల్ ప్లేసర్ డిపాజిట్ రూపంలో దొరుకుతుంది. టైడల ఫ్లాట్ క్లేలో టైటానియం ఆక్‌సైడ్ ($Tio_2$) 3.1 శాతంగా నిర్ధారించబడినది. దీనితో పాటు వనాడియం, గాలియం, స్ట్రాన్షియం, లీతియం కూడా దొరికే అవకాశాలు పుష్కలంగా వున్నవి. ఇలాంటి కోస్తా ప్రాంతంలో సౌదీ అరేబియా ఆయిల్ ఫీల్డ్స్‌లో లీతియం డిపాజిట్‌ని కనుగొన్నారు. కావున మన కృష్ణా–గోదావరి అయిల్ ఫీల్డ్స్‌లో కూడా దొరికే అవకాశం ఉన్నది.

– కమతం మహేందర్ రెడ్డి,
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



## ప్రాచీన చరిత్రకు నిలువెత్తు నిదర్శనం

# ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్

**దేశం:** భారత్

**దాఖలు చేసిన తేదీ:** 2025 ఫిబ్రవరి 11

**క్రైటీరియా:** (v)(vi)

**కేటగిరీ:** సాంస్కృతికం

**దాఖలు చేసింది:** యునెస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం

**రాష్ట్రం :** తెలంగాణ

**ప్రాంతం:** ముడుమాల గ్రామము, నారాయణపేట జిల్లా

**ప్రావర్టీ:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ

ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ ప్రశాంతమైన స్థలంలో, విధ్వంసానికి గురి కాని ప్రకృతి ఒడిలో ఉంది. చుట్టూరా పొలాలు. ఇక్కడ పురాతన రాళ్ళు మనం మరచిపోయిన యుగంలోకి మనల్ని తీసుకెళ్తాయి. ఈ ప్రాంతపు శాశ్వత కాపలా దారులుగా ఎత్తుగా, నిశ్శబ్దంగా నిలబడి ఉన్న రాళ్లు మనల్ని తిరిగి పాత యుగంలోకి మనల్ని తీసుకెళ్తాయి. ముడుమల్ గ్రామానికి నైరుతి దిశలో సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణ నది ఒడ్డున ఈ ఈ ప్రదేశం ఉంది. ఒక చిన్న కొండతో సహా 80 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. పురాతన కాలపు మానవులు ఈ మెన్హిర్‌లను ఖగోళ విశేషాలతో జాగ్రత్తగా సమలేఖనం చేయడం ద్వారా, అయనాంతం, విషువత్తులు, నక్షత్ర రాశులను గుర్తించడం ఇక్కడి విశేషం. ఈ నిలువురాళ్లతో వారు ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్‌ను ఒక పురాతన అబ్జర్వేటరీగా స్థాపించిన విషయం స్పష్టమవుతుంది. నదికి సామీప్యత మరియు వ్యవసాయ భూములలో దాని ఏకీకరణతో సైట్ సహజ వాతావరణం, ఈ ప్రాంతంలో దాని శాశ్వత ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది.




దాదాపు 3500 నుండి 4000 సంవత్సరాల నాటి ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ దక్షిణాసియాలోని మెగాలిథిక్ సంప్రదాయంలో ఒక ముఖ్యమైన అవశేషంగా ఉంది. ఈ ప్రదేశం మెన్హిర్‌ల (నిటారుగా ఉన్న రాళ్ల) ప్రత్యేక అమరికలకు ప్రసిద్ధి చెందింది. ఈ రాళ్లు ఖగోళ విశేషాలకు అనుగుణంగా జాగ్రత్తగా ఉంచబడ్డాయి. మెన్హిర్లు విస్తృత మెగాలిథిక్‌లో భాగం. ఇందులో సమాధి స్థలాలు, రాతి వృత్తాలు, చెక్కబడిన శిలలు ఉన్నాయి. కాలక్రమేణా, స్థానికులు ఈ రాళ్లను తమ సాంస్కృతిక



వారసత్వంలో భాగం చేసుకున్నారు. వాటిని వారి నమ్మకాలు, ఆచారాలలో చేర్చారు. స్థానికులు ఈ మెన్హిర్‌లను పవిత్రంగా భావిస్తారు. వారు వాటిని "నిలురాళ్ల తిమ్మప్ప" (నిలబడి ఉన్న రాళ్ల తిమ్మప్ప) అని పిలుస్తారు. ఒక ప్రత్యేక మెన్‌హిర్‌ను ఎల్లమ్మ దేవతగా పూజిస్తారు. రాళ్లకు మరియు స్థానిక నమ్మకాలకు మధ్య ఉన్న ఈ సంబంధం ఈ ప్రదేశం శాశ్వత సాంస్కృతిక ప్రాముఖ్యతను ప్రదర్శిస్తుంది.

భౌతికంగా, ఈ ప్రదేశం విభిన్న విభాగాలుగా విభజించబడింది. ఒక భాగంలో, మెన్హిర్లు సాపేక్షంగా దిగువ ప్రాంతంలో కేంద్రీకృతమై, అయనాంతాలతో సంబంధం ఉన్న ఒక అమరికను ఏర్పరుస్తాయి. కొన్ని మెన్హిర్లు వేసవి, శీతాకాల అయనాంతాలలో ఉదయించే, అస్తమించే సూర్యుడితో సమలేఖనమై ఉండడం, పురాతన అబ్జర్వేటరీగా వాటిని ఉపయోగించడాన్ని సూచిస్తున్నాయి. మెన్హిర్‌లకు పశ్చిమాన 400 మీటర్ల దూరంలో, భూభాగం మరింత కొంత కఠినంగా మారుతుంది. ఇది ఒక కొండకు దారితీస్తుంది, ఇక్కడ మెగాలిథిక్ సమాధులను సూచించే బహుళ రాతి వృత్తాలు కనిపిస్తాయి. ఈ కొండ శిఖరాగ్రంలో, ఉర్సా మేజర్ (సప్తర్షి మండలం) నక్షత్ర సముదాయాన్ని ప్రతిబింబించే ఒక అద్భుతమైన క్యూబాయిడ్ ఆకారపు రాక్ బేరింగ్ కప్ మార్క్స్ ఉన్నాయి. రాత్రి ఆకాశం సునిశిత వర్ణన ఈ సైట్ రూపకర్తల అధునాతన ఖగోళ జ్ఞానాన్ని వెల్లడిస్తుంది. ఖగోళశాస్త్రపరంగా సప్తర్షి మండలం నక్షత్ర సముదాయం ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే ఇది ధ్రువ నక్షత్రంతో ముడిపడి వివిధ సంస్కృతులలో గౌరవించబడింది. హిందూ పురాణాలలో ఉర్సా మేజర్‌ను సప్తర్షి మండలంగా వ్యవహరిస్తారు. ఈ నక్షత్రరాశిలోని రెండు నక్షత్రాలైన మెరాక్, దుబేల స్థానం, శతాబ్దాలుగా కీలకమైన నావిగేషనల్ గైడ్ అయిన ధ్రువ నక్షత్రాన్ని సూచిస్తుంది. మెరక్ నక్షత్రాన్ని సంస్కృతంలో పులహ అని అంటారు. మరో నక్షత్రం దుబే. దీనిని సంస్కృతంలో క్రతు అని అంటారు. ఈ నక్షత్రాలు ఉత్తర దిశగా ఉన్న ధ్రువ నక్షత్రాన్ని (పోలారిస్) గుర్తించడానికి సహాయపడతాయి, అందుకే వీటిని 'దిక్సూచి నక్షత్రాలు' (పాయింటర్స్) అని కూడా పిలుస్తారు. శీతాకాలపు సూర్యోదయంతో ఈ రాయి యొక్క అమరిక ఈ ప్రదేశం నిర్మాణంలో ఉపయోగించిన ఖగోళ ఖచ్చితత్వం, చాతుర్యాన్ని మరింత నొక్కి చెబుతుంది.

నైరుతి దిశలో, మెన్హిర్ల ప్రధాన కేంద్రీకరణ నుండి 350 మీటర్ల దూరంలో, ఒక చదునైన శిలపై మరొక కప్ గుర్తులు కనిపిస్తాయి. ఇవి సప్తర్షి మండలం, సింహ నక్షత్రరాశులతో సహా రాత్రి ఆకాశపు మరింత విశాల దృశ్యాన్ని వర్ణిస్తాయి. ఈ ఖగోళ ప్రాతినిధ్యాలలో బృహస్పతి గ్రహం కూడా ఉంది. ఈ కారణంగానే ఇది దక్షిణ ఆసియాలో ఒక గ్రహం తొలి చిత్రణలలో ఒకటిగా నిలిచింది. ఈ మెగాలిథిక్ నిర్మాణాలు, కాస్మిక్ ల్యాండ్‌స్కేప్ మధ్య ఈ సంబంధం పురాతన సమాజాలు ఖగోళాన్ని అర్థం చేసుకోవడానికి, దానికి ప్రాతినిధ్యం వహించడానికి ప్రయత్నించిన మార్గాలపై విలువైన దృక్పథాలను అందిస్తుంది. ఇది విశ్వంతో అనుసంధానం అవ్వాలనే సార్వత్రిక మానవ కోరికను ప్రతిబింబిస్తుంది.

ముదుమల్ మెగాలిథిక్ మెన్హిర్లు స్థానిక ఇతిహాసాలతో కూడా ముడిపడి ఉన్నాయి. ఇవి వారి సాంస్కృతిక ప్రాముఖ్యతను మరింతగా పెంచుతాయి. అలాంటి ఒక గాథ ప్రకారం, ఒక దేవత గ్రామాన్ని సందర్శించి, తనకు ఏదైనా అర్పించాల్సిందిగా కోరింది. కానీ గ్రామస్తులు ఆమెను మోసం చేయడానికి ప్రయత్నించారు. ఆగ్రహించిన దేవత వారిని రాళ్లుగా మారమని శపించింది. దాంతో ఆ గ్రామస్తులు మెన్హిర్లుగా మారారు. చుట్టుపక్కల ఉన్న బండరాళ్లు ఆనాటి గ్రామస్తుల పశువులు, ఇతర జంతువులను సూచిస్తాయని చెబుతారు. ఈ నమ్మకం, దేవత శాపానికి గురవుతారనే భయంతో స్థానికులు మెన్హిర్లను తాకకుండా ఉండేలా చేసింది.

ముదుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ పురాతన మానవ నైపుణ్యానికి, భూమి - ఆకాశం మధ్య కాలాతీత సంబంధానికి ఒక అద్భుతమైన నిదర్శనంగా నిలుస్తుంది. ఖగోళ అమరికల ఏకీకరణగా, ఒక పురాతన అబ్జర్వేటరీగా ఈ సైట్ పాత్ర దీని అత్యుత్తమ సార్వత్రిక విలువను ప్రముఖంగా చాటిచెబుతుంది. ప్రారంభ నాగరికతలు తమ ప్రపంచాన్ని గమనించిన, అర్థం చేసుకున్న మార్గాల గురించి అరుదైన సంగ్రహావలోకనం అందిస్తుంది. ఈ మెగాలిథిక్ నిర్మాణాలు, వాటి శాశ్వత భౌతిక, సాంస్కృతిక ప్రాముఖ్యతతో, వాటిని నిర్మించిన పురాతన ప్రజల సృజనాత్మక, శాస్త్రీయ స్ఫూర్తిని కలిగి ఉంటాయి.





### అత్యుత్తమ సార్వత్రిక విలువ సమర్థన

ముదుమల్ మెన్హిర్లు భారతదేశంలో అత్యంత విస్తారమైన, జాగ్రత్తగా సంరక్షించబడిన మెగాలిథిక్ ఖగోళ పరిశీలన ప్రదేశాలలో ఒకటి. ఇవి బండరాళ్ల అమరికలు, నిర్మాణాలు, రాతి వృత్తాల సంక్లిష్ట, కచ్చితమైన అమరికను ప్రదర్శిస్తాయి. మధ్య ప్రాంతంలో, రెండు విభిన్న రకాల మెన్‌హిర్ల కేంద్రీకరణ సైట్ ప్రత్యేకతను మరింత పెంచుతుంది. ముఖ్యంగా, ఉత్తర విభాగంలో తిమ్మప్పగా పూజించే, స్థానికంగా నిలురాళ్ళ తిమ్మప్ప (నిలబడి ఉన్న రాళ్ల తిమ్మప్ప అని అర్థం) అని పిలువబడే ఒక నిర్దిష్ట మెన్హిర్ ఉంది. అది ఈ సైట్ సాంస్కృతిక ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఈ మెన్‌హిర్లకు గౌరవనీయ స్థానాన్ని కల్పించింది. వాటిని మానవుల వల్ల వాటిల్లే హాని నుండి సమర్థవంతంగా రక్షించింది.

వెయ్యికి పైగా బండరాళ్ల రాళ్ళు సైట్ అంతటా విభిన్న అమరికలను సృష్టిస్తాయి. ఈ అమరికల కచ్చిత మైన విన్యాసాన్ని నిర్ణయించడానికి చాలా జాగ్రత్తగా కృషి చేయడం, ఊహాత్మక పునర్నిర్మాణం అవసరం. ఈ మెన్హిర్లు, బండరాళ్లను ప్రత్యేకంగా నిలబెట్టింది వాటి అద్భుతమైన గణిత ఖచ్చితత్వం. నిలువు రాళ్ళు, బండరాళ్ల రెండింటి అమరికలు, విన్యాసాలలో సప్తర్షి మండలం నక్షత్ర సముదాయాన్ని వర్ణించే గుర్తులు ఉన్నాయి, ఇది దక్షిణ ఆసియాలో మొట్టమొదటి ఖగోళ ప్రాతినిధ్యంగా గుర్తించబడింది. ఇది ఒక అబ్జర్వే టరీగా సైట్ పనితీరును మరింత సూచిస్తుంది.

ముదుమల్ కు సంబంధించి ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, బండరాళ్లపై ఉన్న గుర్తుల ద్వారా ఆకాశ పటాల చిత్రణ. మొదట్లో ఇక్కడ సైట్‌లో ఎత్తైన ప్రదేశానికి సమీపంలో నిలువుగా ఉంచబడిన రాయిపై శీతాకాలపు అయనాంతం సమయంలో ఉదయించే సూర్యుడితో అనుగుణ్యం చేయబడిన, సప్తర్షి మండలం నక్షత్ర సముదాయ ప్రాతినిధ్యం బయటపడింది. ఇటీవలి పరిశోధనలో సప్తర్షి మండలం, సింహ రాశి నక్షత్ర సముదాయాల చిత్రణలతో అలంకరించబడిన ఒక చదునైన శిల వెలుగులోకి వచ్చింది, వాటితోతో పాటు ధ్రువ నక్షత్రం కూడా ఉంది, దీని ప్రకారం వారు మెన్హిర్లు, ఇతర బండరాళ్లను దిశానిర్దేశం చేయడానికి తమ ఖగోళ పరిశీలనలను ఉపయోగించారని స్పష్టమవుతోంది.

ఈ తరహా ఉదంతాలలో, ముదుమల్ ను నిజంగా వేరు చేసేది ఏమిటంటే, మెగాలిథిక్ సైట్, రాతిపై ఖగోళ ప్రాతినిధ్యాల రిపోజిటరీ రెండింటి ప్రత్యేకమైన కలయిక. సప్తర్షి మండలం, సింహ రాశి నక్షత్ర రాశుల స్పష్టమైన వర్ణనలు, కప్–గుర్తులతో గుర్తించబడిన ఊహాజనిత గ్రహ ప్రాతినిధ్యంతో పాటు, రాత్రి ఆకాశాన్ని ప్రతిబింబించే దక్షిణ ఆసియాలో ఏకైక ప్రదేశంగా ముదుమల్‌ను తీర్చిదిద్దాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఉమ్మడి ఖగోళ లక్షణం విభిన్న ప్రాంతాలలో సింబాలిక్ భాషలో ఒక ఉమ్మడి లక్షణాన్ని సూచిస్తుంది, తద్వారా ప్రపంచవ్యాప్తంగా మెగాలిథిక్ పద్ధతుల సందర్భంలో క్రాస్–కల్చరల్ ప్రభావాలు, సంబంధాలపై మన అవగాహనను పెంచుతుంది. ఈ విలక్షణమైన లక్షణం ముదుమల్‌ను ప్రపంచ స్థాయిలో ప్రత్యేకంగా ఉంచుతుంది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర మెగాలిథిక్ సైట్‌లతో పోలిస్తే దాని అత్యుత్తమ సార్వత్రిక విలువను నొక్కి చెబుతుంది.

**ప్రమాణం (v):** ముదుమల్ లోని మెగాలిథిక్ నిర్మాణాలు పురాతన సమాజాలు ఖగోళ దృగ్విషయాలను ఎలా అర్థం చేసుకున్నాయో, అటువంటి జ్ఞానాన్ని తమ సాంస్కృతిక, నావిగేషన్ పద్ధతులలో ఎలా సమగ్రపరిచాయో చెప్పడానికి అద్భుతమైన చిత్రణను అందిస్తాయి. ఈ పురావస్తు ప్రదేశంలో, రెండు నిర్దిష్ట బండరాళ్లు రాత్రి ఆకాశపు స్పష్టమైన ప్రాతినిధ్యాలను ప్రదర్శిస్తాయి, వీటిలో సప్తర్షి మండలం, సింహ నక్షత్రరాశుల చిత్రణలు ఉన్నాయి.

మెరాక్ (పులహ), దుబే (క్రతు) నక్షత్రాలతో విభిన్నంగా ఉన్న సప్తర్షి మండల (ఉర్సా మేజర్) నక్షత్ర సముదాయం, ఈ నక్షత్రాలు ధ్రువ నక్షత్రంతో కలిసి ఉండటం వలన ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ ప్రాంతంలోని పురాతన నివాసితులకు కీలకమైన నావిగేషనల్ రిఫరెన్స్ పాయింట్‌గా ఇవి పనిచేస్తాయి. అంతే కాకుండా, రాత్రి ఆకాశం ప్రాతినిధ్యం బృహస్పతి లేదా అంగారక గ్రహాన్ని సూచిస్తుందని భావిస్తున్న కప్ గుర్తును కలిగి ఉంది. ఇది

రాత్రి ఆకాశం పురాతన ప్రాతినిధ్యంగా మాత్రమే కాకుండా మొత్తం దక్షిణాసియాకు సంబంధించి ఒక గ్రహం యొక్క పురాతన ప్రాతినిధ్యంగా మారుతుంది. ఈ మెగాలిత్‌లు, బండరాళ్లను భూసంబంధమైన నావిగేషనల్ వ్యవస్థ భాగాలుగా ఉపయోగించడం సంప్రదాయ మానవ స్థిరనివాసానికి ఒక ఉదాహరణగా పనిచేస్తుంది. అంతేగాకుండా, పురాతన సమాజాలు, వాటి పర్యావరణ పరిసరాల మధ్య సంక్లిష్టమైన పరస్పర చర్యను నొక్కి చెబుతుంది.



**ప్రమాణం (vi):** ముడుమల్‌లో ఉన్న మెన్హిర్లు ప్రక్కనే ఉన్న గ్రామాలతో విలక్షణమైన సంబంధాన్ని ఏర్పరుస్తాయి. ఇవి సాంస్కృతి కంగా శక్తివంతమైన సందర్భాలకు సమగ్ర భాగాలుగా పనిచేస్తాయి. ఈ మెగాలిత్‌లు ఒక సజీవ సంస్కృతితో సంక్లిష్టంగా ముడిపడి ఉన్నాయి. వీటిలో కొన్నింటిని స్థానిక దేవతలకు ప్రతిరూపాలుగా నమ్ముతారు. మరికొన్నింటిని పురాతన శాపం ఫలితంగా రాళ్లుగా రూపాంతరం చెందిన వ్యక్తులు, జంతువులకు ప్రతిరూపాలుగా భావిస్తారు. వీటిలో ముఖ్యంగా గమనించదగ్గవి రెండు నిర్దిష్ట రాళ్ళు, తిమ్మప్ప, ఎల్లమ్మ దేవత. ఇవి గ్రామస్తుల నుంచి పూజలందు కుంటున్నాయి. వీటిని దేవతులగా విశ్వసిస్తుంటారు. ఈ మెన్హిర్లకు ఆపాదించబడిన పవిత్రత అత్యంత ముఖ్యమైంది. ఎందుకంటే ఈ రాళ్లకు ఏదైనా హాని కలిగించడం తీవ్రమైన, ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుందని స్థానిక సమాజం దృఢంగా నమ్ముతోంది.




అంతేగాకుండా, ఇక్కడ జరిగిన అధ్యయనాలు దక్షిణ కొరియాలోని మెగాలిథిక్ డాల్మెన్‌ల తరహా నక్షత్ర రాశుల నిర్మాణాలను సూచిస్తున్నాయి. ఇవి భారతీయ మెగాలిథిక్ స్మారక చిహ్నాలతో ఉమ్మడి లక్షణాన్ని ప్రదర్శిస్తాయి. ఈ ఉమ్మడి ఖగోళ లక్షణం విభిన్న ప్రాంతాలలో సింబాలిక్ భాషలో ఒక ఉమ్మడి ధోరణిని సూచిస్తుంది, తద్వారా ప్రపంచ వ్యాప్తంగా మెగాలిథిక్ పద్ధతుల సందర్భంలో విభిన్న సంస్కృతుల ప్రభావాలు, సంబంధాలపై మన అవగాహనను పెంచుతుంది.

## ప్రామాణికత

ఈ నిర్మాణం స్వాభావిక ప్రామాణికత దాని భౌగోళిక స్థానం, నిర్మాణ కూర్పు రెండింటిలోనూ స్పష్టంగా కని పిస్తుంది, ఇవి దాని సాంస్కృతిక విలువలను సమిష్టిగా వ్యక్తపరుస్తాయి. మెన్హిర్‌ల విభిన్న రూపం, రూప కల్పనలో దీని విశిష్ట స్థానం ప్రత్యేకంగా గుర్తించదగినది. ఇవి వాటి సహజ పరిసరాలతో సజావుగా అను సంధానించబడి ఉంటాయి. ఇక్కడి భౌగోళిక సమగ్రత మెన్హిర్‌లు, బండరాళ్లు, సమాధి ప్రదేశాల అంత రాయం అమరికకు విస్తరించింది. కాలక్రమంలో సహజంగా రాళ్లు పడిపోయిన సందర్భాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. ఈ కనీస అంతరాయం దాని చారిత్రక సందర్భం మొత్తం సంరక్షణను బలోపేతం చేస్తుంది. సైట్ యొక్క అసలు ఉపయోగం, పనితీరును నిర్వహించడం ద్వారా దాని ప్రామాణికతకు దోహదపడుతుంది.

నిర్మాణ సమగ్రత పరంగా, మెన్హిర్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తే, కొన్ని రాళ్లు పడిపోయిన సందర్భాలలో కూడా, గణనీయమైన స్థాయిలో వాటి సంరక్షణను గుర్తించవచ్చు. మెన్హిర్‌లలో ఎక్కువ భాగం, కింద పడి పడుకున్న స్థితిలో ఉన్న వాటితో సహా, చెక్కు చెదరకుండా ఉంటాయి. ఈ సుస్థిరమైన సంరక్షణ మెగాలిథిక్ నిర్మాణాల స్థితిస్థాపకతను నొక్కి చెబుతుంది, వాటి దృశ్య, నిర్మాణ సమగ్రత నిర్వహణను నిర్ధారిస్తుంది. అంతేగాకుండా, ఈ ప్రామాణికత చారిత్రాత్మకంగా ఈ నిర్మాణాల చుట్టూ ఉన్న సంప్రదాయాలు, పద్ధతులు, నిర్వహణ వ్యవస్థల ద్వారా సుసంపన్నం చేయబడింది. ఈ లక్షణాలు కలిసి, వాటి సహజ వాతావరణంలో ఈ పురాతన నిర్మాణాలతో అనుబంధించబడిన శాశ్వత స్ఫూర్తి, భావనకు విలువైన నిదర్శనంగా పనిచేస్తాయి, సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా వాటి ప్రాముఖ్యతను ప్రముఖంగా చాటిచెబుతాయి.

ముడుమల్ మెగాలిథిక్ సైట్‌ను నిర్వచించే శాశ్వత లక్షణాలు, వివిధ అంశాలు కొనసాగుతూ వచ్చిన కాల ప్రవాహంలో వాటి

నిర్మాణ సమగ్రతను, ప్రాదేశిక పొందికను కొనసాగించాయి. ఈ శాశ్వత లక్షణాలలో సైట్ అంతటా వ్యూహాత్మకంగా ఉంచబడిన ప్రముఖ మెన్‌హిర్లు, బండరాళ్లు ఉన్నాయి. వీటిలో కొన్ని రాత్రి ఆకాశం చిత్రణలను కలిగి ఉన్నాయి. రాతి సమాధులూ ఉన్నాయి. ఈ మెగాలిథిక్ నిర్మాణాల సుస్థిర సమగ్రత ముఖ్యంగా ముడుమల్, మురహరిదొడ్డిలో నివసించే స్థానిక సమాజాల కర్తవ్యనిష్ఠ వైఖరుల ద్వారా ప్రభావితమవుతుంది. విశేషమేమిటంటే, ఈ సమాజాలు మెన్హిర్‌లతో ఏదైనా భౌతిక జోక్యం గణనీయమైన పరిణామాలను కలిగిస్తుందనే నమ్మకానికి బాగా కట్టుబడి ఉంటాయి. ఇది సైట్ వాస్తవ స్థితి, పవిత్రతను కాపాడటానికి స్థానిక నిబద్ధతను ప్రముఖంగా చాటిచెబుతుంది.

ముడుమల్, మురహరిదొడ్డి నివాసుల అప్రమత్తమైన సంరక్షణలో ఉన్న మెన్హిర్లు, బండరాళ్లు పురాతన సాంస్కృతిక ఆచారాలు, నమ్మకాలకు సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. మెగాలిత్‌లకు హాని కలిగించడంతో సంబంధం ఉన్న తీవ్రమైన పరిణామాలను నొక్కి చెప్పే ప్రబల అవగాహన, ఈ సైట్ మొత్తం సమగ్రతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. మనస్సాక్షికి సంబంధించిన ఈ విధానం ముడుమల్ మెగాలిథిక్ సైట్ భౌతిక లక్షణాలను కాపాడటానికి దోహదపడటమే కాకుండా, పురావస్తు పరిరక్షణ ప్రయత్నాల సందర్భంలో స్థానిక నమ్మకాలు, ఆచారాల ప్రాముఖ్యతను కూడా నొక్కి చెబుతుంది.

### ఇతర నిర్మాణాల సారూప్య లక్షణాలతో పోలిక

మెగాలిథిక్ ప్రదేశాల పురావస్తు అధ్యయనాలు నిరంతరం అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రంగంలో, కచ్చితమైన పోలికల ద్వారా సమగ్ర దృక్పథాలను పొందడం చాలా అవసరం. ఈ తులనాత్మక విశ్లేషణ మెగాలిథిక్ ప్రదేశాల ప్రపంచపటంలో ముడుమల్‌ను సందర్భోచితంగా పరిగణించడమే కాకుండా, దాని ప్రత్యేక లక్షణాలను కూడా చాటిచెబుతుంది, పురావస్తు రంగం లోని దాని ప్రతిరూపాల నుండి దానిని వేరు చేస్తుంది.


### భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో:

భారతదేశంలోని కర్ణాటకలోని హైర్ బెనెకల్లు (సుమారుగా సాధారణ శక పూర్వం 800–200) మెన్హిర్లు, డోల్మెన్‌లు, గుహ చిత్రాల విస్తృత స్థాయి కలెక్షన్ కు ప్రసిద్ధి చెందింది. (ఇది 2021లో యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించింది.) దీనికి విరుద్ధంగా, ముడుమల్ విభిన్న అమరికలలో అమర్చబడిన మెన్హిర్లు, బండరాళ్ల శ్రేణిని కలిగి ఉంది.

భారతదేశంలోని తమిళనాడులోని నీలగిరి డోల్మెన్స్ (సుమారుగా సాధారణ శక పూర్వం 1000–400), డోల్మెన్లు, రాతి వృత్తాలు, సిస్ట్‌లు, రాతిపై రాతలను కలిగి ఉంది. ఇక, ముడుమల్ రాతి వృత్తాలు మెగాలిథిక్ ఖననాల ఉనికిని సూచిస్తాయి.

భారతదేశంలోని కర్ణాటకలోని విభూతిహళ్లి (సుమారుగా సాధారణ శక పూర్వం 1800–1400), సౌర అమరికలను ప్రదర్శిస్తూ, అవెన్యూలలో అమర్చబడిన పెద్ద దీర్ఘచతురస్రాకార బండరాళ్ల క్షేత్రంతో ఉంటుంది. దీనితో పోలిస్తే, ముడుమల్ మెన్హిర్, బండరాయి అమరికలు అయనాంతంతో పరస్పర సంబంధం కలిగి ఉన్న సారూప్య అమరికలను ప్రదర్శిస్తాయి, ఇది కొనసాగుతున్న పరిశోధనలకు అర్హత కలిగింది.

### అంతర్జాతీయ ప్రదేశాలు:





లావోస్‌లోని జార్స్ మైదానం (సుమారుగా సాధారణ శక పూర్వం 500 BCE– సాధారణ శకం 500) మెగాలిథిక్ సమాధులు, పెద్ద రాతి జాడిలకు ప్రసిద్ధి చెందింది, ఇవి స్థానిక ఇతిహాసాలతో ముడిపడి ఉన్నాయి. వీటితో పోలిస్తే, మెన్హిర్‌లకు సంబంధించిన స్థానిక కథలతో ముడిపడి ఉన్న ముడుమల్ సమాధులు నేపథ్య సారూప్యతలను పంచుకుంటాయి.

ఐర్లాండ్‌లోని ఆగ్లిష్ (సుమారుగా సాధారణ శక పూర్వం 1900–900) బహుళ రాతి వృత్తాలు, సమాధి దిబ్బలను కలిగి ఉంది. వాటి సంభావ్య ఖగోళ ప్రాముఖ్యతపై పరిశోధన కొనసాగుతోంది. అదేవిధంగా, ముడుమల్ తవ్వకాల కోసం వేచి ఉన్న రాతి వృత్తాలు, సమాధులను ప్రదర్శిస్తుంది.

ఇంగ్లాండ్‌లోని స్టోన్‌హెంజ్, అవెబరీ–అసోసియేటెడ్ సైట్‌లు (ప్రపంచ వారసత్వ ప్రదేశం) వృత్తాకారంలో అమర్చబడిన మెగాలిత్‌లతో కూడిన విలక్షణమైన పురావస్తు నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. స్టోన్‌హెంజ్‌లో స్పష్టంగా కనిపించే కచ్చితత్వం, ఇంజనీరింగ్ చాతుర్యం, జాగ్రత్తగా రూపొందించిన జాయింట్స్, 40 టన్నుల కంటే ఎక్కువ బరువున్న రాళ్లు, దాని నిర్మాణ ప్రయత్నాలను ప్రముఖంగా చాటిచెబుతాయి. వేసవి

అయనాంతంతో దాని అమరిక పలువురు పరిశోధకులు పురాతన క్యాలెండర్ లేదా అబ్జర్వేటరీగా దాని పనితీరు గురించి ఊహాగానాలు చేయడానికి దారితీసింది, ఇది దీని చారిత్రక సంక్లిష్టతను పెంచుతుంది. ముడుమల్ మెన్హిర్‌ల పరిశోధనలు ఖగోళ సంఘటనలను వాటి ధోరణిలో వెల్లడిస్తాయి. స్టోన్‌హెంజ్ మాదిరిగానే, ముడుమల్ మెన్హిర్‌లు ఉద్దేశపూర్వకంగా అయనాంతం సమయంలో ఉదయించే, అస్తమించే సూర్యుడితో అనుగుణ్యం చేయబడ్డాయి, పురాతన సంస్కృతులలో ఖగోళ దృగ్విషయాల అధునాతన అవగాహనను సూచిస్తున్నాయి. ఈ తులనాత్మక విశ్లేషణ




చరిత్రపూర్వ నాగరికతల గురించి మన అవగాహనను సుసంపన్నం చేస్తుంది. వాటి అధునాతన ఖగోళ జ్ఞానాన్ని, ఇలాంటి నిర్మాణాల అమరికలో నింపబడిన సాంస్కృతిక ప్రాముఖ్యతను చాటిచెబుతుంది.

ఇక ఇండోనేషియాలోని గునుంగ్ పడాంగ్ మెగాలిథిక్ సైట్ విషయానికి వస్తే, ఇది చల్లారిపోయిన అగ్నిపర్వతం వాలుపై ఉంది. ఇది ఐదు విభిన్న టెర్రస్‌లను ఏర్పరుస్తుంది. ఈ ప్రదేశం భారీ షడ్భుజాకార రాతి స్తంభాలతో అలంకరించబడిన రాతి రిటైనింగ్ గోడల ద్వారా నిర్వచించబడింది. స్థానిక సుండానీస్ సమాజం గునుంగ్ పడాంగ్‌ను సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ముఖ్యమైనదిగా భావిస్తుంది. స్థానిక పురాణాలు దాని మూలాన్ని రాజు సిలివాంగి రాత్రిపూట ఒక రాజభవనాన్ని నిర్మించాలనే ప్రయత్నానికి ఆపాదించాయి. గునుంగ్ పడాంగ్ మాదిరిగానే, ముడుమల్‌లోని మెన్హిర్లు సజీవ సాంస్కృతిక వాతావరణంలో అంతర్భాగంగా ఉన్నాయి. వీటిలో కొన్ని స్థానిక దేవతలకు నిలయంగా ఉంటాయని నమ్ముతారు. ఇవి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలను ఆకర్షించే ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తాయి. నమ్మకాలు, ఆచారాల కలయిక పురాతన ప్రదేశాలు, సమకాలీన కథనాల మధ్య శాశ్వత సంబంధాన్ని వివరిస్తుంది. మెగాలిథిక్ ప్రదేశాలు, వాటిపై భక్తిగల సమాజాల మధ్య సంబంధం గురించి మన అవగాహనను సుసంపన్నం చేస్తుంది.

దక్షిణ కొరియాలోని గోచాంగ్, హ్వాసున్, గంగ్వా డోల్మెన్ ప్రదేశాలు (ప్రపంచ వారసత్వ ప్రదేశం) సుమారు సాధారణ శక పూర్వం 1000 సంవత్సరాల నాటి అనేక డోల్మెన్‌లను కలిగి ఉన్నాయి. ఇవి సమాధి గుర్తులుగా, స్థానిక ఆచారాలకు పవిత్ర స్థలాలుగా ఉన్నాయి. ఈ ప్రదేశాలు ఆ యుగం యొక్క సామాజిక అంశాలు, విధానాల గురించి అమూల్యమైన దృక్పథాలను అందిస్తాయి. ముఖ్యంగా, గంగ్వా డోల్మెన్‌లు ఖగోళ నక్షత్రరాశులను సూచించే కప్ గుర్తులను కలిగి ఉన్నాయి. పురాతన ప్రజలు రాత్రి ఆకాశంపై కలిగి ఉన్న అవగాహనను వెల్లడిస్తాయి. ముడుమల్ సైట్ లో, బండ రాళ్ళు రెండు నక్షత్రరాశులను వర్ణించే సంక్లిష్టమైన కప్ గుర్తులను కలిగి ఉంటాయి. గంగ్వా డోల్మెన్‌లలో కనిపించే ఖగోళ ప్రతీకవాదంతో ఇవి పోలిక కలిగి ఉంటాయి. ముఖ్యంగా, సప్తర్షి మండలం (ఉర్సా మేజర్)లోని డ్యూబ్, మెరాక్‌లను సూచించే కప్ గుర్తులు, ఎల్లప్పుడూ ధ్రువ నక్షత్రంతో సమలేఖనం చేయబడతాయి. ముడుమల్ వద్ద కూడా ఇదేవిధంగా ఉత్తరానికి సమలేఖనం చేయబడిన కప్ గుర్తులు ఉన్నాయి. ఈ వర్ణనలు ఉర్సా మేజర్‌తో సమలేఖనం చేయబడతాయి, ధ్రువ నక్షత్రంతో అనుసంధానించబడతాయి. ఈ రెండూ భౌగోళిక ప్రదేశాలలో భాగస్వామ్య సంకేత పద్ధతులను నొక్కి చెబుతాయి. గంగ్వా, ముడుమల్ వద్ద కప్ గుర్తుల కలయిక పురాతన నాగరికతల ఖగోళ జ్ఞానం, సాంస్కృతిక మార్పిడిపై మన అవగాహనను పెంచుతుంది.

పోర్చుగల్‌లోని అల్మెండ్రెస్ క్రోమ్లెచ్, ముడుమల్ రెండూ మానవ జాతికి సంబంధించిన ముఖ్యమైన పురావస్తు ప్రదేశాలు. వేటికవే తమ విలక్షణమైన లక్షణాలను ప్రదర్శిస్తూనే ఆసక్తికరమైన సారూప్యతలను పంచుకుంటాయి. సుమారు 100 గ్రానైట్ మెన్హిర్‌లను దీర్ఘవృత్తాకారంగా అమర్చిన అల్మెండ్రెస్ క్రోమ్లెచ్‌లో కప్ గుర్తులతో ఉన్న ఒంటరి మెన్హిర్ ఉంటుంది. మరి కొన్ని మెన్హిర్లు విషువత్తులు (పగలు, రాత్రి సమానంగా ఉండే రోజులు), అయనాంతాల సమయంలో సూర్యుడితో సమలేఖనం అవుతాయి. ఇది ఉద్దేశపూర్వకంగా రూపొందించిన ఖగోళ సంబంధాన్ని సూచిస్తుంది. దీనికి పోలిస్తే ముడుమల్ 80 కంటే ఎక్కువ మెన్హిర్‌లను కలిగి ఉంటుంది. కొన్ని అయనాంతాల సమయంలో సూర్యుడితో సమలేఖనం అవుతాయి. కొన్ని ప్రత్యేక రాళ్ళు కప్ గుర్తులను ప్రదర్శిస్తాయి. ఇది సైట్ ఆకర్షణను పెంచుతుంది. ముఖ్యంగా, రెండు మెన్హిర్లు రాత్రి ఆకాశాన్ని వర్ణిస్తాయి. పురాతన ఆకాశ పరిశీలనలు, ఈ మెగాలిథిక్ నిర్మాణం మధ్య సంబంధాన్ని సూచిస్తాయి. ఈ రెండు సైట్స్ కూడా వాటి అమరికల ద్వారా పురాతన ఖగోళ అవగాహన, సాంస్కృతిక ప్రాముఖ్యత భావాన్ని రేకెత్తిస్తాయి. ఖగోళ సంఘటనలను గుర్తు చేసేలా రాళ్లను ఉద్దేశపూర్వకంగా ఉంచడం ఈ నాగరికతల అధునాతన జ్ఞానం, ఉద్దేశపూర్వక రూపకల్పనను ప్రదర్శిస్తుంది. సింబాలిక్


# స్టోన్‌హెంజ్ సరసన మన ముడుమాల్!

## ప్రపంచ వారసత్వ సంపదలో చోటు దక్కే అవకాశం

### యునెస్కోగుర్తింపు ప్రక్రియలో సానుకూల పరిణామాలు.. ఇటీవలే తాత్కాలిక జాబితాలో చోటు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, తెలంగాణ ప్రభుత్వం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో 2023లో ఒప్పందం కుదుర్చుకుంది. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) సంస్థ ఛైర్మన్ వేదకుమార్ ఆధ్వర్యంలో 2021లో పరిరక్షణ మరియు అధ్యయనం ప్రారంభించింది. గతంలో ముడుమాల్ ప్రత్యేకతలపై పరిశోధించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావు మరియు యునెస్కో నిపుణులు సూర్య నారాయణ మూర్తి, ప్రొఫెసర్ రుక్మిణీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆస్ట్రానమి, ఉస్మానియా యూనివర్సిటీ, రిటైర్డ్ డైరెక్టర్ జియాలజికల్ సర్వేఫ్ ఇండియా, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్ డైరెక్టర్, మరియు హెరిటేజ్ నిపుణులను కలుపుకొని DHAT పరిశోధిస్తోంది.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, DHAT పరిశోధించిన వివరాలను వరల్డ్ హెరిటేజ్ సెక్షన్ (WHS), ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI), మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వీటిని యునెస్కోకు సమర్పించింది. ముడుమాల్‌తోపాటు వేర్వేరు రాష్ట్రాల్లోని మరో ఐదు ఇతర ప్రాంతాలను కూడా చేర్చింది. వెరసి ఆరు ప్రాంతాలకూ యునెస్కో తాత్కాలిక జాబితాలో మార్చి 2025లో చోటు కల్పించింది. ఇప్పుడు పూర్తిస్థాయి గుర్తింపు కోసం పరిరక్షణ మరియు పునరుద్దరణపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ శాఖ మరియు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ దృష్టి సారించాయి.



అలంకరణలు, కప్ గుర్తులు ఈ పురావస్తు అద్భుతాల గొప్ప సాంస్కృతిక, ఆచార అంశాలను మరింతగా చాటిచెబుతాయి. ఈ రెండు సైట్స్ అయనాంతం సమయంలో సూర్యునితో అనుగుణ్యంగా ఉన్నప్పటికీ, ముడుమల్ వద్ద రాత్రి ఆకాశం వర్ణన నాటి ప్రజల కథనాలకు ఒక ప్రత్యేకమైన కోణాన్ని పరిచయం చేస్తుంది. వాటి సృష్టికర్తల ప్రేరణలు, నమ్మకాలను మరింత అన్వేషించడానికి ఆహ్వానిస్తుంది.

**తులనాత్మక విశ్లేషణ ఫలితం:**

తులనాత్మక విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెగాలిథిక్ సైట్‌ల అద్భుత వైవిధ్యాన్ని నొక్కి చెబుతుంది. ఈ సైట్స్ లో ప్రతి ఒక్కటి కూడా దానికదేగా ప్రత్యేక లక్షణాల ద్వారా నిర్వచించబడింది. ముడుమల్ ఇతర ప్రఖ్యాత సైట్‌లతో దాని సారూప్యతలకు మాత్రమే కాకుండా దాని విలక్షణ లక్షణాలకు కూడా ప్రత్యేకంగా నిలుస్తుంది. దాని మెన్హిర్‌ల ఖచ్చితమైన అమరిక గణితం, ఖగోళశాస్త్రంపై ఉన్న అపారమైన పట్టును ప్రతిబింబిస్తుంది. దీనిని అరుదైన ఆర్కియో-ఆస్ట్రనామికల్ సైట్ గా నిలబెడుతుంది. అంతేగాకుండా, మెన్హిర్‌ల చుట్టూ కొనసాగుతున్న సాంస్కృతిక పద్ధతులు స్థానిక ప్రజల జీవన సంప్రదాయాలను చాటిచెబుతాయి. సైట్ గురించిన కథనాన్ని సుసంపన్నం చేస్తాయి. పురావస్తు, ఖగోళ అంశాల కలయిక చరిత్రపూర్వ సమాజాల గురించి మన అవగాహనకు, ఖగోళ దృగ్విషయాలతో వాటి సంక్లిష్ట సంబంధానికి గణనీయంగా దోహదపడే ముడుమల్ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది. పరిశోధన, పురావస్తు ప్రయత్నాలు మరింతగా కొనసాగితే, మెగాలిథిక్ సంస్కృతుల విస్తృత చట్రంలో ముడుమల్ ప్రాముఖ్యత పెరుగుతుంది, ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడానికి దాని అభ్యర్థిత్వాన్ని పెంచుతుంది.

– ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా,
వరల్డ్ హెరిటేజ్ సెక్షన్ (WHS)
అనువాదం: వంశీమోహన్ నర్ల
m : 98489 02520
e:vamsiglobal@gmail.com

# పట్టణీకరణ

పట్టణ రహదారుల అంచులను పచ్చదనం చేయడం వల్ల ఉష్ణమండల నగరాల్లో సీతాకోకచిలుకల వైవిధ్యం పెరుగుతుంది.

సింగపూర్ ఆధారిత అధ్యయనం ప్రకారం, రోడ్డు పక్కన ఉన్న పచ్చదనం యొక్క ఇరుకైన స్ట్రిప్‌లు పరాగసంపర్క వైవిధ్యాన్ని పెంచడానికి ప్రభావవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన మార్గం.

మన నగరాలను తిరిగి అడవిలోకి తీసుకురావడానికి రోడ్ల అంచులు కీలకం కావచ్చు. సింగపూర్ నుండి వచ్చిన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, ఈ విస్మరించబడిన పచ్చదనం సీతాకోకచిలుకల జనాభాను పెంచుతుంది. కాంక్రీటు-బరువైన పట్టణ అడవులలో కూడా.

ప్రకృతి దృశ్యం, పట్టణ ప్రణాళిక, రోడ్డు అంచులలోని పూల వైవిధ్యం, నిర్మాణ సంక్లిష్టత సీతాకోకచిలుక జాతుల సమృద్ధి, గొప్పతనాన్ని పెంచాయని వెల్లడించింది. సింగపూర్ అంతటా 101 రోడ్డు అంచులను పరిశోధకులు అంచనా వేశారు. ఇది జనసాంద్రత కలిగిన నగర-రాష్ట్రం. ఇది తనను తాను "ప్రకృతిలో నగరం"గా ముద్ర వేసుకుంది.



1,320 తేనె తినే కార్యక్రమాలలో 56 సీతాకోకచిలుక జాతులను పరిశీలించిన ఈ అధ్యయనం, నగర ప్రణాళికదారులు సాంప్రదాయ ఉద్యానవనాలకు మించి చూడాలని, రోడ్డు అంచుల వంటి సరళ ఆకుపచ్చ మౌలిక సదుపాయాలు విచ్ఛిన్నమైన పట్టణ ఆవాసాలను ఎలా మిళితం చేయగలవో పరిశీలించాలని కోరుతూ పెరుగుతున్న పరిశోధనా విభాగానికి తోడ్పడుతుంది.

నిర్మాణాత్మక సమీకరణ నమూనాను ఉపయోగించి, తేనె లభ్యత, అంచు పరిమాణం, ట్రాఫిక్ సాంద్రత, చుట్టుపక్కల పచ్చదనం వంటి అంశాలు సీతాకోకచిలుక వైవిధ్యాన్ని ఎలా ప్రభావితం చేశాయో పరిశోధకులు పరిశీలించారు. తేనె-పుష్ప వైవిధ్యం బలమైన ప్రత్యక్ష సానుకూల ప్రభావాన్ని కలిగి ఉందని వారు కనుగొన్నారు. వివిధ రకాల పుష్పించే జాతులు - ఎక్కువగా స్థానికేతర - నాటిన రోడ్డు అంచులు ఎక్కువ సంఖ్యలో సీతాకోకచిలుకలను ఆకర్షించాయి, అయితే మొక్కలు ఈ ప్రాంతానికి చెందినవి కావు.

ఆసక్తికరంగా, పెద్ద అంచు పరిమాణం, ఎక్కువ మొక్కల సమృద్ధి నేరుగా సీతాకోకచిలుకల సంఖ్య పెరుగుదలకు దారితీయకపోయినా, అవి తేనె లభ్యతను మెరుగుపరచడం, నిర్మాణ సంక్లిష్టతను పెంచడం ద్వారా పరోక్షంగా సీతాకోకచిలుకల జనాభాకు మద్దతు ఇచ్చాయి. ఈ సంక్లిష్టత.. ముఖ్యంగా వృక్షసంపద ఎత్తులో వైవిధ్యం. మరింత అనుకూలమైన మైక్రోక్లైమేట్‌లను సృష్టించింది. అవాంతరాల నుండి రక్షణను అందించింది.

దీనికి విరుద్ధంగా అధిక ట్రాఫిక్ సాంద్రత కలిగిన రోడ్లు సీతాకోకచిలుకల వైవిధ్యంపై ప్రత్యక్ష ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. వాహనాల నుండి వచ్చే కాలుష్యం, వాటిని ఢీకొనడం, అల్లకల్లోలం సీతాకోకచిలుకల కార్యకలాపాలకు, తినే ప్రవర్తనకు అంతరాయం కలిగించినట్లు కనిపించాయి. అయినప్పటికీ, రోడ్డు అంచులు పెద్ద పచ్చని ప్రదేశాలతో చుట్టుముట్టబడిన చోట, ముఖ్యంగా విశాలమైన ప్రకృతి దృశ్యాల ప్రమాణాల వద్ద (500-1000 మీటర్లు), చిన్న, తక్షణ స్థానిక మండలాలలో కాకుండా సీతాకోకచిలుకలు మెరుగ్గా పనిచేశాయి.

"రోడ్డు అంచుల వంటి చిన్న తరహా పచ్చని ప్రదేశాలను తరచుగా పట్టించుకోని సాంప్రదాయ పట్టణ ప్రణాళిక ప్రాధాన్యతలను ఈ పరిశోధనలు సవాలు చేస్తున్నాయి.'' జీవవైవిధ్యానికి సాధారణంగా ఉపయోగించే ఫ్లాగ్‌షిప్ టాక్సన్ అయిన సీతాకోకచిలుకలకు ప్రయోజనం చేకూర్చడానికి రోడ్ అంచులను మెరుగుపరచడానికి మా ఫలితాలు అవకాశాలను హైలైట్ చేస్తాయి" అని రచయితలు సమర్పించిన జర్నల్ పత్రంలో రాశారు.

పట్టణ జీవవైవిధ్యాన్ని పెంచడానికి ఎంపిక చేసిన కోత, పుష్పించే జాతుల మిశ్రమాన్ని నాటడం, వృక్షసంపదలో నిర్మాణాత్మక వైవిధ్యాన్ని నిర్వహించడం తక్కువ ఖర్చుతో కూడిన మార్గాలు అని వారు సూచించారు.

సింగపూర్ తన భూభాగంలో 50 శాతం ప్రాంతాన్ని వృక్షసంపదతో నింపి, "పార్క్ కనెక్టర్లు", "నేచర్ వేస్"తో అనుసంధానించడం ద్వారా జీవవైవిధ్య నష్టంతో పోరాడుతున్న ఇతర నగరాలకు ఒక సంభావ్య నమూనాను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పట్టణ విస్తరణ వేగవంతం అవుతున్నందున, పర్యావరణ వ్యవస్థలను పనితీరును కొనసాగించే కీటకాలకు చిన్న చిన్న పచ్చదనం కూడా పెద్ద తేడాను కలిగిస్తుందని ఈ అధ్యయనం సకాలంలో ఆధారాలను అందిస్తుంది.

-నందితా బెనర్జీ
*(డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్)*
అనువాదం: ఎసికె. శ్రీహరి


# సింధు జలాల ఒప్పందం నెహ్రూ చారిత్రక తప్పిదమా?

సింధు జలాల ఒప్పందం జరిగి ఇప్పటికీ 65 సంవత్సరాలు గడచినాయి. ఆనాటికి ఈనాటికి వాతావరణంలో, సింధు నదీ వ్యవస్థలోవర్షపాతం, హిమపాతం, నీటి లభ్యత, నీటి వినియోగం, హిమాలయ పర్యావరణంలో, భూవినియోగంలో, ఇతర సంబంధిత అంశాలలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఒప్పందంలో భాగస్వాములుగా ఉన్న రెండు దేశాలలో కూడా రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో కూడా మార్పులు, ఊహించని పరిణామాలు సంభవించాయి. 1965, 1971, 1999లో పాకిస్తాన్‌తో మూడు యుద్ధాలు జరిగినా సింధు నది జలాల ఒప్పందం రద్దు కాలేదు. ఆ దిశగా చర్చ కూడా జరగలేదు. ఆ తర్వాత పాకిస్తాన్ భూభాగం నుంచి ఇస్లామిక్ ఉగ్రవాద కార్యకలాపాలు, దాడులు తీవ్రం అయినాయి. పాకిస్తాన్లో తిష్ట వేసి కూచున్న ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలచే ముంబాయి, పఠాన్ కోట్, పార్లమెంట్, ఉరి, పుల్వామా తదితరదాడులు జరిగినాయి. దాడుల నేపథ్యంలో, పైన పేర్కొన్న ప్రాకృతిక మార్పుల నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది. 2025 ఏప్రిల్ 22న పహల్గాంలో మత ప్రాతిపదికన జరిగిన దాడుల తర్వాత అది అనివార్యమయ్యింది. ఈ వ్యాసంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం పక్కన బెట్టడంలో ఔచిత్యాన్ని, మంచి చెడ్డలను చర్చించడం లేదు. ఒప్పందం చేసుకొని సింధు జలాలను నెహ్రూ 80 శాతం నీటిని శత్రు దేశానికి ధారాదత్తం చేసినాడన్న ఆరోపణలో నిజనిజాలను చర్చించడానికి, ఒప్పందాన్ని పక్కన బెట్టడం వలన తక్షణ ప్రభావాలు ఎట్లాఉండబోతున్నాయి అన్న అంశాలకు మాత్రమే పరిమితం అయ్యాను.

**భారతదేశ జల వనరులు :**

సింధు జలాల ఒప్పందంలోకి వెళ్ళే ముందు భారత దేశ జలవనరుల గురించి స్థూలంగా తెలుసుకుందాము. భారతదేశంలో మొత్తం 22 నదీ బేసిన్లు ఉన్నాయి.వీటిల్లోలభ్యమయ్యే 75 శాతం విశ్వసనీయత కలిగిన నికర జలాలు సుమారు 2000 BCM (బిలియన్ క్యూబిక్ మీటర్లు)లు (సుమారు 70,000 టిఎంసిలు). ఒక BCM సుమారు 35 టిఎంసిలకు సమానం. ఈ 22 నదీ బేసిన్లలో హిమాలయ నదీ బేసిన్ లైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర అత్యంత ముఖ్యమైనవి. ఇక పీఠభూమి నదులలో గోదావరి, కృష్ణ, కావేరి పెద్దవి. దేశంలో గంగా బేసిన్ 25.9 శాతం, సింధూ బేసిన్ 9.8 శాతం, బ్రహ్మపుత్ర బేసిన్ 6 శాతం, గోదావరి 9.7 శాతం, కృష్ణా 8 శాతం, కావేరీ 2.6 శాతం పరివాహక ప్రాంతాలు కలిగి ఉన్నాయని కేంద్ర జల సంఘం లెక్క గట్టింది. ఈ బేసిన్లలో లభ్యమయ్యే నికర జలాలు ఈ విధంగా ఉన్నాయి.

- భారత్‌లో 8,38,803 చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన గంగా బేసిన్లోలభ్యమయ్యే నికర జలాలు (75% విశ్వసనీయత) 509.52 BCMలు (17,994 టిఎంసిలు)




- భారత్‌లో 1,93,252 చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన బ్రహ్మపుత్ర బేసిన్లో లభ్యమయ్యే నికర జలాలు (75% విశ్వసనీయత) 527.28 BCMలు (18,629 టిఎంసిలు)
- భారత్‌లో 3,17,708చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన సింధు బేసిన్లో లభ్యమయ్యే నికర జలాలు (75% విశ్వసనీయత 45,53 BCM లు (1,608టిఎంసిలు)
- 3,12,150చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన

గోదావరి బేసిన్లో లభ్యమయ్యే నికర జలాలు (75% విశ్వసనీయత) 117.74 BCM లు (4,158 టిఎంసిలు)

- 2,59,439చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన కృష్ణా బేసిన్లో లభ్యమయ్యే నికర జలాలు (75% విశ్వసనీయత) 89.04 BCM లు (3,144 టిఎంసిలు)

*(సోర్స్: కేంద్ర జల సంఘం నవంబర్ 2018లో జారీ చేసిన అధ్యయన నివేదిక)*

**సింధు నదీ వ్యవస్థ :**

సింధు నది టిబెట్ పీఠభూమిలో ఉద్భవించి పశ్చిమ దిశలో ప్రవహించి ఆ తర్వాత దక్షిణ దిశకు మళ్ళి భారత్, పాకిస్తాన్ దేశాల మీదుగా 3,180 కిలోమీటర్లు ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రయాణంలో 5 పెద్ద ఉప నదులు .. చీనాబ్, జీలం, రావి, బియాస్, సట్లెజ్ నదులు సింధు నదిలో కలుస్తాయి. సింధు జలాల ఒప్పందం సింధు నది సహా మొదటి రెండు ఉప నదులను పశ్చిమ నదులుగా, తతిమా మూడు ఉప నదులను తూర్పు నదులుగా పేర్కొన్నది. సింధు నదీ వ్యవస్థలో మొత్తం ఆరు నదులు ఉన్నాయన్న మాట.



*జి. మునిరుద్దీన్, డబ్ల్యూ.ఎ.బి. ఇలీఫ్, నిరంజన్ దాస్ గులాటి*

మొత్తం 11.65 లక్షల చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం కలిగిన సింధు నదీ వ్యవస్థలో 60 శాతం పాకిస్తాన్లో (పాకిస్థాన్ అధీనంలో ఉన్న జమ్ము కాశ్మీర్ భూభాగం సహా), 22 శాతం భారత్లో పరీవాహక ప్రాంతం విస్తరించి ఉంది. మిగతాది టిబెట్లో (10 శాతం), ఆఫ్ఘనిస్తాన్లో (7 శాతం) ఉన్నది.

**దేశ విభజనకు పూర్వమే సింధ్ రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థల నిర్మాణం :**

సింధ్ ప్రాంతంలో సాగునీటి వ్యవస్థలు.. సుక్కూర్ బ్యారేజి సహా బ్రిటిష్ కాలంలోనే నిర్మాణం అయినాయి. గోదావరి జలాలు మైదాన ప్రాంతమైన ఆంధ్రాలోనే మొదట వినియోగంలోకి వచ్చినట్టు అచ్చం అట్లనే సింధు జలాల వినియోగం కూడా మైదాన ప్రాంతమైన అవిభక్త సింధ్, పంజాబ్ ప్రాంతంలో మొదట జరిగింది. సుక్కూర్ బ్యారేజి నిర్మాణానికి సాంకేతిక సలహాలు ఇచ్చిన వాళ్లలో మోక్షగుండం విశ్వేశ్వరాయతో పాటు మన హైదరాబాద్ రాష్ట్ర ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ కూడా ఒకరు. వీరిద్దరూ కలిసి హైదరాబాద్ నగరంలో మూసి వరద నియంత్రణ కోసం పథకాలు రూపొందించిన సంగతి మనందరికీ ఎరుకే. ఈ సంగతి ఎం వి తన ఆత్మకథ 'Memoirs of my Working Life'లో రాసినాడు.

ఒప్పందానికి పూర్వమే సింధు నదిపై పాకిస్తాన్లో 6 బ్యారేజిలు ఉనికిలో ఉన్నట్టు తెలుస్తున్నది. అవి గుడ్డు బ్యారేజి, సుక్కూర్ బ్యారేజి, కోటరీ బ్యారేజి, టౌన్సా బ్యారేజి, చష్మా బ్యారేజి, జిన్నా బ్యారేజి. అట్లాగే సింధు నదిపై 143 మీటర్ల ఎత్తైన 420 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన టర్బెల డ్యాం కూడా నిర్మాణం అయ్యింది. టర్బెల డ్యాంకు అనుబంధంగా 4800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రం నిర్మాణం అయ్యింది.

అట్లే భారత్ లో సింధు నదిపై నిముబాజ్గో డ్యాం చీనాబ్ నదిపై బాలీఘర్ డ్యాం, దుల్హస్తి డ్యాం, సలాల్ డ్యాం రావి నదిపై బస్రి డ్యాం, చమేరా డ్యాం, రంజిత్ సాగర్ డ్యాం బియాస్ నదిపై లార్జి డ్యాం, పండో డ్యాం, పోంగ్ డ్యాం జీలం నదిపై ఉరి డ్యాం సట్లెజ్ నదిపై భాక్రానంగల్డ్యాం మొదలైనవి నిర్మాణం అయినాయి. ఇవి గాక వీటి ఉపనదులపై కూడా అనేక చిన్నచిన్న జల విద్యుత్ కేంద్రాలు నిర్మాణం అయినాయి. వీటి కాలువల ద్వారా సాగునీరు కూడా సరఫరా అవుతుంది. భారత్ లో భాక్రానంగల్, రంజిత్ సాగర్ లాంటి బాహుళ ప్రయోజనాలు కలిగిన పెద్ద డ్యాంలు సింధు నది వ్యవస్థలో ఎక్కువగా లేవు.

**సింధు జలాల ఒప్పందంలో ముఖ్యాంశాలు :**

ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ నదులలో లభ్యమయ్యే టిని సంపూర్ణంగా భారత్ వినియోగించుకోవచ్చు. అయితే పాకిస్తాన్ భూభాగంలో ప్రవేశించిన తర్వాత ఈ నదుల నీటిని పాకిస్తాన్ కూడా వినియోగించుకోవచ్చు. పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలను పాకిస్తాన్ సంపూర్ణంగా వాడుకోవచ్చు. భారత భూభాగంలో పశ్చిమ నదులపై భారత్ జల విద్యుత్ ప్రాజెక్టులు కట్టి విద్యుత్ ఉత్పత్తి తర్వాత నీటిని నదిలోకి వదిలి పెట్టాలి.ఇరు దేశాలు నది జలాల వినియోగం తదితర సమస్త సమాచారాన్ని ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవాలి. ఈ ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి శాశ్వత ప్రాతిపదికన 'ఇండస్ కమిషన్' ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్లో ఇరుదేశాలు తమ తరపున ఒక కమిషనర్ ను నియమిస్తాయి. కమిషన్ కనీసం సంవత్సరానికి ఒకసారైనా సమావేశం కావాలి. ఒకసారి భారత్లో అయితే తదుపరి సమావేశం పాకిస్తాన్ లో జరగాలి. కమిషన్ ఏటా వార్షిక నివేదిక రూపొందించి ఇరు దేశాల ప్రభుత్వాలకు నివేదిస్తుంది. వివాదాలను ఇరు దేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. లేనట్టయితే ఏదైనా ఒక దేశం కోరితే Court of Arbitration ఏర్పాటు చేసుకొని వివాదాన్ని పరిష్కరించుకోవాలి. ఈ ఒప్పందంలో సింధు బేసిన్లో లభ్యమయ్యే జలాల్లో 80 శాతం నీరు పాకిస్తాన్కు, 20 శాతం నీరు భారత్కు అని ఎక్కడా పేర్కొనలేదు. పశ్చిమ, తూర్పు నదుల పరీవాహక ప్రాంతాలను బట్టి ఈ రకమైన నిర్ధారణకు వచ్చి ఉంటారని అనుకోవచ్చు. 1960, సెప్టెంబర్ 19న ఇరు దేశాలు సంతకం చేసిన సింధూ జలాల ఒప్పందం స్థూలంగా ఇట్లా ఉంది. దీనిపై భారత్ తరపున ఆనాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, పాకిస్తాన్ తరపున ఆనాటి దేశాధ్యక్షుడు, ఫీల్డ్ మార్షల్ మొహమ్మద్ అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. International Bank for Reconstruction



*ఎడమ నుండి కుడికి: ఎ.ఎన్.కోస్ల, ఎం. ఇబ్రహీం, హర్రీ బశోర్, ఎం.ఎ.హమీద్, ఎం.ఎస్. ఖురేషీ, రేమండ్ ఎ, వీలెర్, నెయిల్ బాస్, ఎన్.డి. గులాటి, జె.కె. మల్హోత్ర, అబ్దుర్ రెహమాన్, హుసేన్ అహమ్మద్*

and Development (దీన్నే ప్రపంచ బ్యాంక్ అని పేర్కొంటారు) ఈ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించింది.

**సింధు జలాల ఒప్పందం రద్దు వలన తక్షణ ప్రభావాలు ఉంటాయా?**

నిజానికి సింధు నది ఒప్పందాన్ని భారత ప్రభుత్వం మొత్తంగా రద్దు చేయకుండా ప్రస్తుతానికి పక్కన పెట్టింది (Kept in abey-ance). ఉరి ఘటన తర్వాత 2016లో సింధు జలాల ఒప్పందాన్ని సమీక్ష చేయడానికి కేంద్ర ప్రభుత్వం కేబినెట్ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసింది. ఇందులో నీటిపారుదల నిపుణులు, విద్యుత్ రంగ నిపుణులు, ఆర్థిక వేత్తలు, పర్యావరణ వేత్తలు సభ్యులుగా ఉన్నారు. 8 ఏళ్లు గడచింది. కమిటీ ఏ నిర్ణయం తీసుకోలేదు. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తుతం పక్కన పెట్టినప్పటికీ ఇప్పటికిప్పుడు సింధు నది జలాలను ఆపడానికి లేదా ఇతర బేసిన్లకు మళ్ళించడానికి మన దేశం వద్ద మౌలిక సదుపాయాలు (Infrastructurefacilities) లేవు. ఇప్పుడున్నవి జల విద్యుత్ ఉత్పత్తికి ఉద్దేశించినచిన్నడ్యాంలు మాత్రమే. వాటిని Run-Ofthe RiverProjects అంటారు. అంటే విద్యుత్ ఉత్పత్తి తర్వాత ఆ నీళ్ళు నదిలోకి వెళ్లిపోతాయి.

ఇవి హిమాలయ నదులు కాబట్టి ఏడాది పొడుగున నదిలో ప్రవాహాలు ఉంటాయి. పీఠభూమి నదులలో ఉన్నట్టే వానా కాలంలో హిమాలయ నదుల్లో కూడా అధికంగా ప్రవాహాలు ఉంటాయి. సింధు దాని 5 ఉప నదుల నుంచి వచ్చే అపారమైన జలరాశిని నిలువ చేయడానికి ఎత్తైన డ్యాంలను నిర్మించవలసి ఉంటుంది. ఆ నిల్వ నీటిని విద్యుత్ ఉత్పత్తికి, వ్యవసాయానికి,ఇతర నదీ బేసిన్లకు మళ్ళించడానికి పర్వతాలను తొలిచి వందల కిలోమీటర్ల సొరంగాలను తవ్వాలి. ఇవి ఖర్చుతో కూడుకున్నవి, సమయం తీసుకుంటాయి, హిమాలయ పర్యావరణానికి అపారమైన నష్టాన్ని కలుగజేసే అవకాశం ఉంది. పైగా హిమాలయ పర్వత శ్రేణులు అత్యధిక భూకంప ప్రభావిత జోన్‌గా వర్గీకరించిన ప్రాంతం. భూకంపాలు వచ్చినప్పుడు డ్యాం పగిలి కూలిపోతే అది సృష్టించే విలయం ఊహకు అందనిది. కాబట్టి భారత భూభాగంలో సింధు నదిపై ఎత్తైన డ్యాంలను నిర్మించడం కుదరదు. లద్దాక్ ప్రాంత ముఖ్య పట్టణంలే కూడా ముంపు బారిన పడుతుంది. ఎత్తైన డ్యాంలు నిర్మించకుండా సింధు నదిలో లభ్యమయ్యే అపారమైన జలరాశిని మనం ఒడిసి పట్టివాడుకోలేమన్న అవగాహన నెహ్రూకి ఉంది. అట్లే హిమాలయ భూకంప ప్రభావిత జోన్లో ఎత్తైన డ్యాంలను నిర్మించడం కూడా ప్రమాదకరమన్న అవగాహన కూడా ఆయనకు ఉన్నది.

**సింధు పరీవాహక ప్రాంతం ఎవరికి అనుకూలం?**

భారతదేశం సింధు నదీ వ్యవస్థలో పైన ఉన్నది. మనవి పర్వత ప్రాంతాలు. పాకిస్తాన్ నదీ వ్యవస్థకు దిగువన ఉన్నది. గోదావరి బేసిన్లో ఎత్తైన ప్రాంతంలో తెలంగాణ, దిగువన మైదాన ప్రాంతంలో ఆంధ్రా ఉన్నట్టు అనుకోవాలి. పాకిస్తాన్ లో మైదాన ప్రాంతాలు, డెల్టా భూములు ఉన్నాయి. మనం ఎంత వాడుకున్నాతూర్పున ఉన్న రావి, బియాస్, సట్లెజ్ నదుల నీళ్ళను మాత్రమే వాడుకోగలం. పశ్చిమాన ఉన్న సింధు, చీనాబ్, జీలం నదుల జలాలను నిలువ చేయలేము.అందుకే ఆ నదులను పాకిస్తాన్ కు వదిలేయడం జరిగింది. వాటిపై జల విద్యుత్ కేంద్రాలను నిర్మించి విద్యుత్ ఉత్పత్తి తర్వాత నీటికి నదిలోకి వదిలేయడం జరుగుతుంది. ఇవి కూడా ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న డ్యాంలు కావు. పశ్చిమాన ఉన్న ఆ మూడు నదుల పరీవాహక ప్రాంతాలు కూడా అత్యధికంగా పాకిస్తాన్ భూభాగంలోనే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ జలాలను మన అవసరాలకు ఇన్నేళ్ల తర్వాత కూడా ఇంకా పూర్తిగా వినియోగంలోకి తీసుకురాలేక పోయినాయి మన ప్రభుత్వాలు. పాకిస్తాన్‌లో టర్బెల లాంటి ఎత్తైన డ్యాంలతో పాటు మైదాన ప్రాంతాల్లో సుక్కూర్లాంటి బ్యారేజిలు కూడా ఉన్నాయి. వాటి ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు మళ్ళించగలుగుతున్నారు. పట్టణాలకు, నగరాలకు తాగునీరు అందివ్వగలుగుతున్నారు. ఎత్తైన డ్యాంల వద్ద విద్యుత్ ఉత్పత్తి కూడా జరుగుతున్నది.

**సింధు జలాల ఒప్పందానికి జరిగిన కృషి :**

సింధూ నది జలాల పంపిణీకి సంబంధించిన అంతరాష్ట్ర వివాదాలు స్వాతంత్రియానికి పూర్వం నుంచే అవిభక్త భారతదేశంలో పంజాబ్, సింధ్, బహావల్పూర్, బికనేర్ రాష్ట్రాల మధ్య ఉండేవి. 1947 లో భారతదేశం విభజన చెందిన తర్వాత సింధు నదీ బేసిన్ కూడా రెండు ముక్కలు అయ్యింది. విభజనానంతరం సింధు జలాల వివాదం పాకిస్తాన్‌కు పోయిన పశ్చిమ పంజాబ్, భారత్‌లో ఉన్న తూర్పు పంజాబ్ రాష్ట్రాల మధ్య వివాదంగా మారింది. 1948 లో ఇది భారత్, పాకిస్తాన్ దేశాల మధ్యన అంతర్జాతీయ వివాదంగా రూపం మార్చుకున్నది. 1952 దాకా రెండు దేశాల మధ్య సింధు జలాల పంపిణీకి సంబంధించిన వివాదాలపై అనేక సమావేశాలు జరిగాయి. లేఖల ద్వారా సంప్రదింపులు జరిగినాయి. రెండు దేశాలు ఎవరి వైఖరితో వారు వ్యవహరించడంతో వివాద పరిష్కారం జరగలేదు.

గతంలో అమెరికాలో టెన్నేసివ్యాలీ అథారిటీ (TVA) ఛైర్మన్, అమెరికా అణు శక్తి కమిషన్‌కు ఛైర్మన్ అయిన డేవిడ్ ఇ లీలిఏంతల్ (David ELilienthal) కృషి ఫలితంగా 1952లో ఈ వివాదంలోకి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిగా రంగ ప్రవేశం చేసింది. ఆనాడు ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడిగా ఉన్న విలియం ఐలిఫ్ (WABIliff) మధ్యవర్తిత్వానికి నేతృత్వం వహించాడు. రెండు దేశాలు తమ తరపున ఇంజనీర్లను చర్చల ప్రతినిధులుగా నియమించాయి. భారత్ తరపున జాతీయ, అంతర్జాతీయ నదీ జలాల పరిష్కార చట్టాలపై అపారమైన అనుభవం ఉన్న, తూర్పు పంజాబ్ చీఫ్ ఇంజనీర్ నిరంజన్ దాస్ గులాటి (NDGulhati), పాకిస్తాన్ తరపున చీఫ్ ఇంజనీర్ మునీరుద్దీన్ చర్చల కోసం శాశ్వత ప్రతినిధులుగా నియమించబడినారు. సింధు జలాల ఒప్పందం ఖరారు చేయడంలో భారత్ తరపున మరో ఇద్దరు ఇంజనీరింగ్ మేధావులు.. సెంట్రల్ వాటర్ & పవర్ కమిషన్ ఛైర్మన్, కేంద్ర ప్రభుత్వ ఎక్స్ అఫిషియో అదనపు సెక్రెటరీ ఏ ఎన్ ఖోస్లా, కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ డా. జె కె మల్హోత్రా కీలక పాత్ర పోషించినారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఆనాటి కేంద్ర జల వనరుల మంత్రి, ఉప ప్రధాన మంత్రి శ్రీ గుల్జారీ నందా పర్యవేక్షించినారు. అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్ డిసి లో ఉన్న ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సుదీర్ఘంగా చర్చలు, క్షేత్ర స్థాయి పర్యటనల అనంతరం ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం ఖరారు అయ్యింది. ఈ వివరాలన్నీ భారత్ తరపున చర్చల ప్రతినిధిగా వ్యవహరించిన ఎన్ డి గులాటి రచించిన 'Indus WatersTreaty -An Exercise in International Mediation" అనే పుస్తకంలో కూలంకషంగా చర్చించినారు. ఆనాడు దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ నిపుణుల మేధోమధనంలో నుంచి ఉద్భవించిన సింధు జలాల ఒప్పందం కేవలం నెహ్రూ చారిత్రక తప్పిదంగా అభివర్ణించడం సమంజసమా?



*జవహర్‌లాల్ నెహ్రూ, మహ్మద్ ఆయూబ్‌ఖాన్, డబ్ల్యూ.ఎ.బి. ఇలీఫ్,*

**ఒప్పందం రద్దు వలన జరిగేది ఏమిటి?:**

ఇండస్ వాటర్ ట్రీటీ (IWT)ను భారత ప్రభుత్వంఅబియన్స్ లో పెట్టినందు వలన ఇప్పటికిప్పుడు పాకిస్తాన్‌కు జరిగే నష్టం ఏమీ లేదని ఇంజనీరింగ్ నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఎత్తైన డ్యాంలు కట్టి, హిమాలయ పర్వతాలను తొలిచి సొరంగాలు నిర్మించి నీటిని మళ్లించినా సింధు నదీ వ్యవస్థలో ఉత్పన్నం అయ్యే అపారమైన జలరాశి కిందకి పోవలసిందే. ఎందుకంటే నీటిని నిల్వ చేయడంలో డ్యాంలకు కూడా పరిమితులు ఉంటాయి. అయితే ఎండాకాలం మంచు కరిగివస్తున్న నీటిని మాత్రం భారత్‌లో ఆపి వేసే అవకాశం ఉంది. అప్పుడు పాకిస్తాన్‌లో సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తప్పవు. అందుకు భారత్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుంది. తక్కువ ధరకు లభించే పర్యావరణహిత విద్యుత్తును కోల్పోవడానికి భారత్ సిద్ధపడుతుందని నిపుణులు భావించడం లేదు. ఎందుకంటే.. జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన చండీఘర్, లద్దాక్ ఈ జల విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థమీదనే ఆధారపడి ఉన్నాయి.

భావోద్వేగాలకు లోను కాకుండా వాస్తవికంగా ఆలోచిస్తే ఆనాటికి సింధు జలాల ఒప్పందం (IWT)సరి అయినదేనని తోస్తుంది. పైన ప్రస్తావించినట్టు జాతీయ, అంతర్జాతీయ నీటి వివాదాల పరిష్కార చట్టాలను అధ్యయనం చేసిన న్యాయ నిపుణుడు, ఆనాటి ఈస్ట్ పంజాబ్ చీఫ్ ఇంజనీర్ ఎన్ డి గులాటి, సెంట్రల్ వాటర్ & పవర్ కమిషన్ ఛైర్మన్ఏ ఎన్ ఖోస్లా లాంటి ఇరిగేషన్ ఇంజనీరింగ్‌లో మేధావులు12 ఏండ్ల పాటు విస్తృతంగా చర్చించిన తర్వాతనే ఈ ఒప్పందం ఖరారు అయ్యింది తప్ప నెహ్రూ మెదడులో నుంచి అకస్మాత్తుగా ఊడిపడిన ఒప్పందం కాదు అని విజ్ఞులు గమనించాలి.

65 ఏండ్ల తర్వాత సింధు జలాల ఒప్పందంలో జరిగినదని అంటున్న నష్టాన్ని లేదా అన్యాయాన్ని నివారించడానికి, సింధు జలాల ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ నదులలో లభ్యమయ్యే జలాలను భారతదేశంలో సంపూర్ణంగా వినియోగంలోకి తీసుకురావడానికి, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ జలాల్లో భారత్ మరింత ఎక్కువ నీటి వాటాను పొందడానికి ఏమి చేయాలన్న అంశాలపై ఇంజనీరింగ్ నిపుణులు, న్యాయ నిపుణులు, పర్యావరణ వేత్తలు, ఆర్థిక వ్యవహారాల నిపుణులతో చర్చించి కార్యాచరణ సిద్ధం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అయితే ప్రకృతి సిద్ధంగా ఏర్పాటు అయిన సింధు బేసిన్ పరీవాహక ప్రాంతాలను మార్చడం వీలు కాదన్న సత్యాన్ని కూడా గుర్తించడం అవసరం.

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే,
m : 94910 60585
e : deshpandesri@gmail.com




# "భూపతి చంద్ర"

## స్మారక కథానికల పురస్కార ప్రదానోత్సవం

"భూపతి చంద్ర" స్మారక కథానికల పోటీ 2025 పురస్కార ప్రదానోత్సవ సభ 18 మే 2025 ఆదివారం సాయంత్రం 5.30 ని॥లకు 'భూపతి చంద్ర' మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ యం.ఎల్. కాంతారావు గారి అధ్యక్షతన తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాదు నందు జరిగింది.

భూపతి చంద్ర స్మారక కథానిక పోటీ అధ్యక్షులు యం.ఎల్. కాంతారావు సభకు అధ్యక్షత వహించారు. శ్రీమతి శారదరెడ్డి గారు శ్లోక పఠనం చేశారు. ఈ సభకు సీనియర్ సంపాదకులు కె. రామచంద్ర మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి బి. నరసింగరావు, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ (పూర్వాధ్యక్షులు, తెలుగు శాఖ, నాగార్జున యూనివర్సిటీ) పాల్గొన్నారు. ఆల్ ఇండియా రేడియో పూర్వాధ్యక్షులు రాంబాబు నిర్వహణలో కార్యక్రమం కొనసాగింది.

సభకు అధ్యక్షత వహించిన కాంతారావు, తమ తండ్రి స్వర్గీయ శ్రీ భూపతిరావు, తల్లి స్వర్గీయ శ్రీమతి చంద్రమ్మగారల స్మారకార్థం వారి పేర మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేశామని దానిలో భాగంగా "భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ 2025" నిర్వహించామని, ఈ పోటీలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా తమిళనాడు, న్యూఢిల్లీ, పూణె, బెంగుళూరు, ముంబాయి నగరాల నుండి కూడా వందకు పైగా కథానికలు వచ్చాయని పురస్కారాలు పొందిన రచయితలకు, రచయిత్రులకు, న్యాయ నిర్ణేతలకు అభినందనలు తెలిపి పోటీలో పాల్గొన్న రచయితలకు, రచయిత్రులకు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కథానికల పోటీకి వచ్చిన కథానికల నన్నింటిని తాను చదివానని, న్యాయ నిర్ణేతలు నలుగురు కూడా చదివినారని అందరము చదివిన తర్వాత పారదర్శకంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించామన్నారు.







ప్రోత్సాహక బహుమతులు:







| ప్రథమ బహుమతి: వాగంటి ప్రసాద్ –తీరని రుణం | ద్వితీయ బహుమతి: ఉప్పులూరి మధుపత్ర శైలజ – అనుకోని అతిథి | తృతీయ బహుమతి: కొండ మల్లారెడ్డి – కర్రెకోడి | ఎం.శ్రీనివాసరావు –(సమీధ) | కె.వాసవ దత్తరమణ –(సాగని పయనం) | పప్పు శాంతాదేవి –(ఏది ముఖ్యం) |
|---|---|---|---|---|---|

ఈ కథానికల పోటీ కార్యక్రమమును ప్రతి సంవత్సరము నిర్వహించుటకు అందరి సహకారముతో కృషి చేస్తామన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ పత్రికా సంపాదకులు శ్రీ కె. రామచంద్రమూర్తిగారు మాట్లాడుతూ ఈ ఉరుకుల, పరుగుల జీవితములో చాలా మంది జీవించియున్న తల్లిదండ్రులనే మరచిపోతున్న ఈ రోజుల్లో తల్లిదండ్రుల స్మారకార్థం వారి కుమారులు ఐదుగురు వారి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేయడం, ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, కథానికల పోటీని నిర్వహించి పురస్కార ప్రదానోత్సవం గావించడం ఎంతో అభినందనీయమని అన్నారు. సాహితీ ప్రక్రియలలో తనకు కూడా కథానిక ప్రక్రియ ఎంతో ఇష్టమని తెలియజేశారు. తాను హెచ్ఎంటీవీలో ఉన్నప్పుడు కీ.శే. గురజాడ అప్పారావు 1910లో రచించిన తొలి తెలుగు కథానిక "దిద్దుబాటు" మొదలుకొని వందేండ్ల కథకు వందనాలు పేరిట కీ.శే. గొల్లపూడి మారుతీరావు గారి పర్యవేక్షణలో వంద కథలను సమీక్షించామన్నారు.

ఈ ట్రస్ట్ తరఫున ఇదేవిధంగా ప్రతి సంవత్సరం కథానికల పోటీని నిర్వహించాలని ఆశిస్తున్నాను అని అన్నారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ గారు మాట్లాడుతూ.. సాహిత్య చరిత్రలో "కథానిక" ప్రక్రియకున్న విశిష్టత చాలాగొప్పదని, ఈనాటికి పాఠకలోకం ఆదరిస్తున్న ఒకటి, రెండు ప్రక్రియలలో కథానిక మొదటిది అన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ శ్రీ కాంతారావు గారు నాతో ఈ విషయం మొదటిసారిగా మాట్లాడినప్పుడు ఇది చాలా మంచి నిర్ణయమని ముందుకు వెళ్లండని ప్రోత్సహించాను అని అన్నారు.

శ్రీ కాంతారావుగారు రాజకీయాల్లో రాణిస్తూనే సంగీత, సాహిత్యాలలో అభినివేశం కలిగి యుండడం తనకు ఎంతో ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తుందని ఈ వయస్సులో కూడా వారు పోటీకి వచ్చిన ప్రతి కథానికను చదివి న్యాయ నిర్ణేతలతో చర్చించి నిర్ణయం తీసుకోవడం వారికే చెల్లిందని మన్నవ అన్నారు.

శ్రీ బి.నరసింగరావు గారు సభనుద్దేశించి మాట్లాడుతూ తమ కుటుంబం చిన్నప్పటి నుండి పుస్తకాలు, కవితలు చదివే ఆసక్తి మరియు కవిత్వంపై ఉన్న ఆసక్తి గురించి వివరించారు. సుప్రసిద్ధ రచయిత శ్రీ నవీన్ గారు అంపశయ్య నవల రచించి 50 సం?లు పూర్తి చేసుకున్న సందర్భంగా BCMT తరఫున 2019లో వారికి 'కీర్తిశిఖర' అవార్డును అందజేశామన్నారు.

రమణ సభా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, సహాయ సహకారాలందించిన శ్రేయోభిలాషులకు, కథానికల పోటీలో పాల్గొన్న రచయిత్రులకు, రచయితలకు, న్యాయనిర్ణేతలకు మరియు సభలో పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు తెలియజేసారు.

–ధర్మపురి లక్ష్మణ స్వామి
సమన్వయకర్త,
భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ – 2025
mo: 99636 16999

ద





# పర్యావరణ స్పృహ– పర్యావరణ రచనలూ!

"సంపద అంటూ వేరే ఏమీ లేదు, ఉన్నది కేవలం జీవితం మాత్రమే"
(There is no wealth, but life)
*- John Ruskin*

"19వ శతాబ్దం బానిసత్వ నిర్మూలనకు, 20వ శతాబ్దం మానవహక్కులకు ప్రతీకలైనాయి. 21వ శతాబ్దం మనదగ్గ పర్యావరణ సాధనకు ప్రతీక అవుతుంది."
*- The state of world report (సహస్రాబ్దపు ప్రత్యేక ఎడిషన్ 2000)*

"మనదేశంలో కొన్ని సంవత్సరాల క్రితం దాకా దాదాపు 300 రకాల వరి పంట పండేది."
*– ఒక సామాజిక పరిశీలన*

"ఆరోగ్యకరమైన పొయ్యి తయారు చెయ్యడం కన్నా న్యూక్లియర్ రియాక్టర్ ను రూపొందించడం చాలా తేలిక."
*– మధు శరీన్ అనే ఇటీవలి కాలపు ఆర్కిటెక్ట్*

"నరుని అడుగు సోకని అడివి ఎంతో రమణీయంగా ఉంది."
*– వాల్మీకి (రామాయణంలో)*

"ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు ఒక ఫుట్ బాల్ గ్రౌండ్ అంత వైశాల్యం గల అడవులు ఉష్ణమండల దేశాల్లో నాశనం అవుతున్నాయి."
*– పాతికేళ్ళ క్రితం వెలువడిన వార్తా సమాచారం.*

"మనిషి అవసరాలను ప్రకృతి తీరుస్తుంది, కానీ పేరాశలను కాదు."
(The earth provides enough to satisfy every once need, but not for every once greed.)
*– మహాత్మాగాంధీ (సుమారు వందేళ్ళ క్రితం)*

ఆవాస విధ్వంసం వల్లనూ, కొత్త తెగలు చొప్పించడం వల్లనూ, రసాయన కాలుష్యం వల్లనూ, వ్యవసాయం పెరగడం వల్లనూ ఎన్నో రకాల తెగలు అంతరించి పోతున్నాయి.
- International Union for the Conservation of Nature and Natural Resources. (Red data book).


గత 50 కోట్ల సంవత్సరాల కాలంలో ఐదుసార్లు గొప్ప వినాశనాలు జరిగాయి. మొదటిది 448 మిలియన్ సంవత్సరాల క్రితం ఆర్డోవిషియన్ కాలంలో రాగా, రెండవది 365 మిలియన్ సంవత్సరాల క్రితం డెవోనియన్ కాలంలో సంభవించింది. కాగా మూడవది 286 మిలియన్ సంవత్సరాల క్రితం పెర్మియాన్ కాలంలో, నాలుగవది 210 మిలియన్ సంవత్సరాల క్రితం ట్రియాసిక్ కాలంలో, ఐదవది 66 మిలియన్ సంవత్సరాల క్రితం క్రెటాసియస్ కాలంలో వచ్చాయి. వీటిలో ప్రతిసారీ భూమండలంపై ఉన్న జీవజాలానికి అనంతమైన నష్టం దాపురించింది. ఈ చివరి వినాశనంలోనే పెద్ద పెద్ద డైనోసార్లు కనుమరుగయ్యాయి అంటారు. వీటిలో మొదటి నాలుగు వాతావరణంలో వచ్చిన పెను మార్పుల వల్ల సంభవించగా, ఐదవది మాత్రం గొప్ప ఉల్కాపాతం వల్ల జరిగిందంటారు. ఇక, ఆరవ వినాశనం ప్రస్తుతం కొనసాగుతోంది. దీనికి సూత్రధారి ప్రకృతి కానేకాదు! అసలు పాత్రధారి ఈ తెలివిగల మనిషే! అది కూడా ఒక్క దూటున జరుగకుండా నిరంతరాయంగా, క్రమంగా వినాశన స్థాయి పెరుగుతూ సంభవిస్తోంది.

ఇటువంటి సమాచారం తెలుసుకున్నప్పుడు, వంట బట్టించుకున్నప్పుడు మనకు, పుస్తకాల గురించి గుంటూరు శేషేంద్ర శర్మ వ్యాఖ్యానించి నట్టు, ఆలోచన పెరగాలి, కర్తవ్యం బోధపడాలి, పటిష్టమైన అడుగు భవిష్యద్దృష్టితో ఆశావహంగా సాగాలి! అంతే గాని, నిరాశలో మునిగి పోయి నిరుత్తరులు కావడం మరింత వినాశనానికి పరోక్షంగా దోహదపడటమే అవుతుంది! కర్తవ్యోన్ముఖులం అయ్యే దాకా ఆవేశం వుండవచ్చు. అయితే కార్యరంగంలో దూకిన క్షణం నుంచీ నెమ్మదితనం వుండాలి, సహిష్ణుత పెరగాలి, సాటి సంస్కృతులను ప్రేమించాలి, విబేధించే పరిస్థితులు తారసపడినప్పుడు సంఘర్షణ కన్నా సామరస్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి! సరిగ్గా ఈ సందర్భంలోనే కమ్యూనికేషన్ చెయ్యడం కోసం కళలూ సాహిత్యరూపాలూ అవసరమవుతాయి. సరిగ్గా ఆ విషయం గురించే ఇక్కడ ప్రస్తావించు కుంటున్నాం.

ఒకవైపు కరోనా ఎందుకు, ఎలా సోకి, విజృంభించిందో ఇంకా స్పష్టంగా తేట పడలేదని భావిస్తున్న పరిస్థితుల్లోబీ చలి చంపిన తర్వాత మండుటేసవి మరింత మండిపోతోందనే సమీప భవిష్యత్తు గురించి బెదరగొట్టే సమాచారం మరింత వస్తున్న

సమయంలో ఈ విషయాలు చర్చించుకోవడం కచ్చితంగా కీలకమే! పర్యావరణం కథావస్తువైతే, పర్యావరణ రచనలు కళారూపాలే! పుస్తకమైనా, సభలో చేసే ఉపన్యాసమైనా, రేడియో ప్రసంగమైనా, పత్రికా రచనయైనా, టెలివిజన్ డాక్యుమెంటరీ అయినా, షార్ట్ ఫిల్మ్ అయినా కమ్యూనికేషన్ కోసం ఉద్దేశింపబడినవే!

ప్రకృతితో మనిషి సంబంధం కొత్తదికాదు. ప్రకృతి అంటే చుట్టూ వుండే భూమీ ఆకాశం, చెట్టూ చేమా, పక్షీ పాము, కొండా కోనా, నిప్పూ నీరు.. అది రమణీయం కావచ్చు లేదా వినాశనపు వైపరీత్యం కావచ్చు. నేడు పర్యావరణంగా పిలువబడేది సైన్స్ శాఖా? హ్యూమానిటీస్ విభాగమా? చరిత్రాంశమా? నీతిశాస్త్రమా అని కూడా సందేహం రావచ్చు. కానీ నిజానికి మనిషి ఆవిర్భావం నుంచి సముపార్జించిన జ్ఞానం నడిచిన తీరును, దాన్ని మనిషి ఉపయోగించుకుంటున్న వైఖరిని 'పర్యావరణ దృష్టి'గా పేర్కోవచ్చు. అంతరిస్తున్న ప్రాణికోటి, మండుతున్న భూగోళం, ఉష్ణోగ్రతలు పెరగడం, సముద్ర మట్టం పెరగడం వంటి వాటి గురించి మాటాడతాం గనక అది 'ఎన్విరాన్ మెంటల్ సైన్స్' మాత్రమే అని కొంతమంది భావిస్తారు. కానీ నిజానికి 'పర్యావరణం' అనేది సామాజిక చరిత్ర, వైయక్తిక ప్రవర్తన, దేశదేశాల మధ్య తోడ్పాటు, ప్రకృతి ఆరాధన, భవిష్యత్ బాధ్యత, నిరంతరమైన ఆశ, ప్రజాస్వామ్య యుతంగా వ్యవహరించడం ఇలా ఇంకా పలురకాలుగా విశ్లేషించవచ్చు. కనుకనే ఈ భూగోళం మనిషి కోసం మాత్రమే ఏర్పడింది కాదని, అందులో ఆవాసముండే అనంత ప్రాణికోటిలో మనిషి కేవలం ఒక జీవి మాత్రమేననే ఎరుక కలగాలని, అదే రీతిలో తులనం చేసి, ప్రాధాన్యాల (ప్రియారిటీస్)ను నిర్ణయించు కోవాలని కొందరు పదేపదే గుర్తుచేస్తుంటారు. అంటే ప్రతి ఆలోచనలో, ప్రతి మాటలో, ప్రతి పనిలో పర్యావరణం గురించిన స్పృహ వుండాలి. కనుక సమాజ హితం కోరే దీన్ని చరిత్ర అంటారో, సామాజిక శాస్త్రం అంటారో, కర్తవ్యం అంటారో, ఆశావాదం అంటారో మీ ఇష్టం! అలాగే ఇది సాహిత్యానికి, కళారూపాలకు మంచి ముడిసరుకు. ఇన్ని విషయాలు చెప్పుకున్నా పర్యావరణం ఏమిటని మరలా సందేహం రావచ్చు. మనిషి చుట్టూ వున్న ప్రతిదీ రాళ్ళూ రప్పలతో సహా పర్యావరణంలో అంతర్భాగమే!





మొదటి ప్రపంచయుద్ధం సముద్రతలంపై జరిగితే, టెక్నాలజి కారణంగా రెండవ ప్రపంచయుద్ధం గగనతలం మీద జరిగింది. రెండవ ప్రపంచయుద్ధం అనంతరం ఓ రెండు పోకడలు పాశ్చాత్య దేశాల్లో స్పష్టంగా కనబడతాయి. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చాలా దేశాలు ఆర్థికాభివృద్ధిని సాధించాయి. ప్రకృతి వనరుల వినియోగం పెరగడం వల్ల పెచ్చురిల్లిన కాలుష్యం వారిని ఆందోళన పరిచింది. మరోవైపు ప్రపంచయుద్ధంలో వాడిన అణ్వస్త్రాల కారణమైన వినాశన ఫలితాలు కొన్ని దేశాలనైనా గడగడలాడించింది. 1950 కాలానికే థేమ్స్, రైన్ వంటి నదులు కాలుష్యాలతో నిండిపోయాయి. జపాన్ దేశాన్ని 'మినమట' అనే నరాల వ్యాధి గడగడలాడించింది. టోకియో, లండన్, లాస్ ఏంజెల్స్ వంటి నగరాలలో గాలి విషపూరితమైంది. ఈ నేపథ్యంలో మొదలైన చైతన్యం 1960వ దశాబ్దంలో ఉద్యమంగా ఊపిరి పోసుకుంది. అదే రాజకీయాంశంగా మారి ఎన్నికల మేనిఫెస్టోలో అంతర్భాగం అయ్యింది. ఈ సందర్భంలోనే మరింత కాలుష్యం జరగకుండా చూడటం. సంభవించిన విపరిణామాలను సరిదిద్దుకోవడం మొదలైంది. ఇందులో భాగంగానే 1972లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యావరణ సదస్సును జూన్ 5వ తేదీన ప్రారంభించింది. ఈ సందర్భాన్నే మనం 'ప్రపంచపర్యావరణ దినోత్సవం'గా స్ఫూర్తి పొందుతూ కర్తవ్యోన్ముఖులం అవుతున్నాం.

భారతదేశ పర్యావరణ ఉద్యమాలకు ప్రపంచంలో ఇతర చోట్ల జరిగిన పర్యావరణ ఉద్యమాలకు తేడా ఒకటి స్పష్టంగా ఉందని జాన్ ఎస్. మూలక్కట్టు అనే సామాజిక శాస్త్రవేత్త ఇటీవల వ్యాఖ్యానించారు. భారతదేశపు పర్యావరణ ఉద్యమాలలో పేదలు కీలకపాత్ర పోషించగా ఇతర దేశాలలో నగర మధ్యతరగతి వ్యక్తులు ప్రధానంగా పోరాడుతున్నారు. ప్రపంచ పర్యావరణ సదస్సుతో సంబంధం లేకుండా 'చిప్కో ఉద్యమం' మనదేశంలో ఇప్పుడు ఉత్తరాఖండ్‌గా పిలువబడే ప్రాంతంలో 1973లో మొదలై, 1974 మార్చి 26న ముగిసింది. ఇందులో నరికివేస్తున్న చెట్లను ఆపడానికి గ్రామీణ ప్రజలు ముఖ్యంగా మహిళలు పాల్గొని విజయవంతం చేశారు. చిప్కో అంటే చెట్లను కావలించుకోవడం. దీనిని భారతదేశపు తొలి పర్యావరణ పోరాటంగా పేర్కొంటాం. తరువాతి కాలంలో కేరళలో జరిగిన సైలెంట్ వాలీ ప్రాజెక్టు వ్యతిరేకోద్యమం, మధ్యప్రదేశ్ లో జరిగిన నర్మద బచావ్ ఆందోళన మొదలైనవాటిని ప్రధానంగా చెప్పవచ్చు. ఇంకా ఒరిస్సాలో చిలుకా సరస్సు కోసం స్థానికులు చేసిన ఉద్యమం, కేరళలో కోకో కోలా ఫ్యాక్టరీ మూసివేత, కర్ణాటక రాష్ట్రంలో జరిగిన చెట్ల రక్షణ ఉద్యమం కూడా ప్రధానమైనవే. ఏ పర్యావరణ రక్షణ ఉద్యమమైనా ఆశావహ దృష్టితోనే మొదలవుతుంది.

ఈ ఉద్యమాలు భారతదేశంలో డా. రామచంద్ర గుహ ప్రకారం 9 దశాబ్దాల క్రితం మొదలయ్యాయి. 1928 డిసెంబర్ 20వ తేదీ 'యంగ్ ఇండియా' పత్రికలో ఇంగ్లండ్ పాలన, ఆలోచనా విధానం ఎలావుందో వ్యాఖ్యానిస్తూ గాంధీజీ ఇలా రాశారు. "ఈ భూగోళంలోని వనరులలో సగాన్ని బ్రిటన్ కబళించింది. అదే దిశలో మనదేశం వెళ్ళాలంటే ఎన్ని భూగోళాలు కావల్సి వుంటుందో? " భారతీయ గ్రామీణాభివృద్ధి సంబంధించి ఎంతో కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధులు జె.సి. కుమారప్పఇంగ్లండు పాటించిన

ఆర్థిక విధానాన్ని 'పారాసైటిక్ (Parasitic) ఎకానమీ' అని ఘాటుగా విమర్శించారు. ఇతనినే రామచంద్ర గుహ భారతదేశపు తొలి పర్యావరణ పోరాటయోధునిగా అభివర్ణిస్తారు. 1944 నుంచి హిమాలయాల దాపున గ్రామీణ రంగం, పంటలు, నీటి సంరక్షణ, పశువులు వంటి పర్యావరణ సంరక్షణ కోసం కిసాన్, పశులోక్, గోపాల్ ఆశ్రమాలపేర ఎంతో కృషి చేసిన మీరాబెన్ (Madeleine Slade) మన దేశపు తొలి 'ఎకో ఫెమినిస్ట్' (Eco-feminist). దాదాపు అదే కాలంలో ఇదే దిశలో కృషి చేసిన మరో యూరోపియన్ వనిత సరళా బెన్ (Catherine Mary Hellman). భారతదేశంలో పర్యావరణ దృష్టి మొదలు కావడానికి కారణమైన చాలామంది సుందరలాల్ బహుగుణతో సహా విమలా బహుగుణ, సాధన్ మిశ్రా, రాధాభట్, చండీ ప్రసాద్ భట్ ఇత్యాదులు సరళాబెన్ స్ఫూర్తి తోనే నడుం కట్టినవారు.

1972లోనే 'ఎన్విరాన్ మెంట్' అనే మాట చలామణిలోకి వచ్చింది. 'సస్టైనబుల్ డెవలప్ మెంట్' అనే మాట (మనదగ్గ లేదా సుస్థిర అభివృద్ధి) అనే భావనను 1980లో ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ది కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ అనే సంస్థ ప్రపంచ పర్యావరణ సంరక్షణా వ్యూహాల గురించి వివరిస్తూ ఇది తొలి అవసరమంటూ 'సస్టైనబుల్ డెవలప్ మెంట్' అనే పదం మొట్టమొదటిసారి వాడింది. తర్వాత్తర్వాతనే 'హొలిస్టిక్ డెవలప్ మెంట్', 'పీస్ అండ్ పాస్పెరిటీ', 'లిమిట్స్ టు గ్రోత్' వంటి భావనలు కూడా ముందుకు వచ్చి చర్చింపబడ్డాయి. ఎప్పటికప్పుడు అత్యంత అవసరమైన విషయాల మీద ప్రపంచం దృష్టి పెట్టాలని ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఇతివృత్తాలను ఎంపిక చేసుకొని, వాటి కేంద్రంగా కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. ఉదాహరణకు ఈ ఇటీవల ఐదు సంవత్సరాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాల ఇతివృత్తాలివి:




- జీవవ్యవస్థలను యథాస్థితికి తీసుకురావడం (2021)
- ప్రకృతితో సామరస్యంగా, మనదగ్గ రీతిలో జీవించడం (2022)
- ప్లాస్టిక్ పొల్యూషన్‌కు పరిష్కారాలేమిటి (2023)
- నేలను యథాస్థితికి తేవడం, ఎడారీకరణ, కరువులను నియంత్రించడం (2024),
- ప్లాస్టిక్ కాలుష్యానికి చరమ గీతం (2025)

పర్యావరణ సాహిత్యం, పర్యావరణ రచనలు గురించి మరింత మాట్లాడే ముందు మరికొన్ని స్థూలమైన సాహిత్య, సామాజిక సంగతులను చర్చించుకోవాలి. ఏదన్నా ఒక సమస్య జటిలమై పెద్ద అవరోధంగా మారినపుడు మాత్రమే దాని గురించి మరింత అధ్యయనం, పరిష్కార దిశగా అన్వేషణ మొదలు పెట్టడం మానవ నైజం. ఈ క్రమంలోనే ఆయా భావనలకు నామకరణాలు జరగడమే కాక, కొత్తగా అధ్యయనాంశాలు కూడా ఏర్పడతాయి. అంత మాత్రాన ఆ సమస్య అంతకుముందు లేదని ఎంత మాత్రమూ పరిగణించకూడదు. భవిష్యత్ దృష్టి వుండి, నిశితమైన సమాజ పరిశీలన చేయగలిగిన దార్శనికులైన వారు కొందరైనా తమ వైతాళిక గానాన్ని వినిపిస్తారు.

రెండేళ్ల క్రితం హైదరాబాదు నగరంలో వీధి కుక్క వాతపడి ఓ బాలుడు మరణించిన విషయం మనకు తెలిసినదే. ఈ సంఘటనను సందర్భంగా తీసుకుని ఢిల్లీ, కలకత్తా వంటి నగరాల నుంచి వెలువడే 'ది పయనీర్' అనే ఆంగ్లపత్రిక మనిషి – జంతువు పెనుగులాటగా లోతైన విశ్లేషణను సంపాదకీయంగా రాసింది. అంత క్రితం ఎప్పుడూ కుక్కలు బాలుణ్ణి చంపడం అనే విపరీత పరిస్థితిని మనం చూడలేదు, వినలేదు. 1923 ఫిబ్రవరి 8వ తేదీన ఘాజియాబాద్ కోర్టు భవనం మొదటి అంతస్తులో చిరుత ప్రవేశించి కలకలం రేపింది. తిరుమల కొండలలో, సింహాచలం కొండదారులలో పులుల వార్తలను మనం అపుడపుడు చూస్తుంటాం కానీ, ఇలాంటివి తరచు తారసపడవు. కొన్ని సంవత్సరాల క్రితం అస్సాం లోని కాజీరంగా నేషనల్ పార్క్ లో ఏనుగులు వెంటపడి కొందరిని చంపడం, మానవ దేహపు భాగాలను అవి తినడం పెద్ద ఎత్తున చర్చ అయింది. మందపు చర్మం గల జంతువులలో కొన్ని ఖనిజ ధాతువులు లోపిస్తే కొన్ని విపరీత పోకడలు వస్తాయని అప్పట్లో వివరించబడింది. ఇలాంటి ఉదాహరణలు మనదేశం నుంచే బోలెడు ఇవ్వవచ్చు.

ఐఐటి కాన్పూరులో మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన అనిల్ అగ్రవాల్ తరువాతి కాలంలో పర్యావరణ ఉద్యమ శీలిగా మారి 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్' అనే సంస్థను ప్రారంభించారు. అక్వావాటర్ గురించి, కూల్డ్రింకుల గురించి పెద్ద ఎత్తున భారతీయ సమాజాన్ని అప్రమత్తం చేసింది కూడా వీరే. ఈ సంస్థ 'డౌన్ టు ఎర్త్' పేరున ఒక ఆంగ్ల పక్ష పత్రికను కూడా 1992 నుంచి నిర్వహిస్తోంది. తొలి దశలో ఈ పత్రికను 'ఫోర్ట్ నైట్లీ ఆన్ సైన్స్ అండ్ ఎన్విరాన్ మెంట్' గా ప్రకటించుకునేవారు. అయితే ఇటీవల సంవత్సరాలలో దానిని 'ఫోర్ట్ నైట్లీ ఆన్ పాలిటిక్స్ ఆఫ్ డెవలప్ మెంట్ అండ్ హెల్త్'గా మార్చారు. ఈ మారిన వివరణ విస్తృతమైన పర్యావరణ దృష్టిని విపులీకరిస్తుంది!

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e:venunagasuri@gmail.com



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగాతో లభించే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడానికి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోనున్నారు.

యోగాతో పొందే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం గురించి అవగాహన పెంచడం ఈ రోజు లక్ష్యం. "యోగం" అనే పదం సంస్కృత మూలం "యుజ్" నుండి వచ్చింది. దీని అర్థం "చేరడం," "కలయిక", లేదా "ఏకం చేయడం". మనస్సు - శరీరం, లేదా ఆలోచనలు - చర్యలు. సంయమనం- సంతృప్తి. మానవులు - ప్రకృతి మధ్య సామరస్యాన్ని యోగా ప్రతిబింబిస్తుంది. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు. శ్వాస వ్యాయామాలు కూడా ఉంటాయి. ఇది ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడానికి సహాయపడుతాయి.




### అంతర్జాతీయ యోగా దినోత్సవం చరిత్ర

యోగా మూలం పురాతన భారతదేశం నుండి ఉన్నప్పటికీ, సెప్టెంబర్ 2014లో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. యూఎన్జీఏ 69వ సెషన్లో ప్రధాని ప్రసంగిస్తూ యోగా మన ప్రాచీన సంప్రదాయం నుంచి మనకు లభించిన అమూల్యమైన కానుక అని అన్నారు. 'మనస్సు, శరీరం, ఆలోచన, కార్యాచరణల ఐక్యతను యోగ ప్రతిబింబిస్తుంది. యోగా (yoga) అనేది ఒక సంపూర్ణ జీవన విధానం. అది మన ఆరోగ్యానికి, మన శ్రేయస్సుకు చాలా అవసరమైనది. యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదు. ఇది మీతో, ప్రపంచంతో, ప్రకృతితో ఏకత్వ భావనను కనుగొనడానికి ఒక మార్గం" అని మోదీ వివరించారు. ఆ తరువాత, యుఎన్జిఎ 2014 డిసెంబర్ 11న జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది.

### 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్

ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా

ఆరోగ్యకరమైన ప్రపంచ జనాభా కోసం భారతదేశం యొక్క దార్శనికతను తన నెలవారీ "మన్ కీ బాత్" రేడియో ప్రసారంలో పంచుకుంటూ, మోడీ మాట్లాడుతూ, "2025 యోగా దినోత్సవం యొక్క ఇతివృత్తం 'ఒక భూమి కోసం యోగా, ఒక ఆరోగ్యం' అని ఉంచబడింది. అంటే, యోగా ద్వారా మొత్తం ప్రపంచాన్ని ఆరోగ్యంగా మార్చాలని మేము కోరుకుంటున్నాము."

- కె. సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com

# ఉర్దూ మన భాషే

హృదయం నుంచి వచ్చే భాష ఉర్దూ. అందుకే అది మధురంగా వుంటుంది. మామిడి పండు రసంలా, ఖర్జూరంలా, పాల సపోటాలా వుంటుంది. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ సంస్కృతి. మన దేశంలో కొన్ని వందల భాషలు వున్నాయి. అయితే అన్నింటిని రాజ్యాంగంలోని షెడ్యూలులో చేర్చలేదు. మన సాంస్కృతిక వారసత్వం మన భాషల ద్వారా లభించింది. మన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలు రెండు. అవి సంస్కృతం, ఉర్దూ. అన్ని భాషల్లోనూ గొప్ప సాహిత్యం వున్నప్పటికీ ఈ రెండు భాషల్లో గొప్ప సాహిత్యం వచ్చింది. మిగతా భాషలని కించపరచడానికి ఈ మాటలను అనడం లేదు. ఈ భాషల్లో వున్న గొప్పతనాన్ని గమనించాలని అంటున్నాను.




సంస్కృతం హిందువులకి సంబంధించినదని, ఉర్దూ భాష ముస్లింలకి సంబంధించిన భాష అని చాలా మంది భావన. ఉర్దూ దేశీయ భాష కాదని అన్యదేశీయ భాష అని చాలా మంది భావన. ఈ రెండు భావనలు సరైనవి కాదు. సంస్కృతంలో ఎక్కువ పూజలు, పునస్కారాలు వుండటం వల్ల అది హిందువుల భాష అని, ఉర్దూ భాష లిపిని చూసి అన్య భాష అని చాలా మంది అనుకుంటున్నారు. కాని అది వాస్తవం కాదు. నిజానికి మనదేశంలో ప్రవహిస్తున్నది సంస్కృత ఉర్దూ వారసత్వం.

దేశంలో నెలకొని ఉన్న పరిస్థితుల వల్ల మైసూర్ పాక్ మైసూర్‌శ్రీగా మారిపోయింది. కరాచీ బేకరీ మరీ నీలోఫర్ హొటల్ మీద సింద్ క్లాత్ స్టోర్ మీద అసహనం పెరిగిపోయింది. ఆ కోవలోకి చెందినదే ఉర్దూ భాష కూడా.

మార్పు అనేది ఎప్పుడూ జరుగుతూ వుంటుంది. కానీ భాషలకు అది వర్తిస్తుందా? ఐడెంటిటీ రాజకీయాలు వెళ్లూను కొన్న తరుణంలో భాష కూడా బాధితురాలు అవుతుంది. అలాంటి పరిస్థితి ఉర్దూ భాషకి ఏర్పడింది. అది సుప్రీంకోర్టు దాకా పోయింది. మహారాష్ట్రలో ఉర్దూని అదనపు అధికార భాషగా గుర్తించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. భారత దేశంలో ఆ భాష సాంస్కృతిక ప్రాముఖ్యతని, చట్టపరమైన స్థానాన్ని సుప్రీంకోర్టు హైలైట్ చేసింది.

**ఈ కేసులో ఎవరు వున్నారు?**

వర్షతై వర్సెస్ ది స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు ద్వారా సుప్రీంకోర్టు ఉర్దూ భాష ప్రాముఖ్యతని నొక్కి చెప్పింది. మహారాష్ట్రలో మరాఠీతో బాటూ సైన్ బోర్డులపై ఉర్దూనూ చేర్చాలనే నిర్ణయాన్ని శ్రీమతి వర్షతై బోగాడే సుప్రీంకోర్టులో అప్పీలు ద్వారా సవాలు చేశారు. సైన్ బోర్డులపై మరాఠీతో బాటూ ఉర్దూను ఉపయోగించడాన్ని మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. శ్రీమతి వర్షతై బోగాడే దీనికి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అభ్యంతరాన్ని మొదట కలెక్టర్‌కి ఆ తరువాత డివిజనల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. అక్కడ ఆమెకు సరైన స్పందన రాకపోవడంతో బొంబై హైకోర్టులో సవాలు చేశారు. అక్కడ ఆమెకు అనుకున్న ఉపశమనం లభించలేదు. ఆ ఫలితంతో అసంతృప్తి చెందిన ఆమె ఈ విషయాన్ని అప్పీలు ద్వారా సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

**కోర్టుల్లో ఉర్దూ ప్రభావం**

ఇదిలా వుంటే – ఉర్దూ ప్రభావం కోర్టుల మీద ఎలా వుందో చూద్దాం. మనదేశంలోని క్రిమినల్, సివిల్ చట్టాలలో ఉపయోగించే కోర్టు పరిభాష మీద ఉర్దూ గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులలో ఇంగ్లీషు అధికార భాష అయినప్పటికీ, కోర్టు కారిడార్లలో ఉర్దూ భాష పరిఢ విల్లుతుంది. అదాలత్, వకాలత్‌నామా, అలఫ్‌నామా, ముద్రిమ్, నజారీత్ లాంటి అనేక పదాలు సర్వ సాధారణంగా ఉపయోగించ బడుతున్నాయి.

మహారాష్ట్రలోని హతూర్‌కి చెందిన మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం వివాదానికి దారితీసింది. కమ్యూనికేషన్ కోసం తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా మారిపోయింది. సైన్ బోర్డులపై ఉర్దూ వాడకం చట్టవిరుద్ధమని వర్షతై వాదన. ఇలాంటి విషయాల మీద అభ్యంతరాలు శ్రీమతి వర్షతై బోగాడే చేయడానికి వీల్లేదు. అభ్యంతరం చేసే అధికారం వున్న వ్యక్తి కమీషనర్ మాత్రమే. అయినప్పటికీ సుప్రీంకోర్టు ఈ విషయాన్ని కేసు మెరిట్స్‌ని బట్టి శిక్ష తన నిర్ణయాన్ని ప్రకటించింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుధాంషు ధులియా, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం చట్టపరమైన తీర్పు

కన్నా మించిన తీర్పుని ప్రకటించింది. భాష మరియు మతం అనేవి సంబంధంలేనివి. సమాంతరమైనవి. సాంస్కృతిక గుర్తింపు, ప్రాంతాల గుర్తింపులతో ప్రజలతో ముడిపడి వున్నది భాష అని సుప్రీంకోర్టు ధర్మాసనం భాషాపరమైన మేనిఫెస్టోని రాశారు.

'భాష అనేది ఒక సంస్కృతి. సమాజం, ప్రజల నాగరికతని కొలవడానికి కొలమానం భాష. ఉర్దూ భాష కూడా అలాంటిది. ఇది గంగా జమునా తహాజీబ్‌లకి ఒక ఉత్తమ కాలమానం. మధ్య భారతదేశం, ఉత్తర భారతదేశంలని కలిపే హిందూస్తానీ తహజీబ్ అని కోర్టు పేర్కొంది. ఉర్దూ, హిందీ మిశ్రమమే హిందుస్తానీ అని తీర్పు స్పష్టం చేసింది. మన దేశ విభజన కారణంగా ఉర్దూ అనేది ముస్లింల భాషగా, హిందీ అనేది హిందువుల భాషగా పరిణమించింది. ఉర్దూని అధికార భాషగా భారత రాజ్యాంగం గుర్తించిందని, అది షెడ్యూలు-7లో తన స్థానాన్ని ఆక్రమించిందని, అది మరాఠీతో సమానమైన స్థానాన్ని పొందిందని అది ఏ భాషకు తక్కువ ఎక్కువ కాదనీ సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.




ఉర్దూ భాషపట్ల దాని లిపి వల్ల ప్రిజుడిసిస్ ఏర్పడుతున్నాయి. అది భారతదేశానికి పరాయిది అన్న భావన దాని వల్ల ఏర్పడుతుంది. వాస్తవానికి హిందీ, మరాఠీ భాషల మాదిరిగా అది భారతదేశంలో ఉద్భవించిన ప్రజల మధ్య కమ్యూనికేషన్ సాధనంగా అభివృద్ధి చెందింది. చివరికి అనేక మంది ప్రఖ్యాత కవులకి ఇష్టమైన భాషగా మారిపోయింది.

ప్రేమతో మాట్లాడే వ్యక్తుల నాలుకల మీద ఉర్దూ భాష నడయాడుతుంది. మనకు తెలియకుండానే ఉర్దూ మన దిన చర్యలో భాగంగా మారి పోయింది. మన సంభాషణల్లో ఆ భాష దొర్లుతూనే వుంది. దాన్ని వేరు చేయడం కష్టమైన పని.

హిందీని జాతీయ భాషగా గట్టిగా సమర్థించే హిందీ పండితుడు రామ్ విలాస్ శర్మ కూడా తన 'భారత్‌కీ భాషా సమస్య' అన్న పుస్తకంలో ఇలా వ్రాశాడు.

'హిందీ ఉర్దూ అనేవి రెండు వేరు వేరు భాషలు కావు. అవి ప్రాథమికంగా ఒక్కటే. వాటి సర్వనామాలు, క్రియలు, ప్రాథమిక పదజాలం ఒకే విధంగా వుంటాయి. ప్రపంచంలో సర్వనామాలు, క్రియలు వందశాతం ఒకే విధంగా వుండే ఇతర భాషలు లేవు. రష్యన్, ఉక్రేయిన్ భాషలు ఒకే విధంగా వుంటాయి. కానీ హిందీ ఉర్దూ మాదిరిగా దగ్గరగా వుండవు.'


సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలోని ముఖ్య స్తంభం అయిన లౌకికవాదాన్ని సమర్థిస్తుంది. బహుళ భాషలను వాడటం వల్ల రాష్ట్ర గుర్తింపు పోదు. సైన్ బోర్డులలో ఉర్దూను వాడటం ధిక్కార చర్య కాదని అది సర్దుబాటు చర్య అని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

హిందీ, మరాఠీ మాదిరిగానే ఉర్దూ అనే భారతదేశ ఫ్యాబ్రిక్‌లో అల్లుకొని పోయిందని, భారతదేశం అంతటా ఉపయోగించే అనేక రోజువారీ వ్యక్తీకరణలు. ఉర్దూమూల పదాలను కలిగి వుంటాయి. భాషా హమేలనను సమర్థించటం ఈ తీర్పులోని విశేషం. భాష మతాలకు సంబంధించినది కాదు. సమాజానికి సంబంధించినది. భారత దేశంలోని భాషలన్నింటిని ప్రేమించాలి. గౌరవించాలి. ఉత్సవం మాదిరిగా జరుపుకోవాలి. రాజకీయం చేయకూడదు. యాసను కూడా గేలిచేయకూడదు.

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు మనకి ఒక రిమైండర్ మాదిరిగా ఉపయోగపడుతుంది. కొత్త భాష ద్వారా మాట్లాడటం చదవడం మాత్రమే కాదు విశాల దృక్పథం, సహనం ఏర్పడుతాయి.

ఉర్దూ ప్రేమ కలిగిన భాష
ప్రేమించాల్సిన భాష.

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com





చాడ పురావస్తు తవ్వకాలు



భీమేశ్వరుని గుడి ఇసికెపునాది

# కొత్త బౌద్ధక్షేత్రం చాడ

చాడ యాదగిరి-భువనగిరి జిల్లా మూటకోదూరు మండలంలోని ప్రాచీన గ్రామం. హైద్రాబాద్ నుంచి 74 కి.మీ.లు, భువనగిరి నుంచి 32 కి.మీ.ల దూరంలో ఉన్నది చాడ గ్రామం.

తెలంగాణాలో మిగతా జిల్లాలన్నింటి కంటె ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బౌద్ధం ఎక్కువచోట్ల విస్తరించింది. ఫణిగిరి, గాజులబండ, తిర్మలగిరి, నాగారం, వర్ధమానుకోట, ఇంద్రపాలనగరం, తుమ్మల గూడెం, నాగారం, అరవపల్లి, గోపులాయపల్లి, నాగార్జునసాగర్, ఏలేశ్వరం, రఘునాథపురం, చాడ గ్రామాలలో బౌద్ధం ఆనవాళ్ళున్నాయి. యాదగిరి-భువనగిరి జిల్లాలో గోదావరి ఉపనది మానేరు నుండి పారిన చిన్ననదులలో భిక్కేరు ఒకటి. ఇది యాదగిరి-భువనగిరి జిల్లా జిల్లాలో గంధమల్ల నుండి ప్రవహిస్తూ వచ్చి కొలనుపాక వద్ద వరంగల్ జిల్లా నుండి పారే మరొకనీటి పాయను కలుపుకుని ఆలేరు నుండి భిక్కేరై ప్రవహిస్తుంది. దీనిలోకి ఉత్తర వాహినిగా వచ్చి కలిసే చిన్న నది పాయ (దాన్నికూడా భిక్కేరనే పిలుస్తారు) ఒడ్డున చాడ అనే ప్రాచీనగ్రామం వుంది.



చాడ బుద్ధుడు

15 సం.రాల కింద, 10.06.2010న గాంధారశైలిలో చెక్కిన శిథిల బుద్ధవిగ్రహం చాడ గ్రామంలోని బౌద్ధస్తూపం ఆనవాళ్ళలో లభించింది. పాదాల వరకు విరిగిన గాంధారశైలి స్థానక బుద్ధుని విగ్రహం సాతవాహనుల కాలంనాటిదని చరిత్రకారుల అభిప్రాయం.

బుద్ధుని శిల్పంతో పాటు దొరికిన మరొక విగ్రహం గ్రానైట్ రాయిలో చెక్కబడ్డది. గతంలో ఈ శిల్పాన్నే సిగ, చేతిలో కత్తి కనిపించడం వల్ల చాముండి శిల్పంగా భావించడం జరిగింది. కాని, ఇది స్త్రీ శిల్పం కాదు. ఈ శిల్పంలో పురుషుడు ఎడమవైపు కొప్పుతో, అర్ధపద్మాసనంలో కూర్చుని కనిపిస్తున్నాడు. పెద్దచెవులకు కుండలాలు, కంఠంపైన త్రివళితాలున్నాయి. అతని మెడలో కంటె ఉన్నది. కుడిచేతిలో కత్తి, ఎడమచేయి విరిగిపోయింది, డాలు ఆనవాలు కనిపిస్తున్నది. కత్తి, డాలు పరికరాలుగా వున్న శిల్పం వీరభద్రునిదనవచ్చు. కాని, కొలనుపాకలో కనిపించిన ఇటువంటి శిల్పాలతో పోల్చినపుడు ఈ శిల్పం కళ్యాణీ చాళుక్యుల పాలనా కాలం తొలినాళ్ళదైన, పూజనీయమైన ఒక రాచప్రతిమ అనిపిస్తున్నది.

పదేండ్ల కింద మా కొత్త తెలంగాణ చరిత్రబృందం ఈ ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ పడివున్న బౌద్ధ స్తూపావశేషాల గురించి రాయడం జరిగింది. బౌద్ధక్షేత్రం గురించి వారసత్వశాఖవారికి, బుద్ధవనం ప్రాజెక్టు నిర్వాహకులకు తెలిపింది. ఏదయితేనేం తెలంగాణ వారసత్వశాఖ భారత పురావస్తుశాఖ అనుమతితో ఇక్కడ గతసంవత్సరం నుంచి తవ్వకాలు మొదలుపెట్టింది. ఈ సంవత్సరం కూడా అక్కడే తవ్వకాలు జరుపుతున్నది.

కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ చాడను సందర్శించినపుడు చారిత్రక ప్రాధాన్యతకల అంశాలు లభించాయి. అక్కడికి అల్లంత దూరంలో భిక్కేరు ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్నది. బౌద్ధభిక్షువుల కారణంగానే ఈ వాగుకు భిక్కేరనే పేరొచ్చింది. ఆలేరువాగును కూడా భిక్కేరనే పిలుస్తారు. చాడవాగు ఆలేరువాగులో కలుస్తుంది. చైతన్యపురి, ఫణిగిరి, వలిగొండ నాగారం, కోటిలింగాల, ధూళికట్ట,


భీమన్న గుడి


భీమేశ్వరాలయం


చాళుక్య శాసనం


గుడి మంటపం

నాగార్జునసాగర్, రఘునాథపురం, తిర్మలగిరి వంటి గ్రామాలలో నదులు ఉత్తరవాహినులైన చోట్లలో బౌద్ధం ఆనవాళ్ళుండడం గమనార్హం. చాడలో బౌద్ధస్థూపం దాదాపు 6 ఎకరాల భూమిలో విస్తరించిన ఆనవాళ్ళు కనిపించాయి.

శాతవాహనుల కాలంనాటి ఇటుకలు రాసులుగా పడివున్నాయి. వాటినే గ్రామస్తులు ఇళ్ళకు, మసీదుకు, ఇతర కట్టడాలకు వాడుకున్నారు. స్థూపఫలకాల ముక్కలు కొన్ని అక్కడే పొలాల్లో దొరుకుతున్నాయి. చాలా వరకు ఇండ్లల్లో వాడుకకు తీసుకుని పోయినారని తెలిసింది. ఒకనాటి అమరావతి స్థూపం కథే ఇక్కడ పునరావృత్తమైంది. ఒకరి ఇంటి అరుగుగా వాడుకోబడుతున్న పాలరాతి స్తంభం ఒకటి కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి కనిపించింది.


భీమన్న లింగం

కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి స్థూపం ఆనవాళ్ళున్న చోట బుద్ధుని పాదాల వరకు విరిగిన రెండు పాదపీఠాలు అగుపించాయి. అంటే అక్కడ రెండు బుద్ధవిగ్రహాలు లభించి వుండాలి. చైత్యాలు ఒకటికంటె ఎక్కువగా వుండి వుంటాయన్నది నిజం. చారిత్రక పరిశోధకులు డి.సూర్యకుమార్ గారు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. చాలా పెద్ద విస్తీర్ణంలో స్తూపం, ఎన్నో చైత్యాలు, విహారాలు అక్కడ వుండి వుంటాయి. బౌద్ధులకు ప్రధాన స్థావరమై వుంటుందనిపిస్తున్నది. విరిగిపడివున్న స్థూప ఫలకాలలో చక్కని డిజైను, శిల్పం వుంది. ఒక చోట చైత్యం గోడముక్క వుంది. కొన్ని ఇటుకల మీద లిపి గుర్తులున్నాయి. నల్లని, ఎర్రని, బూడిదరంగు పెంకులు, మట్టిపాత్రల అడుగులు విస్తారంగా లభిస్తున్నాయి. చాడలో హీనయాన, మహాయాన, వజ్రయానాలు పరిఢవిల్లి వుంటాయని కచ్చితంగా నమ్ముతున్నా మన్నారు పరిశోధకులు.

**చాడ బౌద్ధస్తూప శాసనం:**

గత సంవత్సరం మొదటిసారి తవ్వకాలలో ఇక్కడ ఎన్నో బౌద్ధస్తూపపు ఆనవాళ్ళు, విహారాల జాడలు, పురావస్తువులు, ఒక రెండు పంక్తుల బ్రాహ్మీలిపి శాసనం బయటపడ్డాయి. ఈ శాసనం బౌద్ధ స్తూపానికి చేసిన దానశాసనం.

**ఈ శాసనపాఠం...**

*“సధిరికస పతున నవకామికస గీమ20 7 సా(వ) దేయధమో పతో పతిశాపితో అతఖర*

*భాణకస బోధికతె పుతస ధి.సహచ సవేహిస బ్రహ్మచారిహిస”*

సధిరిక అనే పట్టణంలో గ్రీష్మరుతువులో 27వ రోజు భాణకుడు బోధికుడు బ్రహ్మచారియైన తన పుత్రుడు ధీ.సహ నవకార్మికుడు (ఆర్కిటెక్ట, స్థపతి)తో దేయధమో (బౌద్ధ)ధర్మ నిర్మాణ ప్రతిష్ఠాపన చేయించాడు.

శాసనంలో ‘సధిరిక’ పట్టణానికి ఇప్పటి పేరు చాడ. సధిరిక అనే పేరు కాలక్రమంలో చాడగా మారిందని తెలుస్తున్నది. శాసనాన్నిబట్టి ఈ నగరం ఉనికి రెండువేల కిందటనే ఉందన్నమాట. ఈ పట్టణంలో బౌద్ధనిర్మాణాలు ఎన్నో చేయబడ్డాయి. అందులో ఒక నిర్మాణానికి నవకార్మికుడు(ఆర్కిటెక్టు) నిర్వహణలో బౌద్ధ ధర్మగ్రంథాలైన త్రిపిటకాలను కంఠోపాఠంగా చెప్పే బోధకుడైన భాణకుడు ‘భోధికుడు’ బ్రహ్మచర్యం అవలంబించి భిక్షుకుడైన తన కొడుకు ‘ధి.సహ’తో కలిసి గ్రీష్మరుతువులోని 27వ దినాన బౌద్ధ దేయధమ్మకు ప్రతిష్ఠాపన చేసాడు. భాణకుడు అనే మాట శాసనాలలో ఇదే మొదటిసారి కాకపోవచ్చు.

కొత్త తెలంగాణచరిత్రబృందం పురావస్తుశాఖ తవ్వకాలను సందర్శించినపుడు ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ వారసత్వశాఖ రెండో సీజన్ తవ్వకాలలో సాతవాహన, ఇక్ష్వాకుల కాలాలనాటి నాణాలు, గాంధారశైలిలో బుద్ధవిగ్రహాలు పదులసంఖ్యలో లభించాయి. దంతపుగాజుల ముక్కలు, వందలాది సాతవాహన కాలపు డిజైన్ల ఎరుపురంగు కుండపెంకులు, సాతవాహనకాలపు ఇటికెలు, పదులకొద్ది బౌద్ధవిహారాల ఇటికెగోడల నిర్మాణాలు, చైత్యం జాడలు వెలుగుచూడడం గమనించింది.

తెలంగాణాలోని బౌద్ధక్షేత్రాలలో చాడ బౌద్ధవిహారం విశిష్టమైనదిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

**చాడలో రాష్ట్రకూటులనాటి శివాలయం :**

చాడగ్రామంలో పురాతన భీమేశ్వర శివాలయం, దానికి అనుబంధంగా భీమన్న(మెట్ల)బావి వున్నాయి. అమ్మదేవతల గుడులున్నాయి.



కలశం



గజలక్ష్మి



బౌద్ధస్తూప అవశేషాలు



రాష్ట్రకూట శైలి స్తంభం

గ్రామంలో భీమేశ్వరాలయం వుంది. ఆలయ మంటప స్తంభాలు రాష్ట్రకూటశైలిలో వున్నాయి. రెండు గుడులు, వాటి ద్వారబంధాల మీద గజలక్ష్మి, గణపతి లలాటబింబాలున్నాయి. ఒక ద్వారబంధం మీద ద్వారపాలకులు లేరు, పూర్ణకుంభంవంటి కలశాలున్నాయి. గుడిలో, బయట మొత్తం నాలుగు నందులున్నాయి. ఒకటి రాష్ట్రకూటశైలికి చెందింది. మిగిలినవి కళ్యాణీచాళుక్యుల కాలంనాటివి. శివాలయం గర్భగుడిలో అడుగు ఎత్తు ఉన్న చతురస్రాకార పానవట్టంలో అడుగు ఎత్తున్న శివలింగం వుంది. మరొకగుడిలో వీరభద్రుడు షడ్భుజుడు. ఖడ్గం, డాలు, బాణం, విల్లు, త్రిశూలం, డమరుకాలు ధరించి కరండమకుటంతో, కాళ్ళకు ఎత్తుపావుకోళ్ళతో, వితస్తపాద భంగిమలో నిల్చునివున్నాడు. త్రికోణ శీర్షతోరణంతో చెక్కిన ఈ శిల్పంలో వీరభద్రునికి కుడిపక్కన మేషముఖంతో దక్షుడు, ఎడమవైపు చామరధారిణి నిల్చునివున్నారు. ఇటువంటి వీరభద్రుడు ఈ జిల్లాలోని పాముకుంట శివాలయంలో కూడా వున్నాడు. గుడుల లోకప్పులలో రెండు ఒకటి షట్కోణ యంత్రంలో పుష్పం, మరొకటి సహస్రదళపుష్పం భువనశిల్పాలుగా వున్నాయి. దేవాలయ ప్రాంగణంలో రాష్ట్రకూటశైలి చతుర్భుజ, కట్యావలంబిత విష్ణుమూర్తి విగ్రహం, చాళుక్యశైలి వల్లీసమేత సుబ్రహ్మణ్యుని శిథిల శిల్పం, పరశువు, అంకుశం, దంతం, కుడుములను ధరించి, లలితాసనంలో, వక్షబంధంతో చతుర్భుజుడైన గణపతి శిల్పం, భైరవుడు, నాగశిలలు, వీరశిలలున్నాయి. హనుమంతుడు, గరుడాళ్వారు కూటము కూడా వున్నారు. (ఇవన్నీ గుడి పునరుద్ధరణకు ముందు కనిపించినవి. ఇపుడవన్ని వేర్వేరు స్థానాలకు తరలించబడ్డాయి.) గతంతో ఇక్కడ పూజారులుగా తమ్మళివారుండేవారు.

ఈ భీమేశ్వరాలయాన్ని కొన్నేండ్ల క్రితం అంటే పదేండ్ల కింద పునర్నిర్మాణం చేసారు. గుడిని విప్పి, పునాదులను సవరిస్తున్నపుడు మా చరిత్రబృందం వెళ్ళి చూసింది. పునాదిలో అంతా ఇసికె వుంది. అక్కడున్న మేస్త్రీలను అడిగితే గుడిగోడలను తీసి చూసినపుడే అడుగున ఇసికెపునాదులున్నాయని చెప్పారు. అంటే రాష్ట్రకూటుల కాలంలోనే (8,9వ శ.) 'సాండ్ బాక్స్' టెక్నాలజీ వుందని, ఇపుడు చెప్పుకుంటున్నట్టు కాకతీయులదే ఈ నైపుణ్యం అనేమాట పాతబడిపోతుంది.

**చాడ మల్లేశ్వరదేవుని శాసనం:**

ఈ వూరిలోనే లభించిన కళ్యాణీచాళుక్య పాలకుల శాసనం (నల్లగొండ జిల్లా శాసన సంపుటి, శా.సం.17, పేజి.46–51)లోని 77వ పంక్తిలో గ్రామం పేరు 'చిడెయ'గా పేర్కొనబడ్డది.

ఈ తెలుగన్నడ లిపి, కన్నడ భాష, 120 పంక్తుల శాసనం త్రిభువనమల్లదేవ 6వ విక్రమాదిత్యుని కాలంలో క్రీ.శ.1081 డిసెంబరు 24న వేయబడ్డది. ఈతని సామంతుడు కామభూపుడు, ఉత్కళ, కేరళ, ద్రవిడ, మాగధ రాజులనెందరినో గెలిచినవాడు, చక్రవర్తి నుంచి కొల్లిపాక-7000ల నాడు సామంత్రప్రభుత్వాన్ని తామ్రశాసనం ద్వారా పొందినాడు. మహామండలేశ్వర కుమార కామరస మానుగల్లు గ్రామాన్ని త్రిభోగాభ్యంతరసిద్ధిగా, సర్వనమస్యంగా 'చిడెయ' మల్లేశ్వరదేవునికి ఉత్తరాయణ సంక్రాంతి పర్వదిన సందర్భంగా దానం చేస్తూ శాసనం వేయించాడు. ఈ దేవాలయాన్ని ఖండస్ఫుటిత నవసుధాకర్మ (కొత్తసున్నం కొట్టించడానికి), మల్లేశ్వరదేవర అంగభోగ, రంగభోగాలకు, (శైవమతంలోని) తపోధనులు, విద్యార్థుల కొరకు ఈ దానాన్ని శ్రీకాంతపండితునికి ధారాదత్తం చేసాడు.



చాళుక్యశైలి నంది



చాళుక్యశైలి గణపతి



చాడ విష్ణువు



వల్లిసమేత సుబ్రహ్మణ్యం




వీరగల్లులు



వీరభద్ర


చాడ పాటిగడ్డ మీద జాస్పర్ పూస


అమ్మవారు


గణపతి లలాటబింబం


గజలక్ష్మి

దానం చేసిన గ్రామం సరిహద్దులుగా తూర్పున పల్లేరు, దక్షిణాన వేముల, పడుమట మొగిలిపాక, ఉత్తరాన నేత్రకల్లు లున్నాయి. ఇవన్నీ ఆలేటి కంపణం-40లోనివే.

**చాడ భీమన్నబావి శాసనం:**

45 సం.రాల క్రితం నేనా గ్రామంలో టీచర్‌గా పని చేస్తున్నపుడు భీమేశ్వరాలయం పక్కనున్న భీమన్నబాయి మెట్లగోడకు చెక్కివున్న శాసనాన్ని మద్రాసు నుంచి వచ్చిన ఒక ఎస్టాంపేజ్ టెక్నీషియన్ అచ్చు తీసుకుని వెళ్ళాడు. ఆ సమయంలో అతన్ని కలిసి, ఎట్లా అచ్చుతీసారో, శాసనాలు అచ్చుతీయడానికి ఏం వాడుతారో అడిగి తెలుసుకుని నా జేబులోని పాకెట్ నోట్ బుక్‌లో రాని పెట్టుకున్నాను. కాని, ఈ శాసనం నల్లగొండ శాసనసంపుటాల్లో కనిపించలేదు. రెండుసార్లు ఈ శాసనాన్ని అచ్చుతీసి చదివే ప్రయత్నం చేసాను నేను. కాని, సంపూర్ణంగా చదువడానికి వీలులేకుండా పోయింది.


చరిత్ర బృందం సందర్శన

17, 18వ శతాబ్దాల తెలుగు లిపిలో, తెలుగు భాషలో ఉన్న భీమన్నబావి శాసనాన్ని చదివినంతవరకు శాసనపాఠం

1. .........సం. చైత్ర... 21......ఇ.........స్నన..
2. ద్బం ధీపారాధన మొదలై..దుత్సవంలకు ధావితా..త
3. లచ్చారెడ్డి తవ్వించిన మంచినూతి .... సందిసెభానం ..
4. శ్రరష్మిమంచిన దాత తీర్థంనిప్పించ చేశినార.. తం ప్రమ
5. గాన 10న త్రి.. తవల్లింద్ర..... యె.... ఆధ... అసిబార..
6. మసర.... చౌకం ॥యే భూమి లంపలత................
7. పరతంని...దంత..రా...సదరంతం ఆలయుత్తి అ
8. ..................... యిందుకు పొలంకుంట ముందర
9. ల యిచె... రసముద్రం..20తవతుకు
10. .............................. పథియిమం

10 పంక్తుల ఈ శాసనంవల్ల లచ్చారెడ్డి అనే పెద్దమనిషి గ్రామంలో జరిగే దీపారాధన ఉత్సవం(జాతర)లో ప్రజల కొరకు మంచినీటి నూతిని తవ్వించినాడని, దాని పొలంకుంట ముందర భూమిని, ...సముద్రం అనే చెరువు కింద 20..ల భూమినిచ్చాడని తెలుస్తున్నది.


**పోస్టు స్క్రిప్టు:**

ఈవూర్లో నేను 1979 ఆగష్టు నుంచి 1980 జులై దాక 11నెలలు టీచరు (గ్రేడ్ 2తెలుగు పండిట్)గా పనిచేసాను. అపుడు చాడ వాగు ఒడ్డున షడ్భుజాకారపు బావిని చూసాను. కాని ఇపుడది సిమెంటు ఒరల బావిగా మారిపోయింది. పాత ఆనవాళ్ళు లేవు. అది బౌద్ధారామాలకు చెందిన నుయ్యి కావచ్చు.

**ధన్యవాదాలు:**

ఈ అన్వేషణలో పూనా దక్కన్ కాలేజి ప్రొఫెసర్ శ్రీకాంత్ ఘన్వీర్, తెలంగాణ వారసత్వశాఖ అధికారులు జి.నాగరాజు, సాగర్, టెక్నికల్ అసిస్టెంట్స్, మా చరిత్రబృందం చరిత్రకారులు బీవీ భద్రగిరీశ్, వేముగంటి మురళీకృష్ణ, సభ్యులు చంటి, కుండె గణేశ్, ముడావత్ రవీందర్, ఎండి ఇమ్రాన్, చాడ గ్రామం ఉపాధ్యాయుడు తిరునగరి దామోదరస్వామి, ప్రతాపరెడ్డి, భూమయ్య, పత్రికా విలేకరి చకిలం సురేందర్ రావు, సహకరించారు.

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com


బౌద్ధస్తూప శాసనం


భీమన్న బాయి శాసనం



# మ్యూజియంలపై అవగాహన తప్పనిసరి

## డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు, హైదరాబాద్ చైర్మన్ వేదకుమార్ మణికొండ

అంతర్జాతీయ స్థాయిలో, సమాజ అభివృద్ధిలో మ్యూజియంల పాత్రపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర హెరిటేజ్ డిపార్టుమెంట్, సివిల్ సొసైటీ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మ్యూజియం డే'ను 2025 మే 18న హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని సెంటినరి హెరిటేజ్ మ్యూజియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు "ఎ మ్యూజియం డే వాక్" చేశారు. అనంతరం మ్యూజియంలో టెర్రకోట (మట్టి) కుండలు, గార వస్తువులు (మానవుని చేతి, ముఖం), రాతి విగ్రహాలు (బుద్ధుని, మానవుడు, శ్రీదేవి, భూదేవి), బిద్రి, లోహపు వస్తువులు, ఫర్నిచర్, పింగాణి పాత్రలు, రామప్ప ఆలయం, సంగేమేశ్వరం, త్రికుటాలయం, కపిలేశ్వరం, ఈశ్వరస్వామి ఆలయం (పాలమర్రి) ప్రదర్శిస్తూ, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఒయు, ఆర్కిటెక్ట్ కాలేజ్ విద్యార్థులు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, మ్యూజియంలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పలువురు మ్యూజియం నిపుణులు వివరించారు. ముందుగా,

డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి స్వాగతోపన్యాసం చేశారు.

అనంతరం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే నేషనల్ మ్యూజియం అతి ఉత్తమమైనదన్నారు. కుతుబ్‌షాహి పీరియడ్, అజఫ్‌షాహి పీరియడ్‌ల వరకు మ్యూజియంలకు ప్రాముఖ్యత ఇచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం ప్రపంచలోనే గొప్ప మ్యూజియం అని అన్నారు. బోధన్, కామారెడ్డి ప్రాంతాల్లోని తాను పర్యటించి, స్థానికులను అడిగి, అక్కడి చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను తెలుసుకొని, ఒక ప్రాజెక్టును రూపొందించానని ఈ సందర్భంగా తెలిపారు. ఎంత సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లి సాంకేతికంగా అభివృద్ధి చెందినా మన చరిత్ర, సంస్కృతిని మరువద్దన్నారు. నిజాం నవాబులు చారిత్రక సంపదను బాగా విలువనిచ్చేవారని గుర్తుచేశారు. చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను చూడటమే కాకుండా వాటి వెనుక ఉన్న నైపుణ్యత, సాంకేతికతను తెలుసుకోవాలని కోరారు.

తెలంగాణ ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ ద్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మ్యూజియం వల్ల ప్రజలకు వల్ల వినోదం, జ్ఞానం కలుగుతుందని తెలిపారు. మ్యూజియంలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగికి ఉండాలని సూచించారు. సాలార్ జంగ్ మ్యూజియం భారతదేశంలో మూడవ అతిపెద్ద సంగ్రహాలయంగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు.

### మే 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ఐకామ్) సర్వప్రతినిధి సభ తీర్మానం ప్రకారం ఏటా మే నెల 18వ తేదీని అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంగా జరుపుకోవాలని 1977లో నిర్ణయించింది. మ్యూజియం నిపుణులు ప్రజలను కలవడానికి, మ్యూజియంలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి





వారిని తెలియచేయడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతుంది. 2009లో ఎక్కువ మందిని దృష్టిని ఆకర్షించింది. 2009లో జరిగిన అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం వేడుకల్లో 90కి పైగా దేశాలలో 20,000 మ్యూజియంలు వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. 2010లో 98 దేశాలు, 2011లో 100 దేశాలు, 2012లో 129 దేశాలలో 30,000 మ్యూజియంలు ఈ వేడుకలో పాల్గొన్నాయి. 2011లో ఈ దినోత్సవ అధికారిక పోస్టర్ 37 భాషలలోకి అనువదించబడింది. 2012 నుండి ఈ సంఖ్య 38కి పెరిగింది.

అంతర్జాతీయ స్థాయిలో, సమాజ అభివృద్ధిలో మ్యూజియంల పాత్రపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉన్నది.

రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ సి.హెచ్. బాబ్జీ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వారసత్వ కట్టడాలు ఎంతో ప్రసిద్ధి చెందింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోనున్న కోటలు, గడీలు మొదలైన, వాటి ద్వారా మన చరిత్రను తెలుసుకోవచ్చని తెలియజేశారు.

వారసత్వ ఉద్యమకారుడు రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ జిల్లాకు సంబందించిన పురాతన వస్తువులను భద్రపరచడం వల్ల అక్కడి జిల్లా ప్రజలు, విద్యార్థులకు వారి జిల్లా ప్రాముఖ్యత మరియు చరిత్రను తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

ప్రముఖ చరిత్రకారులు సంగనభట్ల నర్సయ్య మాట్లాడుతూ.. పురావస్తు సంపద ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో జనగామ జిల్లాలో చాలా ఉన్నాయి. నేను జనగామ జిల్లా వాసిగా నేను చాలా గర్వపడుతున్నాను. నేడు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న సమయంలో మన గ్రామ చరిత్ర కనుమరుగు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది.

డా. శ్యాంసుందర్ రావు, స్థపతి మాట్లాడుతూ, నార్త్ ఇండియా నుండి మొదలైన బౌద్ధం తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నది ఒడ్డు నుండి కృష్ణా నది ఒడ్డున గల నాగార్జున సాగర్ వరకు విస్తరించిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీల వివిధ దేశాల నుంచి పాల్గొన్న ప్రపంచ సుందరీమణులు బుద్ధవనంను సందర్శించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్ ధనుంజయ, అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, అసిస్టెంట్ ఆఫ్ అర్కియాలజి కె.రూపిక, సూపరిటెండెంట్ రాజు, ప్రముఖ ఫోటోగ్రాపర్ రమేశ్ దెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు కో-ఆర్డినేటర్ ప్రభాకర్, ఇన్‌చార్జి ఖైజర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

– ఖైజర్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# సేవ్ ఓషన్.. సేవ్ లైఫ్

## జూన్ 8న మహాసముద్రాల దినోత్సవం

సముద్రాలంటే మనకు గొప్ప ఫాసినేషన్. సముద్రాన్ని ఒక్కసారి కూడా కళ్లతో చూడకున్నా, ఆ సముద్రాన్ని బాల్యంలోనే పరిచయం చేసుకొని ఉంటాం. దాన్ని కలలు కనుంటాం. కథలుగా వినుంటాం. కథలు కథలుగా చెప్పుకొని ఉంటాం. ఒక్కసారైనా చూసొస్తే ఇంక తెలీకుండానే ప్రేమలో పడిపోతాం. మనకు ఏకాంతాలన్నా సముద్రాలే, సమాధానాల్లేని ప్రశ్నలకైనా సముద్రాలే! అలాగని ఉల్లాసాన్నిచ్చేదిగా మాత్రమే ఉంటే అది మనం ఇంత ఇష్టపడే సముద్రం అయ్యేది కాదు. జీవి మనుగడకు కూడా సముద్రం ఒక కేంద్రం. అది లేకపోతే మన ఈ జీవితాన్ని ఇలాగే ఊహించుకోను కూడా లేం. మనకు ఇన్ని ఇచ్చి, ఇంతా చేసిన సముద్రానికి మనం తిరిగి ఏమిస్తున్నామంటే? కాలుష్యం. ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాల కాలుష్యం. సముద్రం ఉప్పు తిని మనం చేస్తోంది ఏంటంటే.. ఆ సముద్రాన్నే ముంచేస్తున్నాం. ఇప్పటికీ ఓ అవకాశం ఉంది, ఎప్పటికీ ఉండదు అది.. సేవ్ ఓషన్... సేవ్ లైఫ్..



ఒకప్పుడు అన్నీ సముద్ర ప్రయాణాలే. విమానాలు వచ్చాక నీటిపై ప్రయాణాలు చాలా వరకు తగ్గిపోయాయి. కేవలం సరుకులే రవాణా అవుతున్నాయి. అంతెందుకు విదేశీయులు మన గడ్డను చేరుకుంది కూడా సముద్రమార్గంలోనే. మనం భూమిపై ఎంత ఆధారపడి ఉన్నామో, పరోక్షంగా సముద్రాలపై కూడా అంతే ఆధారపడి జీవిస్తున్నాం. పర్యావరణ సమతుల్యానికి, మనిషి జీవించే వాతావరణం ఉండేందుకు సముద్రాలు ఎంతో సహకరిస్తున్నాయి. సముద్రాలే లేకుంటే మనిషి బతకడం కష్టతరంగా మారుతుంది. వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింటుంది.

### ఎలా ప్రభావితం చేస్తుంది?

భూ వాతావరణాన్ని మార్చేది సముద్రాలే. భూమి పై వాతావరణ మార్పులపై సముద్రాలు చాలా ప్రభావం చూపిస్తాయి. అన్నింటి కన్నా ముఖ్యంగా వర్షాలు, రుతు పవనాలు రాక సముద్రాల వల్లే వీలవుతుంది. రుతుపవనాలే రాకపోతే భూమి పరిస్థితి, భూమిపై నివసించే మనుషులు ఏమవుతారో ఓసారి ఊహించుకోండి. తుఫానులు, గాలులకు సముద్రాలే ముఖ్యం. భూమిపై ఉష్ణోగ్రతలను పూర్తిగా నియంత్రించేది సముద్రమే. అలాగే కొన్ని విషపూరితమైన వాయువులను కూడా సముద్రం పీల్చుకుంటుంది. దీని వల్ల మనుషులపై ఎలాంటి ప్రభావం ఉండదు. సముద్రాలు లేని భూమిపై మనిషి ఎంతో కాలం జీవించ లేడు. కరవు కాటకాలతో మానవజాతే అంతరించిపోతుంది.

### ఆర్థికంగానూ...

సముద్రంలో ఉండే మత్స్య సంపద గురించి ఎంత చెప్పినా తక్కువే. కోట్ల మంది సముద్రంలోని జీవులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వాటిని అమ్ముకోవడం ద్వారా వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సముద్రాలు కోట్లాది మందికి ఆహార భద్రతలను, ఉపాధిని కల్పిస్తున్నాయి. 2030 నాటికి సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా 40 మిలియన్ల మంది ఉపాధి పొందుతారని అంచనా. సముద్ర గర్భంలో నూనె, సహజ వాయువు, విలువైన ఖనిజాలు లభిస్తాయి. వాటిని కూడా వెలికి తీస్తున్నారు.

### సగం ఆక్సిజన్

భూమికి, భూమిపై జీవించే మనుషులకు కావాల్సిన ఆక్సిజన్లో సగం ఆక్సిజన్ ను అందించేది సముద్రాలే. భూమిపై జీవావరణ పరిస్థితులు కల్పించడంలో ప్రధాన పాత్రను ఇవే పోషిస్తున్నాయి. కానీ వీటినే కలుషితం చేసి సముద్ర జీవుల మరణానికి కారణం అవుతున్నాడు మనిషి. దీని వల్ల జీవావరణ సమతుల్యత, జీవ వైవిధ్యం లోపిస్తుంది. ఇది తిరిగి మనిషిపైనే ప్రభావం చూపిస్తుంది. అందుకే సముద్రాల ప్రాధాన్యతను మనుషులకు చెప్పేందుకు ప్రతి ఏడాది జూన్ 8న 'మహా సముద్రాల దినోత్సవం' నిర్వహించుకుంటున్నాం.

ప్రపంచంలోనే అతి లోతైన ప్రదేశం మెరియానా ట్రెంచ్. ఇది పసిఫిక్ మహాసముద్రంలో ఉంది. దీని లోతు 35,838 అడుగులు. 1960లో మనుషులు ఈ ప్రదేశానికి వెళ్లి వచ్చారు.

### 2025 థీమ్:

*"అద్భుతం: మనల్ని నిలబెట్టేది నిలబెట్టడం".* ఈ థీమ్ సముద్రం యొక్క అద్భుతం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. దాని పరిరక్షణ, స్థిరమైన ఉపయోగం యొక్క అవసరాన్ని దృష్టిని ఆకర్షిస్తుంది. ఇది ఫ్రాన్స్‌లోని నైస్‌లో 2025 UN మహాసముద్ర సమావేశంతో సమానంగా ఉంటుంది.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

### ఇందిరా మహిళా శక్తి బజారులో సింగరేణి సేవా సమితి స్టాల్‌ను సందర్శించిన

# ప్రపంచ సుందరీమణులు

## సేవా సమితి ఉత్పత్తులపై ప్రశంసలు





ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో మే 22న హైదరాబాద్‌లోని శిల్పారామాన్ని సందర్శించిన అనంతరం ప్రపంచ సుందరీమణులు పక్కనే ఉన్న ఇందిరా మహిళా శక్తి బజారును సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారుల వస్తు విక్రయశాలను కూడా వారు సందర్శించారు.

వివిధ ఏరియాల నుండి సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందిన మహిళలు తయారుచేసి విక్రయశాలలో ఉంచిన బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్ చేసిన దుస్తులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విక్రయశాలలో ఉన్న స్వయం ఉత్పత్తి యూనిట్ల మహిళలతో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వివిధ ఉత్పత్తుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు.

మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు చక్కగా ఉన్నాయి అంటూ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ స్థాయి సుందరీమణుల నుంచి ప్రశంసలు అందుకోవడం మాకు గర్వకారణమని సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

తమకు సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించిన సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన సీఎండీ ఎన్.బలరామ్‌కు స్టాల్‌లో ఉన్న సేవా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే మారుమూల ప్రాంతంలో ఉన్న తమకు హైదరాబాద్‌లో స్టాల్‌తో పాటు వసతి, రవాణా సదుపాయాన్ని కల్పించడమే కాకుండా ప్రపంచ సుందరీ మణులను ఇక్కడకు తీసుకొచ్చి తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించిన సెర్ప్ సీఈవో శ్రీమతి దివ్యా దేవరాజన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ సంస్థ)
ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్

# జపాన్‌లో వరి సంక్షోభం

జపాన్‌లో వరి సంక్షోభం అమెరికాతో సుంకాల చర్చలలో ప్రధాన పంటను ఉపయోగించడాన్ని పరిగణించమని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తోంది. జపాన్‌లో బియ్యం సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందంటే, 25 సంవత్సరాలకు పైగా తర్వాత మొదటిసారిగా దక్షిణ కొరియా నుండి బియ్యాన్ని దిగుమతి చేసుకుంది.

జపాన్‌లో బియ్యం ప్రధాన ఆహారం, అందువల్ల సున్నితమైన వస్తువు మరియు దాని దిగుమతులను పెంచడం వల్ల సంభావ్య పరిణామాలు ఉండవచ్చు. జపాన్ తన బియ్యం సరఫరాలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇప్పుడు అమెరికా (యుఎస్)తో సుంకాల చర్చలలో ప్రధాన పంటను కేంద్రంగా ఉంచాలని పరిశీలిస్తోంది.

జపాన్ వ్యవసాయం, అటవీ, మత్స్య మంత్రిత్వ శాఖ తన అత్యవసర నిల్వలను ఉపయోగించుకుని 2,10,000 టన్నులకు పైగా బియ్యం నిల్వలను వేలానికి విడుదల చేయాలని నిర్ణయించిన అరుదైన చర్య ద్వారా సంక్షోభం యొక్క పరిధిని అంచనా వేయవచ్చు. అయితే, మంత్రిత్వ శాఖ ఈ తీరని చర్య తీసుకున్నప్పటికీ, బియ్యం రిటైల్ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. సూపర్ మార్కెట్లలో విస్తృతంగా దొరుకుతాయి.



జపాన్ దిగుమతులు అవుతున్నట్లు నివేదించబడింది. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO)తో కుదుర్చుకున్న 'కనీస యాక్సెస్' ఒప్పందం ప్రకారం, ప్రతి సంవత్సరం 7,00,000 టన్నులకు పైగా బియ్యాన్ని సుంకం లేకుండా సరఫరా చేస్తోంది. ఆ దేశం ఇప్పుడు అమెరికా ప్రభుత్వంతో సుంకం చర్చలలో చర్చల సాధనంగా అమెరికా నుండి పెరిగిన బియ్యం దిగుమతులను ఉపయోగించు కోవాలని పరిశీలిస్తోందని మీడియా నివేదికలు చెబుతున్నాయి.

అయితే, డేటా, విశ్లేషణ సంస్థ గ్లోబల్‌డేటా ప్రకారం, ఈ చర్య రెండు వైపులా పదును ఉన్న కత్తి కావచ్చు. జపాన్ బదులుగా దాని రిజర్వ్ బియ్యం వ్యవస్థను విస్తృతం చేయాలి. జపాన్‌లో బియ్యం ప్రధాన ఆహారం, అందువల్ల సున్నితమైన వస్తువు. దాని దిగుమతులను పెంచడం వల్ల సంభావ్య పరిణామాలు ఉండవచ్చు.

ప్రస్తుత పరిస్థితి జపాన్ వ్యవసాయ వ్యూహంలోని దుర్బలత్వాన్ని ప్రధానంగా చేస్తుందని గ్లోబల్‌డేటాలో వినియోగదారు విశ్లేషకుడు మిత్సు కొనిషి అన్నారు.

"కేంద్రీకృత నియంత్రణపై ప్రభుత్వం చారిత్రకంగా ఆధారపడటం వల్ల అసమర్థతలు తలెత్తాయి. ప్రస్తుత సరఫరా సంక్షోభం వాటిని ఇప్పుడు బహిర్గతం చేస్తోంది. రిజర్వ్ బియ్యం వేలం ప్రక్రియ కొరతను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వినియోగదారులకు ఇంకా తక్కువ ధరలు లభించలేదు" అని ఆమె అన్నారు.

### ప్రస్తుత సంక్షోభం ఎందుకు?

2023లో తీవ్రమైన వేడి కారణంగా వరి పంట దెబ్బతింది. 2024 ఆగస్టులో 'మెగాక్వేక్' సంభవించే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసిన తర్వాత భయాందోళనలకు గురైన కొనుగోళ్లు, లాజిస్టికల్ ఎదురుదెబ్బలు, దాని స్వంత దేశీయ ఆర్థిక విధానాలు వంటి అంశాల కలయిక కారణంగా 2024 వేసవి నుండి కొరత, అధిక ధరలు కొనసాగుతున్నాయి.

ధరలను ఎక్కువగా ఉంచడానికి, దేశీయ రైతులకు మద్దతు ఇవ్వడానికి, జపాన్ వరి ఉత్పత్తిని పరిమితం చేస్తుంది. రైతులు తమ ఉత్పత్తులను సేకరణ ఏజెంట్లకు విక్రయిస్తారు. వారు దానిని టోకు వ్యాపారులకు విక్రయిస్తారు. దుకాణాలు, రెస్టారెంట్లు ఈ టోకు వ్యాపారుల నుండి కొనుగోలు చేస్తాయి.

### విధాన లొసుగులు

జపాన్ విస్తీర్ణం తగ్గింపు విధానాన్ని కలిగి ఉంది. దీని కింద అది బియ్యం ఉత్పత్తిని కఠినంగా పరిమితం చేస్తుంది. దేశీయ వరి సాగుదారుల ధరలను ఎక్కువగా ఉంచుతూ మిగులు బియ్యాన్ని మార్కెట్‌కు దూరంగా ఉంచడానికి దిగుమతి నియంత్రణలను కలిగి ఉంది. కానీ దీని అర్థం సరఫరా గొలుసుకు చిన్న అంతరాయాలు కూడా ఈ ప్రధాన పంటపై పెద్ద ప్రభావాలను చూపుతాయి.

ప్రస్తుత పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జపాన్ 25 సంవత్సరాలకు పైగా మొదటిసారిగా దక్షిణ కొరియా నుండి బియ్యాన్ని దిగుమతి చేసుకుంది. COVID-19 మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో దేశంలో ఎదుర్కొన్న అధిక సరఫరాకు ఈ కొరత పూర్తి భిన్నంగా ఉంది.

కొనసాగుతున్న కొరతకు మరింత ప్రభావవంతమైన ప్రతిస్పందన కఠినమైన విధానాలను సడలించడం అని కోనిషి అభిప్రాయపడ్డారు.

"జపాన్ జూలై 2025లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, జపాన్ వినియోగదారులు తమ దైనందిన వస్తువు అయిన బియ్యం పట్ల బలంగా అనుబంధం కలిగి ఉన్నందున, ప్రభుత్వం వ్యవసాయ విధానం మరియు వినియోగదారుల మనోభావాల సంక్లిష్టతలను జాగ్రత్తగా పరిశీలించాలి. అభివృద్ధి చెందుతున్న బియ్యం పరిస్థితి రాజకీయ స్థిరత్వం మరియు ప్రజల విశ్వాసానికి కీలకమైన బేరోమీటర్‌గా ఉపయోగపడుతుంది. ఇది తక్షణ సరఫరా సమస్యలు, జపాన్ వ్యవసాయ రంగం యొక్క దీర్ఘకాలిక సాధ్యత రెండింటినీ పరిష్కరించే సమతుల్య వ్యూహాల అవసరాన్ని నొక్కి చెబుతుంది" అని కోనిషి అన్నారు.

-షాగున్‌జి

అనువాదం: దక్కన్ న్యూస్

# 'క్లోర్‌పైరిఫోస్' పురుగుమందు నిషేధించాలి!

ప్రమాదకరమైన పురుగుమందు 'క్లోర్‌పైరిఫోస్'పై మినహాయింపులు లేకుండా ప్రపంచవ్యాప్తంగా నిషేధం విధించాలని తిరిగి ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, నీరు, మానవ రక్తం, తల్లి పాలలో కూడా క్లోర్‌పైరిఫోస్ అవశేషాలు కనుగొనబడ్డాయి. 2003లో జరిగిన ఒక భారతీయ అధ్యయనం ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నిర్దేశించిన భద్రతా పరిమితి కంటే 41 రెట్లు ఎక్కువ స్థాయిలను నివేదించింది.

క్లోర్‌పైరిఫోస్ వంటి ప్రమాదకర పురుగుమందులను పూర్తిగా ప్రపంచవ్యాప్తంగా నిషేధించాలనే డిమాండ్ మరోసారి ప్రారంభమైంది. స్టాక్‌హోమ్ కన్వెన్షన్ కింద జెనీవాలో జరుగుతున్న సమావేశంలో, పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ (పాన్) ఇంటర్నేషనల్ శాస్త్రవేత్తలు, ప్రతినిధులు ఈ రసాయన పురుగుమందును ఎటువంటి మినహాయింపులు లేకుండా అనుబంధం Aలో జాబితా చేయాలని సిఫార్సు చేశారు.



Annex A అనేది స్టాక్‌హోమ్ కన్వెన్షన్ యొక్క అధికారిక అనుబంధం. ఇది ప్రపంచ వ్యాప్తంగా పూర్తిగా నిషేధించబడాలి లేదా తొలగించబడాలి అనే ప్రమాదకరమైన రసాయనాలను జాబితా చేస్తుంది. Annex Aలో మినహాయింపులు లేకుండా చేర్చబడిన రసాయనాలు లేదా పురుగుమందులు ప్రపంచ ఉత్పత్తి, ఉపయోగం, దిగుమతి మరియు ఎగుమతి నుండి నిషేధించబడ్డాయి.

స్టాక్‌హోమ్ కన్వెన్షన్ అనేది పెర్సిస్టెంట్ ఆర్గానిక్ పొల్యూటెంట్స్ (POPs) ఉత్పత్తి, వినియోగం, వాణిజ్యం, ఉద్గారాలను దశలవారీగా తొలగించడం లేదా కఠినంగా నియంత్రించడం లక్ష్యంగా పెట్టుకున్న అంతర్జాతీయ ఒప్పందం. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతున్న ప్రస్తుత సమావేశం ఏప్రిల్ 28న ప్రారంభమై మే 9, 2025 వరకు కొనసాగింది.

సమీక్షా సమావేశంలో, పాన్ ఇంటర్నేషనల్ సీనియర్ శాస్త్రవేత్త ఎమిలీ మార్క్వెజ్ మాట్లాడుతూ.. తక్కువ స్థాయిలో క్లోర్‌పైరిఫోస్ కూడా పిల్లల మెదడు అభివృద్ధిపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని, జీవితాంతం పరిణామాలను కలిగిస్తుందని అన్నారు. ఈ పురుగుమందు వ్యవసాయ క్షేత్రాలకే పరిమితం కాకుండా ఆర్కిటిక్ వంటి మారుమూల ప్రాంతాలలో కూడా కనుగొనబడిందని, దీని దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వాన్ని హైలైట్ చేస్తుందని ఆమె పేర్కొన్నారు.

అదనంగా, స్టాక్‌హోమ్ కన్వెన్షన్ కింద స్థాపించబడిన POPs రివ్యూ కమిటీ (POPRC) నుండి వచ్చిన ఫలితాల ద్వారా పురుగు మందును నిషేధించాలనే వాదనలు బలపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా దశలవారీ నిషేధానికి క్లోర్‌పైరిఫోస్ అన్ని ప్రమాణాలను తీరుస్తుందని కమిటీ నిర్ధారించింది.

ఇంతలో, పాన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడి దిలీప్ కుమార్ భారతదేశంలో దాని ప్రభావాన్ని హైలైట్ చేస్తూ, వ్యవసాయ ఉత్పత్తులు, నీరు, మానవ రక్తం మరియు, తల్లి పాలలో కూడా క్లోర్‌పైరిఫోస్ అవశేషాలు కనుగొనబడ్డాయని వెల్లడించారు. 2003 భారతీయ అధ్యయనం ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నిర్దేశించిన భద్రతా పరిమితి కంటే 41 రెట్లు ఎక్కువగా ఉందని నివేదించింది.

ఈ రసాయనం రైతులు, వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, అంతర్జాతీయ వాణిజ్యంలో జాడలు భారతదేశ వ్యవసాయ ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీస్తాయి.

పాన్ ఆసియా పసిఫిక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అలియా దయానా అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల ప్రత్యేక ఆందోళన వ్యక్తం చేశారు: "ఇటువంటి పురుగుమందులు దుర్బల వర్గాలను అసమానంగా ప్రభావితం చేస్తాయి. పుట్టబోయే పిల్లలు కూడా ప్రమాదంలో ఉన్నారు, తెలివితేటలు, జ్ఞాపకశక్తికి శాశ్వత నష్టం వాటిల్లుతోంది."

క్లోర్‌పైరిఫోస్ యొక్క ప్రస్తుత ఉపయోగాలన్నింటికీ వ్యవసాయ-పర్యావరణ మరియు సేంద్రీయ తెగులు నిర్వహణ పద్ధతులతో సహా సురక్షితమైన, ప్రభావవంతమైన ప్రత్యామ్నాయాలు ఇప్పటికే ఉన్నాయని మూడు సంస్థలు నొక్కిచెప్పాయి. అందువల్ల, దాని నిరంతర ఉపయోగం కోసం ఎటువంటి శాస్త్రీయ లేదా వాణిజ్య సమర్థన లేదు.

స్టాక్‌హోమ్ కన్వెన్షన్ యొక్క అనుబంధం Aలో మినహాయింపులు లేకుండా క్లోర్‌పైరిఫోస్‌ను చేర్చాలని, ఈ విషపూరిత పురుగుమందుపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం ఉండేలా చూడాలని వక్తలు ఏకగ్రీవంగా కోరారు.

–వివేక్ మిశ్రా

అనువాదం: దక్కన్ న్యూస్



# పూటకూళ్ళవ్వ

(*జరిగిన కథ:* పొరుగు రాష్ట్రం నుండి వచ్చిన ఒక కుటుంబంలోని పిల్లలు తుపాకీ బొమ్మలతో ఇబ్బంది పెడుతుంటే ఆ వ్యసనం మాన్పించాలని అనుకుంటుంది అవ్వ.)

(గత సంచిక తరువాయి)

“మీరు ఇక్కడ ఎన్ని రోజులు ఉంటారు?” తల్లిదండ్రులను అడిగింది అవ్వ.

“ఇంకొక రోజు ఉంటాం” సమాధానం ఇచ్చారు వాళ్లు.

“ఎలాగైనా వీరిని మార్చాలి... నావిడిదిలోనే ఇలా చేసారంటే ఎటు వెళ్లినా ఇంతే కదా” అనుకుంటూ ఆలోచనలో పడింది. అప్పుడప్పుడు అవ్వను పలకరించడానికి వచ్చే చుట్టుపక్కల పిల్లల్ని ఆ సాయంత్రమే పిలిచింది. వాళ్లతో “తొక్కుడు బిళ్ళ... దాగుడు మూతలు... చిర్రగోని (గోళీలాట).. కోకో..” అన్నీ కొద్దిసేపు ఆడించింది. ఇవన్నీ గన్‌తో ఆడుకుందాం అని బయటికి వచ్చిన పిల్లలిద్దరూ ఆశ్చర్యంగా చూడసాగారు. వాళ్లు చప్పట్లు కొడుతూ నవ్వుతూ సంతోషంగా ఆడుతుంటే... “వీళ్ళిద్దరి దగ్గర ఏదో తక్కువైనట్టు, వాళ్ళలాగా ఇంత సంతోషం తమకు ఎప్పుడు కలగలేదని” ఆ చిన్ని బుర్రలకు అనిపించసాగింది. ఇంతలో వీళ్లను చూసి “మీరు కూడా ఆడండి” అని సైగ చేసారు. అప్పటిదాకా ఆపుకున్న కోరికను ఇక ఆపుకోలేక వీళ్ళు కూడా పరిగెత్తుకెళ్లారు. ఆడుతుంటే అందులో ఒకరికి చేతిపై చిన్నగా ఎర్రగా కందిపోయి ఉంది. “ఏమైంది నీ చేతికి?” అన్నా చెల్లెలిద్దరూ ఒకేసారి అడిగారు. “మీరు ఉదయం గన్‌తో షూట్ చేసినప్పుడు నాకు గట్టిగా తగిలింది. ఇంకా కొంచెం నొప్పిగా కూడా ఉంది” అంది ఆ పాప.

“అది విని వీళ్ళిద్దరికీ చాలా బాధ కలిగింది. మన వల్ల ఈ కొత్త దోస్త్‌కి ఇంత నొప్పి కలిగిందా?”. “అమ్మా నాన్న ఇన్ని రోజులూ ఎంత చెప్పినా అర్థం చేసుకోలేదు.. ఇక నుండి ఇలా చేయొద్దు మనం... ఫోన్లలో ఆడే కంటే ఇలా ఆడుకుంటేనే ఎంతో సంతోషంగా ఉంది కూడా” అనుకున్నారు.

అనుకున్న దానికంటే ఇంకొక రోజు ఎక్కువే ఉందామని పిల్లలు మారాం చేసేసరికి... “ఇంతకన్నా కావాల్సిందేముంది!? వీళ్లు మారారు అదే చాలు” అనుకున్నారు తల్లిదండ్రులు. అవ్వకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

× × ×

ఒకరోజు అవ్వ బయట గాంధీజీ విగ్రహం ముందర ఉన్న వరండాలో కూర్చుని ఆలోచిస్తోంది. "దసరా పండుగ దగ్గర పడుతుండటంతో కావచ్చు. రెండు రోజుల నుండి ఎవరూ ఎక్కువగా రావడం లేదు. ఏమిటో... వచ్చిపోయే వాళ్లతోనే నా జీవితంకు ఎవరో ఒకరు తోడున్నట్టుగా ఉంటుంది. ఇలా ఎవరూ లేకపోతే చిన్నబోయినట్టుగానే ఉంది".. అని అనుకుంటుండగానే రెండు స్కూల్ వ్యాన్లు వచ్చి ఆగాయి.

అవ్వలేచేలోపలే వ్యాన్‌లో నుండి దిగిన టీచర్లు అవ్వకు ఎదురు వచ్చారు. "పిల్లల్ని రెండు రోజుల కోసం టూర్‌కి తీసుకొచ్చామని, మాకు వసతి కావాలని" అంటూ అవ్వని అడిగారు.

గదులు ఖాళీగానే ఉన్నా... అవ్వ ఆలోచనలో పడింది. "ఇలా ఇంతమంది పిల్లలకు గదులిస్తే ఏమైనా ఇబ్బంది అవుతుందేమో!" చూస్తుంటే... టీచర్లు పిల్లలు కలిసి సుమారు 50 మంది దాకా ఉన్నారు.

అవ్వ ఏమీ మాట్లాడకపోవడంతో టీచర్లకు ఆందోళన మొదలైంది. "అవ్వా! ఈ చుట్టుపక్కల ఎవరినడిగినా.. మీ విడిది బాగుంటుందని చెప్పారు. అందుకే అన్ని వదులుకొని ఇక్కడికి వచ్చాము. మీరు ఇవ్వకపోతే మాకు, పిల్లలకు చాలా కష్టం అవుతుంది. డబ్బులు మీరెంత అంటే అంత ఇస్తాము. దయచేసి గదులు ఇవ్వండి" అని వేడుకున్నట్టుగా అడిగారు.

అవ్వది అసలే జాలి గుండె. ఇంకేం అనుమాన పడకుండా వెంటనే "సరే" అంది.

అందరూ సంతోషంగా గదుల్లోకి వెళ్లిపోయారు. సాయంత్రం దాకా టిఫిన్లు, భోజనాలు చేస్తూ దగ్గరివన్నీ తిరిగి వచ్చారు. ఒకసారి వాళ్ళందరినీ పలకరిద్దామని సాయంత్రం వారి గదుల్లోకి వెళ్లింది అవ్వ. ఎంతో శుభ్రంగా ఉండే గదులు చాలా అశుభ్రంగా చేసేసారు. ప్రతి గదిలోనూ.. గది ముందర చెత్తబుట్టలు పెట్టించినా... పిల్లలు చిరుతిండ్లు తిని ఖాళీ చేసిన కవర్లు, పేపర్లు చిందర వందరగా పడేసారు. అవ్వకు బాగా కోపం వచ్చింది... కానీ, ఎవరితోనూ కోపంగా మాట్లాడటం అలవాటు లేక నెమ్మదిగానే వాళ్లను మందలించింది. "పిల్లలు కదండీ... మేము చెబుతాం లెండి ఇంకోసారి అలా చేయొద్దని" అంటున్న టీచర్ల మాట విని ఊరుకున్నా.. తెల్లవారి ఉదయం కూడా మళ్లీ అలాగే చేయటంతో "ఇక లాభం లేదు. ఈరోజు హోమ్ థియేటర్ ఓపెన్ చేయాల్సిందే" అనుకుంది.

**(మిగతా కథ వచ్చే సంచికలో)**

- మాదారపు వాణిశ్రీ
ఫోన్ : 9247286668
బొమ్మలు: కైరం బాబు

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
**- మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**
వార్షిక చందా : రూ. 300    2 సం॥లకు : రూ. 600
*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**
**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |

# “భూపతి చంద్ర” స్మారక కథానికల బహుమతుల ప్రదానోత్సవ సభ - 2025

తేది : 2025 మే 18
తెలంగాణ సారస్వత పరిషత్తు,
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్










**రామచంద్రమూర్తి మాట్లాడుతూ..**

సాహితీ ప్రక్రియలలో తనకు కూడా కథానిక ప్రక్రియ ఎంతో ఇష్టమని, తాను హెచ్ఎం టీవీలో ఉన్నప్పుడు కీ.శే.గురజాడ అప్పారావు 1910లో రచించిన తొలి తెలుగు కథానిక “దిద్దుబాటు” మొదలుకొని వందేండ్ల కథకు వందనాలు పేరిట కీ.శే. గొల్లపూడి మారుతీరావుగారి పర్యవేక్షణలో వంద కథలను సమీక్షించామన్నారు.

**మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ..**

ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఎం.ఎల్.కాంతారావుగారు నాతో ఈ విషయం మొదటిసారిగా మాట్లాడినప్పుడు ఇది చాలా మంచి నిర్ణయమని ముందుకు వెళ్లండని ప్రోత్సహించాను అని అన్నారు.













భూపతి చంద్రం మెమోరియల్ ట్రస్ట్, ప్రజ్ఞాపూర్, సౌజన్యంతో

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - May 2025
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

VOL 13వ వసంతంలో
154 ISSUES నూట యాభై నాల్గవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2025 జూన్ సంచికతో 154 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar